# ప్రజా వాయిస్

/ PRAJA VOICE

WWW.PRAJAVOICE.IN

PRAJA VOICE ఇది ప్రజల గొంతుక

సంపుటి: 02 సంచిక: 59 ఎడిటర్: మేనం శ్యామ్ గురువారం 17-09-2026 పేజీలు: 10


## సిరా చుక్క

నిజాం కోట గోడల మధ్య
నలిగిన నాటి తెలంగాణ..
అణచివేత చీకటిలోనూ
ఆరని దీపం ప్రజా ధైర్యం !
భూమికోసం, భుక్తి కోసం
బతుకు కోసం పోరాడిన నేల,
రక్త మోడిన వెనుతిరగని వీరుల
అడుగుజాడల నేల నా తెలంగాణ !
రజాకార్ల దౌర్జన్యాల మధ్య వణికి
నా పల్లెలు ఎన్నో ఆనాడు !
స్వేచ్ఛ కోసం ఒక్కటై కదిలాయి
ఎన్నో మండే గుండెలు...
సెప్టెంబర్ 17 చరిత్రలో నిలిచిన రోజు,
హైదరాబాద్ సంస్థానం భారత దేశంలో
విలీనం చేసిన రోజు !
సెప్టెంబర్ 17 ఒక తేదీ కాదు,
రజాకార్ల వేదనకు
ముగింపు పలికిన జ్ఞాపకం..
పోరాటాలకు గౌరవం తెలిపిన సందర్భం...
రజాకార్ల నుండి స్వేచ్ఛ విలువను
ప్రపంచానికి చాటిన సందేశం...
తేదీలు క్యాలెండర్ లో ఉంటాయి,
కానీ త్యాగాలు తరాల గుండెల్లో ఉంటాయి.
సెప్టెంబర్ 17 ఒక తేదీ కాదు,
తెలంగాణ చరిత్రలో ఒక మలుపు,
అది రజాకాలనుండి
విముక్తి మాత్రమే కాదు,
ఒక కొత్త ఆరంభానికి నాంది..
పోరాటం ఎలా చేయాలో
భావితరాలకు తెలిపే రోజు !
వీరుల త్యాగాలకు వందనం...
స్వేచ్ఛకు శిరస్సు వంచి నమస్కారం...
చరిత్రకు మనసారా జోహార్లు...
జై తెలంగాణ జైహింద్
రమేష్ గాండ్ల
వర్ధన్నపేట

# కేసీఆర్ ఫాంహౌస్‌పై విచారణకు రేవంత్ ఆదేశాలు

- 30 రోజుల్లో నివేదిక
- ఎర్రవెల్లి ఫాంహౌస్ భూములపై సమగ్ర విచారణకు ఆదేశం
- 700 ఎకరాల భూమిపై హక్కులు తేల్చాలని కలెక్టర్‌కు సూచన
- భూములు స్వాధీనం చేసుకుని పేదలకు పంపిణీ చేస్తామన్న సీఎం
- కల్వకుంట్ల కుటుంబ భూముల వివరాలను సభలో వెల్లడించిన రేవంత్
- సత్యం కుంభకోణం, హరీశ్ రావు ఫాంహౌస్ భూములపైనా ఆరోపణలు





**ప్రజా వాయిస్, హైదరాబాద్:** మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, కల్వకుంట్ల కుటుంబంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీ వేదికగా తీవ్ర ఆరోపణలు చేశారు. గజ్వేల్ నియోజకవర్గం ఎర్రవెల్లిలోని కేసీఆర్ ఫాంహౌస్ భూములపై విచారణకు ఆదేశించారు. ఫాంహౌస్ భూములకు సంబంధించి తక్షణమే నోటీసులు జారీ చేసి విచారణ చేపట్టాలని, 30 రోజుల్లో నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. విచారణలో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

**700 ఎకరాల భూమిపై విచారణ**

కేసీఆర్ ఫాంహౌస్ ఆధీనంలో సుమారు 700 ఎకరాల భూమి ఉందని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఆ భూమికి సంబంధించిన హక్కులు, వినియోగం, చట్టబద్ధతపై పూర్తి వివరాలు తేల్చాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. 30 రోజుల్లో భూమిని స్వాధీనం చేసుకుని పేదలకు పంపిణీ చేస్తామని సీఎం ప్రకటించారు. ముఖ్యంగా ఆ భూములకు ఎస్సీలను యజమానులుగా చేస్తామని వెల్లడించారు.

**కేటీఆర్, హరీశ్ రావు ఫాంహౌస్‌లపైనా ఆరోపణలు**

సత్యం కుంభకోణానికి సంబంధించిన భూముల్లోనే కేటీఆర్ ఫాంహౌస్ ఉందని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఆ భూములు కేటీఆర్ బంధువుల పేర్లకు బదిలీ అయ్యాయని పేర్కొన్నారు. అలాగే సిద్దిపేట మున్సిపాలిటీ నిధులతో హరీశ్ రావు ఫాంహౌస్‌కు రహదారులు వేయించారని, నీటిపారుదల శాఖ కోసం సేకరించిన భూమిలోనే ఆయన ఫాంహౌస్ ఉందని ఆరోపించారు. హైదరాబాద్ బాలానగర్‌లో 120 ఎకరాల భూమిని హరీశ్ రావు కుటుంబ సభ్యులు ఆక్రమించుకున్నారని కూడా ఆరోపించారు.

**కుటుంబ సభ్యుల పేర్లపై భూముల వివరాలు**

కల్వకుంట్ల కుటుంబానికి సంబంధించిన భూముల వివరాలను అసెంబ్లీలో రేవంత్‌రెడ్డి వెల్లడించారు. తమ ప్రభుత్వం వద్ద ఉన్న వివరాల ప్రకారం కల్వకుంట్ల కుటుంబానికి 440 ఎకరాలు, కేసీఆర్ దంపతుల పేర్లపై 67 ఎకరాలు ఉన్నాయని తెలిపారు. కేటీఆర్ కుటుంబంలోని నలుగురి పేర్లపై 123 ఎకరాలు ఉన్నాయని పేర్కొన్నారు. అందులో కేటీఆర్ పేరుపై 49.5 ఎకరాలు, శైలిమ పేరుపై 17.5 ఎకరాలు, అలేఖ్య పేరుపై 9.38 ఎకరాలు, హిమాన్షు పేరుపై 46.3 ఎకరాలు ఉన్నాయని వివరించారు.

**ధరణి, తెలంగాణ ఉద్యమం పేరుతో దోపిడీ చేశారన్న ఆరోపణ**

తెలంగాణ ఉద్యమం, ధరణి వ్యవస్థను అడ్డుపెట్టుకుని భూముల విషయంలో అక్రమాలకు పాల్పడ్డారని సీఎం ఆరోపించారు. హరీశ్ రావు కుటుంబానికి 30 ఎకరాలు, కవిత కుటుంబానికి 37 ఎకరాలు, సంతోష్‌రావు కుటుంబానికి 79 ఎకరాలు, నవీన్‌రావు పేరుపై 52 ఎకరాలు, కొండల్‌రావు పేరుపై 48 ఎకరాల భూమి ఉందని వెల్లడించారు. ఈ భూములకు సంబంధించిన అంశాలపై ప్రభుత్వం విచారణ జరిపిస్తుందని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

## దానం నాగేందర్ అనర్హతపై ఉత్కంఠ

- తీర్పు శుక్రవారానికి వాయిదా!
- బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరడంపై విచారణ
- కాంగ్రెస్ బీ-ఫారంతో లోక్‌సభకు పోటీ అంశం కీలకం
- స్పీకర్ నిర్ణయాన్ని సవాల్ చేసిన పిటిషనర్లు
- దానం సభ్యత్వం కొనసాగుతోందని ఆయన తరపు వాదన
- తీర్పును శుక్రవారానికి వాయిదా వేసిన హైకోర్టు



**ప్రజా వాయిస్, హైదరాబాద్:** ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత వ్యవహారంపై తెలంగాణ హైకోర్టులో కీలక వాదనలు జరిగాయి. బీఆర్ఎస్ తరపున ఎమ్మెల్యేగా గెలిచిన అనంతరం కాంగ్రెస్‌లో చేరిన అంశంపై దాఖలైన పిటిషన్లను హైకోర్టు విచారించింది. ఈ వ్యవహారంపై తీర్పును శుక్రవారానికి వాయిదా వేసింది.

**లోక్‌సభ ఎన్నికల్లో పోటీ అంశం**

బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా కొనసాగుతూనే కాంగ్రెస్ బీ-ఫారంతో సికింద్రాబాద్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేయడం కీలక అంశమని పిటిషనర్ల తరపు న్యాయవాదులు వాదించారు. బీఆర్ఎస్‌కు రాజీనామా చేయకుండానే కాంగ్రెస్‌లో చేరారని వారు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.

**స్పీకర్ నిర్ణయంపై అభ్యంతరం**

పార్టీ ఫిరాయింపును నిర్ధారించేందుకు

మిగతా 2లో

## బీఆర్ఎస్ హయాంలో లక్షల ఎకరాల భూకబ్జాలు

- బండి సంజయ్ సంచలన ఆరోపణలు
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై తీవ్ర ఆరోపణలు
- సుమారు 90 మంది భూకబ్జాలకు పాల్పడ్డారన్న బండి సంజయ్
- భూకబ్జాలపై మాట్లాడితే తన తలను ఆరు ముక్కలు చేస్తానన్న కేసీఆర్ అని వ్యాఖ్య
- భూకబ్జాలను బయటపెట్టేందుకు రేవంత్‌కు వెయ్యి రోజులు పట్టిందా అని ప్రశ్న
- డ్రగ్స్, ఈ-ఫార్ములా, ఫోన్ ట్యాపింగ్, ఫామ్‌హౌస్ కేసులపై నిలదీత

2లో



## పంతాలకు పోయి పదోన్నతులు కోల్పోవద్దు

- డీజీపీ కీలక సూచనలు!
- 1991, 1995, 1996 బ్యాచ్‌ల అధికారులతో డీజీపీ సమావేశం
- 37 మంది డీఎస్పీలకు వెంటనే పదోన్నతులు కల్పిస్తామన్న హామీ
- సీనియారిటీ వివాదంతో న్యాయస్థానాలను ఆశ్రయించిన అధికారులు
- సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లి శాశ్వత పరిష్కారానికి కృషి
- కేసుల ఉపసంహరణకు పలువురు అధికారులు సుముఖత



**ప్రజా వాయిస్, హైదరాబాద్:** పదోన్నతుల విషయంలో నెలకొన్న సమస్యల కారణంగా పంతాలకు పోయి పదోన్నతులు కోల్పోవద్దని 1991, 1995, 1996 బ్యాచ్‌ల ఎస్సైలు, ప్రస్తుతం డీఎస్పీలుగా పనిచేస్తున్న అధికారులకు డీజీపీ సీవీ ఆనంద్ సూచించారు. సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లి శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.


**37 అదనపు ఎస్పీ పోస్టులు ఖాళీ**

రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం 37 అదనపు

మిగతా 2లో

## వినాయక నిమజ్జనంలో విషాదం

- ఆరుగురు విద్యార్థులు మృతి.!
- చెరువులో మునిగి ఆరుగురు విద్యార్థుల దుర్మరణం
- పటాన్‌చెరు పరిధిలోని పెద్దకం జర్లలో ఘటన
- నేరెడు చెరువులో నిమజ్జనం చేస్తుండగా ప్రమాదం
- ఒకరిని కాపాడే ప్రయత్నంలో పలువురు నీటిలోకి
- శిరీష చారిటబుల్ ట్రస్ట్ విద్యార్థులుగా గుర్తింపు



## 2028లో బీజేపీతో పొత్తు లేదు

- కేటీఆర్ కీలక ప్రకటన
- ఒంటరిగానే అసెంబ్లీ ఎన్నికల బరిలో బీఆర్ఎస్
- దామాషా పెంపుతో డీలిమిటేషన్‌కు మద్దతు
- దక్షిణాది ప్రాతినిధ్యంపై కేటీఆర్ కీలక వ్యాఖ్యలు
- ఏఐని స్వీకరించి ముందుకు సాగాలని సూచన
- తెలంగాణ స్టార్టప్ వ్యవస్థపై విద్యార్థులకు వివరణ



**ప్రజా వాయిస్, హైదరాబాద్:** 2028 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీతో ఎలాంటి పొత్తు ఉండదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. హర్యానాలోని సోనిపట్‌లో ఉన్న ఓపీ జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక ఉపన్యాసం అనంతరం విద్యార్థులతో జరిగిన ముఖాముఖిలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ ఒంటరిగానే ఎన్నికల్లో పోటీ చేస్తుందని తెలిపారు.

**బీజేపీతో పొత్తుపై స్పష్టత**

'ఇన్నోవేషన్ ఇన్ గవర్నెన్స్: ది స్టోరీ ఆఫ్ ఎ స్టార్టప్ స్టేట్' అంశంపై కేటీఆర్ ప్రత్యేక ఉపన్యాసం ఇచ్చారు. అనంతరం విద్యార్థులు అడిగిన రాజకీయ ప్రశ్నలకు సమాధానమిచ్చారు. 2028 ఎన్నికల్లో బీజేపీతో పొత్తు ఉంటుందా అని ప్రశ్నించగా.. "బీజేపీతో ఎలాంటి పొత్తు ఉండదు" అని స్పష్టం చేశారు.

**దామాషా ప్రకారం స్థానాలు పెంచితే మద్దతు**

డీలిమిటేషన్ అంశంపైనా కేటీఆర్ తన అభిప్రాయాన్ని వెల్లడించారు. దేశవ్యాప్తంగా లోక్‌సభ స్థానాలను దామాషా ప్రకారం పెంచితే డీలిమిటేషన్ బిల్లుకు మద్దతు ఇవ్వడంలో బీఆర్ఎస్‌కు అభ్యంతరం లేదని తెలిపారు. ప్రస్తుతం లోక్‌సభలో దక్షిణాది రాష్ట్రాలకు ఉన్న ప్రాతినిధ్యాన్ని ప్రస్తావిస్తూ.. స్థానాల పెంపులో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యానికి భంగం కలగకూడదని పేర్కొన్నారు.

**ఏఐపై ఆందోళనలు సహజమే**

కృత్రిమ మేధస్సు, సాంకేతిక మార్పులపై విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు కేటీఆర్ సమాధానమిచ్చారు. ప్రతి పెద్ద సాంకేతిక మార్పు వచ్చినప్పుడు ఆందోళనలు, సందేహాలు వ్యక్తం కావడం సహజమేనని అన్నారు. ఏఐతోనూ అదే పరిస్థితి ఉందని.. మారుతున్న సాంకేతికతను స్వీకరించి ముందుకు సాగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

**స్టార్టప్ వ్యవస్థపై వివరణ**

తెలంగాణలో ఆవిష్కరణలు, స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు ఏర్పాటు చేసిన టీ-హబ్, వీ-హబ్, టీ-వర్క్స్, టాస్క్ వంటి సంస్థల గురించి కేటీఆర్ వివరించారు. యువతను పరిశ్రమలతో అనుసంధానం చేయడం, మహిళా వ్యవస్థాపకతను ప్రోత్సహించడం, ఉత్పత్తుల అభివృద్ధికి తోడ్పాటు అందించడం వంటి అంశాలను ప్రస్తావించారు. ఇంక్యుబేషన్ దశ నుంచి మార్కెట్‌కు సిద్ధమయ్యే స్థాయికి ఎదిగిన స్కైరూట్‌ను తెలంగాణ స్టార్టప్ వ్యవస్థకు ఉదాహరణగా పేర్కొన్నారు.

## ఓటుకు నోటు కేసు.. సుప్రీంకోర్టులో కీలక విచారణ.!

- రేవంత్‌రెడ్డి, సండ్ర వెంకటవీరయ్య పిటిషన్లపై విచారణ
- ఏసీబీకి విచారణ అధికారం లేదన్న పిటిషనర్ల తరపు న్యాయవాదులు
- ఎన్నికల వ్యవహారంగా పరిగణించాలంటూ వాదనలు
- 2021 నాటి చట్టాలను ప్రస్తావించిన పిటిషనర్లు
- తదుపరి విచారణ తేదీని ఖరారు చేయనున్న సుప్రీంకోర్టు రిజిస్ట్రీ

2లో



# విలీనమా..? విమోచనమా..? విద్రోహమా..?



- చరిత్రలో ఒకే కోణంలో చెప్పలేని మూడు పదాలు..మూడు వాదనలు
- నిజాం సర్కార్ నుంచి భారత యూనియన్ లోకి హైదరాబాద్ సంస్థానం
- సెప్టెంబర్ 17 చరిత్రలో ఏం జరిగింది..?

**ప్రజా వాయిస్, హుజూర్ నగర్,** సెప్టెంబర్ 17(ప్రజా ఉద్యమాలు, తెలంగాణ రైతాంగ పోరాటం,రజాకార్ల హింస,ఆపరేషన్ పోలో..చరిత్రలో కొన్ని తేదీలు కేవలం క్యాలెండర్‌లోని సంఖ్యలు కావు. అవి తరతరాల జ్ఞాపకాలను, ప్రజల పోరాటాలను, రాజకీయ పరిణామాలను, విషాదాలను మోసుకొస్తాయి. అలాంటి చారిత్రక మలుపుల్లో సెప్టెంబర్ 17 ఒకటి.1948 సెప్టెంబర్‌లో హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో చేరిన పరిణామానికి సంబంధించిన ఈ తేదీపై నేటికీ భిన్నమైన రాజకీయ, సామాజిక వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి.

### అది విలీనమా..?విమోచనమా..?

లేక ప్రజా తిరుగుబాట్లు, రాజకీయ సంక్షోభం, హింసకు ముగింపు పలికిన కీలక మలుపా..?ఈ ప్రశ్నలకు సమాధానం వెతకాలంటే ఒక్క కోణాన్ని మాత్రమే చూడటం సరిపోదు. నిజాం పాలన, ప్రజా ఉద్యమాలు, తెలంగాణ రైతాంగ పోరాటం, రజాకార్ల కార్యకలాపాలు, భారత ప్రభుత్వంతో జరిగిన రాజకీయ పరిణామాలు, ఆపరేషన్ పోలో—ఇవన్నీ కలిపి చూడాల్సిన చరిత్ర ఇది.

### నిజాం పాలన.. వైభవం వెనుక వైరుధ్యాలు

హైదరాబాద్ సంస్థానానికి చివరి నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్. హైదరాబాద్ నగరం ఆ కాలంలో ఆర్థిక, విద్యా, సాంస్కృతిక రంగాల్లో అభివృద్ధి చెందినప్పటికీ, సంస్థానంలోని అనేక గ్రామీణ ప్రాంతాల్లో సామాజిక, ఆర్థిక అసమానతలు కొనసాగాయి. ప్రత్యేకంగా తెలంగాణ ప్రాంతంలో భూమి, పన్నులు, వెట్టి చాకిరీ, భూస్వామ్య ఆధిపత్యం, సామాజిక అసమానతలు వంటి సమస్యలు ప్రజలను ప్రభావితం చేశాయి.ప్రజాస్వామ్య హక్కులు, రాజకీయ స్వేచ్ఛ, సామాజిక న్యాయం కోసం వివిధ వర్గాల నుంచి ఉద్యమాలు కూడా ఉద్భవించాయి.అందువల్ల నిజాం పాలన చరిత్రను కేవలం హైదరాబాద్ నగర అభివృద్ధి తోనో, మరోవైపు కేవలం అణచివేతతోనో పరిమితం చేయకుండా, ఆ కాలంలోని విభిన్న సామాజిక వాస్తవాల నేపథ్యంలో చూడాల్సి ఉంటుంది.

### తెలంగాణ రైతాంగ పోరాటం...

మట్టిలోంచి ఎగిసిన ప్రతిఘటననిజాం పాలన చివరి దశలో తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో రైతాంగ ఉద్యమం తీవ్ర రూపం దాల్చింది.భూస్వామ్య దోపిడీ, వెట్టి చాకిరీ, అక్రమ వసూళ్లు, సామాజిక అణచివేత వంటి సమస్యలకు వ్యతిరేకంగా అనేక ప్రాంతాల్లో ప్రజలు ప్రతిఘటించారు.ఈ పోరాటం కేవలం రాజకీయ అధికార మార్పు కోసం జరిగిన ఉద్యమంగా కాకుండా, గ్రామీణ సమాజంలోని భూసంబంధాలు, సామాజిక ఆధిపత్యం, ప్రజల జీవన పరిస్థితులతో ముడిపడిన ఉద్యమంగా చరిత్రలో నమోదైంది.అనేక మంది రైతులు, గ్రామీణ ప్రజలు ఈ పోరాటంలో ప్రాణాలు కోల్పోయారు.అందుకే సెప్టెంబర్ 17 చరిత్రను కేవలం నిజాం పాలన ముగింపుగా మాత్రమే చూడలేం. ప్రజలు తమ హక్కుల కోసం సాగించిన పోరాటాల చరిత్రగా కూడా చూడాల్సిందే.

### రజాకార్ల నీడ.. భయాందోళనల కాలం

హైదరాబాద్ సంస్థానంలో నిజాం ప్రభుత్వానికి అనుకూలంగా పనిచేసిన మజ్లిస్-ఎ-ఇత్తెహాదుల్ ముస్లిమీన్‌కు చెందిన రజాకార్ల కార్యకలాపాలు చివరి దశలో పరిస్థితులను మరింత ఉద్రిక్తంగా మార్చాయి. రజాకార్లపై హింస, బెదిరింపులు, దాడులకు సంబంధించిన అనేక చారిత్రక ఆధారాలు, వర్ణనలు ఉన్నాయి. ఈ పరిణామాలు సంస్థానంలోని రాజకీయ సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేశాయి.అయితే ఇక్కడ ఒక చారిత్రక స్పష్టత అవసరం.రజాకార్లను మొత్తం ముస్లిం సమాజంతో సమానం చేయడం సరైన చారిత్రక పద్ధతి కాదు.రజాకార్ల సంస్థ ఒక రాజకీయ-సాయుధ వ్యవస్థ. నిజాం ప్రభుత్వం మరో అంశం. హైదరాబాద్ సంస్థానంలోని సాధారణ ప్రజలు మరో వర్గం.అందువల్ల ఆ కాలం చరిత్రను మతపరమైన విభజనలతో కాకుండా, సంస్థలు, రాజకీయ శక్తులు, ప్రజల అనుభవాల ఆధారంగా అర్థం చేసుకోవడం అవసరం.

### 1947 తర్వాత.. హైదరాబాద్ ఏ దారిలో?

1947 ఆగస్టు 15న భారత్ స్వాతంత్ర్యం పొందినప్పటికీ హైదరాబాద్ సంస్థానం వెంటనే భారత యూనియన్‌లో చేరలేదు.నిజాం ప్రభుత్వం తన ప్రత్యేక స్థితిని కొనసాగించేందుకు ప్రయత్నించింది. భారత ప్రభుత్వంతో చర్చలు జరిగాయి. స్టాండ్‌స్టిల్ అగ్రిమెంట్ వంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి.అయితే సంస్థానంలోని అంతర్గత పరిస్థితులు క్రమంగా విషమించాయి.ఒకవైపు నిజాం ప్రభుత్వంతో రాజకీయ విభేదాలు..మరోవైపు రజాకార్ల కార్యకలాపాలు..ఇంకోవైపు తెలంగాణ రైతాంగ పోరాటం..మరోవైపు భారత యూనియన్‌తో పెరుగుతున్న ఉద్రిక్తత..ఇలా హైదరాబాద్ సంస్థానం కీలకమైన రాజకీయ సంక్షోభంలోకి వెళ్లింది.

### ఆపరేషన్ పోలో.. 1948 సెప్టెంబర్ మలుపు

1948 సెప్టెంబర్‌లో భారత సైన్యం హైదరాబాద్ సంస్థానంలో సైనిక చర్య చేపట్టింది. దీనిని సాధారణంగా ఆపరేషన్ పోలోగా, అధికారిక భారత ప్రభుత్వ వర్ణనల్లో పోలీస్ యాక్షన్‌గా పేర్కొన్నారు.భారత ప్రభుత్వ వర్ణన ప్రకారం సెప్టెంబర్ 13 నుంచి 17 వరకు జరిగిన ఈ చర్య అనంతరం నిజాం భారత యూనియన్ అధీనాన్ని అంగీకరించారు.దీంతో హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లోకి చేరింది.ఇక్కడి నుంచే సెప్టెంబర్ 17కు సంబంధించిన రెండు ప్రధాన వ్యాఖ్యానాలు మరింత స్పష్టంగా కనిపిస్తాయి.ఒక వర్గం దీనిని హైదరాబాద్ విమోచన దినంగా చూస్తుంది.మరో వర్గం దీనిని హైదరాబాద్ భారత యూనియన్‌లో విలీనంగా పేర్కొంటుంది.ఇంకొక దృష్టికోణం మాత్రం దీనిని ప్రజా ఉద్యమాలు, రైతాంగ పోరాటం, రాజకీయ సంక్షోభం, సైనిక చర్యలతో కూడిన సంక్లిష్ట చారిత్రక పరిణామంగా చూస్తుంది.

### అసలు ప్రశ్న..
### విమోచనం ఎవరిది? విలీనం ఎవరిది?

ఇదే సెప్టెంబర్ 17 చరిత్ర చుట్టూ ఉన్న ప్రధాన చర్చ నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాడిన ప్రజలకు అది విముక్తి.భారత రాజకీయ ఏకీకరణ దృష్టిలో అది విలీనం తెలంగాణ రైతాంగ పోరాటాన్ని ప్రధానంగా చూసేవారికి అది సామాజిక, ఆర్థిక దోపిడీకి వ్యతిరేకంగా సాగిన దీర్ఘ పోరాటంలోని ఒక కీలక దశ. అందుకే సెప్టెంబర్ 17ను ఒక్క పదంతో నిర్వచించడం కంటే, ఆ కాలంలో వివిధ వర్గాల ప్రజలు ఎదుర్కొన్న అనుభవాలను అర్థం చేసుకోవడం ముఖ్యం.

### విలీనంతోనే హింసకు వెంటనే ముగింపు వచ్చిందా?

హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో చేరిన తర్వాత కూడా అన్ని ప్రాంతాల్లో పరిస్థితులు ఒక్కసారిగా సాధారణ స్థితికి చేరలేదు.వివిధ ప్రాంతాల్లో ఘర్షణలు, ప్రతీకార చర్యలు, హింస కొనసాగినట్లు తరువాతి చారిత్రక పరిశోధనలు, నివేదికలు పేర్కొన్నాయి.ఈ కాలంలో జరిగిన హింసపై మరణాల సంఖ్య, బాధితుల వివరాలు వంటి అంశాల్లో వివిధ ఆధారాలు, పరిశోధకుల మధ్య భిన్నమైన అంచనాలు కనిపిస్తాయి. అందువల్ల నిర్దిష్ట సంఖ్యలను ప్రస్తావించేటప్పుడు మూలాధారాన్ని స్పష్టంగా పేర్కొనడం అవసరం.ఇక్కడ ప్రశ్న ఎవరు గెలిచారు?అనే దానికంటే,ఆ కాలంలో సామాన్య ప్రజలు ఏమి అనుభవించారు?అనే ప్రశ్న చరిత్రను మరింత లోతుగా అర్థం చేసుకునే దారిని చూపుతుంది.

### సెప్టెంబర్ 17.. జ్ఞాపకమా? చరిత్ర పాఠమా?

సెప్టెంబర్ 17ను విలీన దినం, విమోచన దినం ఏకీకరణ దినం వంటి వివిధ పేర్లతో పిలిచే సంప్రదాయాలు, రాజకీయ వ్యాఖ్యానాలు ఉన్నాయి.భారత ప్రభుత్వం కూడా హైదరాబాద్ లిబరేషన్ మూవ్‌మెంట్‌లో పాల్గొన్నవారిని గుర్తిస్తూ స్వాతంత్ర్య సమరయోధుల పింఛన్ పథకం కింద ప్రత్యేక నిబంధనలు అమలు చేసిన చారిత్రక రికార్డు ఉంది.అదే సమయంలో తెలంగాణ రైతాంగ పోరాటం, ప్రజాస్వామ్య హక్కుల ఉద్యమాలు, రజాకార్ల హింస, నిజాం ప్రభుత్వ నిర్ణయాలు, భారత ప్రభుత్వంతో జరిగిన రాజకీయ పరిణామాలు, ఆపరేషన్ పోలో ఇవన్నీ ఈ అధ్యాయంలో విడదీయలేని అంశాలు.

### చరిత్రను ఒకే నినాదంలో బంధించగలమా?

చరిత్ర అంటే కేవలం అధికారిక ప్రకటన కాదు. చరిత్ర అంటే కేవలం విజేతల కథ కూడా కాదు.ప్రజల పోరాటం..బాధితుల జ్ఞాపకం..రాజకీయ పరిణామం..అధికార మార్పు..సామాజిక మార్పు..హింసకు గురైన వారి అనుభవం..ఇవన్నీ కలిసినప్పుడే ఒక చారిత్రక కాలాన్ని సంపూర్ణంగా అర్థం చేసుకోగలం.అందుకే సెప్టెంబర్ 17ను కేవలం ఒక రాజకీయ నినాదంగా కాకుండా, తెలంగాణతో పాటు హైదరాబాద్ సంస్థానం చరిత్రలో జరిగిన అనేక పరిణామాలను గుర్తుచేసే రోజుగా చదవాల్సిన అవసరం ఉంది.ఒక తరం చెప్పిన కథను మాత్రమే కాదు..మరో తరం అనుభవాన్ని కూడా వినాలి.విజేతల చరిత్రతో పాటు..బాధితుల జ్ఞాపకాలను కూడా గుర్తించాలి.అధికారపు కథతో పాటు..సామాన్యుడి కథను కూడా చదవాలి.అప్పుడే సెప్టెంబర్ 17 ఒక తేదీగా కాకుండా.. తెలంగాణ చరిత్రలో ఒక సంపూర్ణ అధ్యాయంగా మన ముందుకు వస్తుంది.

---

## బీఆర్ఎస్ హయాంలో లక్షల ఎకరాల భూకబ్జాలు

**ప్రజా వాయిస్, హైదరాబాద్:** బీఆర్ఎస్ హయాంలో పెద్దఎత్తున భూకబ్జాలు జరిగాయని కేంద్ర మంత్రి, బీజేపీ నేత బండి సంజయ్ ఆరోపించారు. కరీంనగర్‌లో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌కు చెందిన పలువురు ఎమ్మెల్యేలు లక్షల ఎకరాల భూములను కబ్జా చేశారని ఆరోపించారు. బీఆర్ఎస్ భూకబ్జాలపై తాను మాట్లాడిన సమయంలో తన తలను ఆరు ముక్కలు నరుకుతానని కేసీఆర్ అన్నారని గుర్తుచేశారు.

**కేసీఆర్‌ను బయటకు గుంజుకొచ్చింది నేనే**

కేసీఆర్‌ను మెడలు వంచి బయటకు గుంజుకొచ్చింది తానేనని బండి సంజయ్ వ్యాఖ్యానించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం బీజేపీకి రావాల్సి ఉండగా తృటిలో కాంగ్రెస్ చేతికి వెళ్లిందని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన భూకబ్జాలను బయటపెట్టడానికి సీఎం రేవంత్‌రెడ్డికి వెయ్యి రోజులు పట్టిందా అని ప్రశ్నించారు.

**రేవంత్—కేసీఆర్ మధ్య డీల్ కుదిరిందా**

రేవంత్‌రెడ్డి, కేసీఆర్ మధ్య డీల్ కుదరలేదా అని బండి సంజయ్ ప్రశ్నించారు. ఏఐసీసీకి ఈఎంఐ కట్టడం ఇబ్బందిగా ఉందా అంటూ వ్యాఖ్యానించారు. ప్రతి అసెంబ్లీ సమావేశంలోనూ బీఆర్ఎస్‌కు రేవంత్‌రెడ్డి ఆఫర్లు ఇస్తున్నారని ఆరోపించారు.

**90 మంది ఎమ్మెల్యేలపై ఆరోపణలు**

బీఆర్ఎస్‌లో పనిచేసిన సుమారు 90 మంది ఎమ్మెల్యేలు భూకబ్జాలకు పాల్పడ్డారని బండి సంజయ్ ఆరోపించారు. ఈ ఆరోపణలపై ప్రభుత్వం సమగ్రంగా విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాలని ఆయన డిమాండ్ చేశారు.

**దర్యాప్తులపై ప్రభుత్వాన్ని నిలదీత**

డ్రగ్స్, ఈ-ఫార్ములా, ఫోన్ ట్యాపింగ్, ఫామ్‌హౌస్ కేసుల దర్యాప్తు ఏమైందని బండి సంజయ్ ప్రశ్నించారు. ఈ కేసులపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం ఏం చేస్తోందో వెల్లడించాలని డిమాండ్ చేశారు.

---

## ధరణి భూ కుంభకోణంపై ప్రత్యేక దర్యాప్తు కమిటీ

- రేవంత్‌రెడ్డి కీలక ప్రకటన
- నెల రోజుల్లో ఆధారాలతో భూ కుంభకోణం బయటపెడతామన్న సీఎం
- బీఆర్ఎస్ హయాంలో రూ.లక్ష కోట్ల కుంభకోణం జరిగిందని ఆరోపణ
- ధరణి అక్రమాలపై రెండో భాగం ఇంకా బాకీ ఉందన్న రేవంత్‌రెడ్డి
- సభలోనే బీఆర్ఎస్ బండారం బయటపెడతామని వ్యాఖ్య
- పారిశ్రామిక మౌలిక వసతుల సంస్థలో భూఅక్రమాలపైనా విచారణ



**ప్రజా వాయిస్, హైదరాబాద్:**బీఆర్ఎస్ హయాంలో ధరణి పేరుతో జరిగిన భూ కుంభకోణంపై ప్రత్యేక దర్యాప్తు కమిటీ ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ప్రకటించారు. మొత్తం వ్యవహారాన్ని ఆధారాలతో సహా నెల రోజుల్లో బయటపెడతామని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ హయాంలో రూ.లక్ష కోట్ల భూ కుంభకోణం జరిగిందని ఆయన ఆరోపించారు.

**దోపిడీని క్షమిస్తే చరిత్ర క్షమించదు**

బీఆర్ఎస్ హయాంలో జరిగిన భూ దోపిడీపై విచారణ జరిపిస్తామని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ దోపిడీని క్షమిస్తే చరిత్ర తమను క్షమించదని వ్యాఖ్యానించారు. ఇది ప్రారంభం మాత్రమేనని, గతంలో జరిగిన తప్పులకు బాధ్యులు తలవంచుకోవాల్సిన రోజు కచ్చితంగా వస్తుందని అన్నారు.

**ధరణి అక్రమాలపై రెండో భాగం**

ఇప్పటివరకు అసెంబ్లీలో చెప్పుకొచ్చింది ధరణి వ్యవహారానికి సంబంధించిన మొదటి భాగమేనని రేవంత్‌రెడ్డి అన్నారు. ధరణి అక్రమాలపై రెండో భాగం ఇంకా బాకీ ఉందని పేర్కొన్నారు. శాసనసభలోనే బీఆర్ఎస్ వ్యవహారాలను ఆధారాలతో సహా బయటపెడతామని తెలిపారు.

**సభకు రావాలని సవాల్**

ఈసారి బీఆర్ఎస్ సభ్యులు అసెంబ్లీకి వచ్చేలా స్పీకర్ చూడాలని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. తన కళ్లలోకి చూసి మాట్లాడే ధైర్యం లేకనే వారు అసెంబ్లీ సమావేశాలకు రావడం లేదని ఆరోపించారు.

**పారిశ్రామిక భూములపైనా విచారణ**

బడ్జెట్ సమావేశాల్లో తెలంగాణ పారిశ్రామిక మౌలిక వసతుల సంస్థలో జరిగిన భూఅక్రమాలను కూడా బయటపెడతామని ముఖ్యమంత్రి తెలిపారు. ధరణి వ్యవహారంతో పాటు ఇతర భూలావాదేవీలపై కూడా వివరాలను సభ ముందుంచుతామని పేర్కొన్నారు.

---

## ఓటుకు నోటు కేసు.. సుప్రీంకోర్టులో కీలక విచారణ.!

**ప్రజా వాయిస్, డెస్క్ బ్యూరో:** తెలంగాణలో సంచలనం సృష్టించిన ఓటుకు నోటు కేసుపై సుప్రీంకోర్టులో బుధవారం కీలక విచారణ జరిగింది.

సీఎం ఎ. రేవంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య వేర్వేరుగా దాఖలు చేసిన పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. ధర్మాసనంలో జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ వి. మోహనా ఉన్నారు.

**ఏసీబీకి అధికారం లేదని వాదన**

తమపై నమోదైన ఏసీబీ కేసు చెల్లదని రేవంత్‌రెడ్డి, సండ్ర వెంకటవీరయ్య తమ పిటిషన్లలో పేర్కొన్నారు. ఈ వ్యవహారం ఎన్నికలకు సంబంధించినదని, దీనిపై విచారణ జరిపే అధికారం ఏసీబీకి లేదని వారి తరపు న్యాయవాదులు వాదించారు. కేసును అవినీతి, లంచం వ్యవహారంగా కాకుండా ఎన్నికల కేసుగా పరిగణించాలని కోరారు.

**2021 నాటి చట్టాల ప్రస్తావన**

కేసు నమోదైన సమయంలో అమల్లో ఉన్న చట్టాలను పిటిషనర్ల తరపు న్యాయవాదులు ప్రస్తావించారు. అప్పటి నిబంధనల ప్రకారం ఎన్నికల వ్యవహారంలో ఏసీబీ జోక్యం చేసుకునే అధికారం లేదని వాదించారు. అలాగే అప్పటి చట్టం ప్రకారం లంచం ఇవ్వడం నేరం కాదని కూడా పిటిషన్‌లో పేర్కొన్నారు.

**కొత్త ధర్మాసనం ముందుకు కేసు**

గతంలో ఈ కేసుపై పలుమార్లు విచారణ జరిపిన ధర్మాసనంలోని న్యాయమూర్తులు పదవీ విరమణ చేయడంతో ప్రస్తుత ధర్మాసనం విచారణ చేపట్టింది. బుధవారం ఇరుపక్షాల వాదనలు విన్న అనంతరం విచారణ ముగిసింది.
తదుపరి విచారణ తేదీని సుప్రీంకోర్టు రిజిస్ట్రీ ఖరారు చేయనుంది. దీంతో ఓటుకు నోటు కేసులో తదుపరి విచారణ ఎప్పుడు జరుగుతుందన్న దానిపై ఆసక్తి నెలకొంది.

---

## పంతాలకు పోయి పదోన్నతులు కోల్పోవద్దు

**మొదటి పేజీ తరువాయి**

ఎస్పీ పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ.. సీనియారిటీ జాబితాపై కొందరు అధికారులు న్యాయస్థానాలను ఆశ్రయించడంతో పదోన్నతుల ప్రక్రియలో జాప్యం ఏర్పడింది. ఈ నేపథ్యంలో డీజీపీ కార్యాలయంలో మూడు బ్యాచ్‌ల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

**అందరూ సహకరిస్తే త్వరగా పదోన్నతులు**

ఈ సమావేశంలో డీజీపీ మాట్లాడుతూ.. అందరూ సహకరిస్తే పదోన్నతుల ప్రక్రియను త్వరగా పూర్తి చేయవచ్చని తెలిపారు. 37 మంది డీఎస్పీలకు వెంటనే పదోన్నతులు కల్పించే అవకాశం ఉందని పేర్కొన్నారు.

**కేసుల ఉపసంహరణకు సుముఖత**

సమావేశం అనంతరం వరంగల్ జోన్, హైదరాబాద్ నగరానికి చెందిన మూడు బ్యాచ్‌ల పలువురు అధికారులు తమ కేసులను ఉపసంహరించుకునేందుకు సుముఖత వ్యక్తం చేసినట్లు డీజీపీ కార్యాలయం తెలిపింది. దీంతో పదోన్నతుల వ్యవహారం పరిష్కార దిశగా సాగుతున్నట్లు పేర్కొంది. సమావేశంలో శాంతిభద్రతల విభాగం డీజీ మహేశ్ భగవత్, మల్టీజోన్-1, 2 ఐజీలు చంద్రశేఖర్‌రెడ్డి, షానవాజ్ ఖాసిం పాల్గొన్నారు.

---

## ఓయో హోటల్ అడ్డాగా గంజాయి దందా.. ఇద్దరి అరెస్ట్!

- అస్సాం నుంచి గంజాయి తీసుకొచ్చి హైదరాబాద్‌లో విక్రయాలు
- కొండాపూర్ ఓయో హోటల్‌లో అధికారుల ఆకస్మిక దాడులు
- 17.1 కిలోల గంజాయి.. విలువ సుమారు రూ.9 లక్షలు
- మాజీ సెక్యూరిటీ గార్డులే నిందితులుగా గుర్తింపు
- సరఫరా వెనుక ఉన్న వ్యక్తులపై ఎక్సైజ్ అధికారుల దర్యాప్తు



**ప్రజా వాయిస్, హైదరాబాద్:** హైదరాబాద్‌లోని కొండాపూర్‌లో ఓయో హోటల్‌ను అడ్డాగా చేసుకుని గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని ఎక్సైజ్ ఎస్టీఎఫ్ అధికారులు అరెస్ట్ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలోని ఓయో హోటల్‌లో గంజాయి విక్రయాలు జరుగుతున్నాయన్న పక్కా సమాచారంతో అధికారులు దాడులు నిర్వహించారు.

**17.1 కిలోల గంజాయి స్వాధీనం**

హోటల్ గదిలో అస్సాం నుంచి తీసుకొచ్చిన గంజాయిని చిన్న చిన్న ప్యాకెట్లుగా తయారు చేసి స్థానికంగా విక్రయిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. నిందితుల నుంచి 17.1 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు రూ.9 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు.

**సెక్యూరిటీ గార్డులుగా పనిచేసిన నిందితులు**

అరెస్ట్ అయిన వారిని అస్సాంకు చెందిన ధీరజ్ దాస్ (39), రబాలి అలీ (25)గా గుర్తించారు. వీరిద్దరూ గతంలో హైదరాబాద్‌లో సెక్యూరిటీ గార్డులుగా పనిచేసినట్లు విచారణలో వెల్లడైంది. ఆ ఆదాయం తమ అవసరాలకు సరిపోవడం లేదని భావించి సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో గంజాయి విక్రయాల వైపు మళ్లినట్లు అధికారులు పేర్కొన్నారు.

**సరఫరా వ్యవస్థపై దర్యాప్తు**

అస్సాం నుంచి గంజాయిని హైదరాబాద్‌కు తీసుకొచ్చి స్థానికంగా విక్రయిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. అయితే గంజాయి సరఫరా చేస్తున్న వ్యక్తులు ఎవరు, నగరంలో ఇంకా ఎవరెవరు ఈ నెట్‌వర్క్‌లో ఉన్నారనే కోణాల్లో దర్యాప్తుచేపట్టారు.

---

## వినాయక నిమజ్జనంలో విషాదం

**ప్రజా వాయిస్, సంగారెడ్డి:** సంగారెడ్డి జిల్లాలో వినాయక నిమజ్జనం సందర్భంగా తీవ్ర విషాదం చోటుచేసుకుంది. గణేశ్ విగ్రహాన్ని నిమజ్జనం చేసేందుకు చెరువు వద్దకు వెళ్లిన ఆరుగురు విద్యార్థులు ప్రమాదవశాత్తూ నీటిలో మునిగి మృతి చెందారు. పటాన్‌చెరు పరిధిలోని పెద్దకంజర్ల గ్రామంలోని నేరెడు చెరువులో ఈ దుర్ఘటన జరిగింది.

**నిమజ్జనం చేస్తుండగా ప్రమాదం**

పెద్దకంజర్లలో మూడు రోజుల పాటు వినాయక ఉత్సవాలు నిర్వహించారు. బుధవారం సాయంత్రం నిమజ్జనం కోసం స్థానికులతో పాటు విద్యార్థులు ఊరేగింపుగా నేరెడు చెరువు వద్దకు వెళ్లారు. విగ్రహాన్ని నిమజ్జనం చేసే సమయంలో కొందరు విద్యార్థులు చెరువులోకి దిగగా.. నీటి లోతును అంచనా వేయలేక ప్రమాదవశాత్తూ లోతైన ప్రాంతంలోకి వెళ్లినట్లు సమాచారం.

**ఒకరిని కాపాడే ప్రయత్నంలో..**

ఒక విద్యార్థి నీటిలో మునిగిపోతుండటాన్ని గమనించిన తోటి విద్యార్థులు అతడిని రక్షించేందుకు ప్రయత్నించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో పలువురు నీటిలోకి జారిపోయి మునిగిపోయినట్లు స్థానికులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు, సహాయక సిబ్బంది అక్కడికి చేరుకుని గాలింపు చేపట్టారు.

**ఆరుగురు మృతి**

చెరువులో నుంచి విద్యార్థులను బయటకు తీసి ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే వారు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతులను నరసింహ (21), తేజ (17), సిద్ధార్థ్ (17), గణేశ్ (18), సుమంత్‌రెడ్డి (17), ఉదయ్ కిరణ్ (22)గా గుర్తించారు. వీరంతా పటాన్‌చెరు ప్రాంతంలోని శిరీష చారిటబుల్ ట్రస్ట్‌కు చెందిన విద్యార్థులుగా ప్రాథమికంగా గుర్తించారు.

**కేసు నమోదు.. దర్యాప్తు**

ఒకేసారి ఆరుగురు విద్యార్థులు మృతి చెందడంతో పెద్దకంజర్లలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుల కుటుంబ సభ్యులు చెరువు వద్దకు చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిమజ్జనం సమయంలో భద్రతా ఏర్పాట్లు ఎలా ఉన్నాయి.. విద్యార్థులు చెరువులోకి ఏ పరిస్థితుల్లో వెళ్లారు అనే అంశాలపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

---

## దానం నాగేందర్ అనర్హతపై ఉత్కంఠ

**మొదటి పేజీ తరువాయి**



అసెంబ్లీలో ఎమ్మెల్యే వ్యవహరించిన తీరును మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలన్న స్పీకర్ వైఖరిని పిటిషనర్లు వ్యతిరేకించారు. మరో పార్టీ తరపున ఎన్నికల్లో పోటీ చేయడం రాజకీయ అనుబంధాన్ని వదులుకున్నట్లు స్పష్టమవుతుందని వాదించారు. స్పీకర్ నిర్ణయం న్యాయపరిశీలనకు లోబడి ఉంటుందని పేర్కొన్నారు.

**దానం తరపు న్యాయవాది వాదన**

అయితే దానం నాగేందర్ తరపు న్యాయవాది ఈ వాదనలను వ్యతిరేకించారు. దానం బీఆర్ఎస్ సభ్యత్వానికి రాజీనామా చేయలేదని, కాంగ్రెస్ ప్రాథమిక సభ్యత్వం తీసుకున్నట్లు ఎక్కడా ప్రకటించలేదని తెలిపారు. అసెంబ్లీ రికార్డుల్లో ఆయన ఇప్పటికీ బీఆర్ఎస్ సభ్యుడిగానే ఉన్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ తరపున లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసినంత మాత్రాన అసెంబ్లీ సభ్యత్వం కోల్పోయినట్లు భావించరాదని వాదించారు.

**తీర్పు శుక్రవారానికి వాయిదా**

పాడి కౌశిక్‌రెడ్డి, ఏలేటి మహేశ్వర్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్లపై ఇరుపక్షాల వాదనలు విన్న చీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్‌సింగ్, జస్టిస్ జీఎం మొహియుద్దీన్ ధర్మాసనం తీర్పును శుక్రవారానికి వాయిదా వేసింది.



# ప్రపంచ వారసత్వ కట్టడం రామప్ప అభివృద్ధిపై ప్రపంచ బ్యాంకు ప్రతినిధుల పరిశీలన

- రామప్ప శిల్పకళ, కాకతీయుల చరిత్ర విశిష్టమైనవి
- ప్రపంచ వారసత్వ గుర్తింపు అనంతరం చేపట్టిన అభివృద్ధి పనులపై అధికారుల వివరణ
- మేడారం సమ్మక్క–సారలమ్మ, లక్నవరం సరస్సును సందర్శించిన ప్రతినిధుల బృందం

**ప్రజా వాయిస్; ములుగు జిల్లా:** వెంకటాపూర్ మండలం:/ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం పాలంపేట గ్రామంలోని చారిత్రక రామప్ప దేవాలయాన్ని బుధవారం ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు పూనమ్ ఆలువాలియా, ఆపూర్వ శేన్వీ, వెంకట రావు, నిత్య, నేహ ప్రవాష్ సందర్శించారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు హరీష్ శర్మ, ఉమాశంకర్ ప్రతినిధులకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ కార్యనిర్వహణ అధికారి ఇమ్మడి భాస్కర్ శేష వస్త్రాలను బహూకరించారు. హనుమకొండ ఉద్యానవన, పర్యాటక శాఖ అధికారి ఎం. శివాజీ రామప్ప దేవాలయానికి ప్రపంచ వారసత్వ కట్టడంగా గుర్తింపు లభించిన అనంతరం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రతినిధులకు వివరించారు. ప్రసాద్, సాస్కీ పథకాల కింద జరుగుతున్న అభివృద్ధి పనులు, పర్యాటక మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై వివరించారు.పర్యాటక మార్గదర్శకుడు గోరంట్ల విజయ్ కుమార్ రామప్ప దేవాలయ చరిత్ర, కాకతీయుల వైభవం, ఆలయంలోని అద్భుతమైన శిల్పకళ విశేషాలను ప్రపంచ బ్యాంకు ప్రతినిధులకు వివరించారు. ఆలయ నిర్మాణంలోని ప్రత్యేకతలు, శిల్పాల వెనుక ఉన్న చారిత్రక నేపథ్యాన్ని తెలియజేశారు. రామప్ప సందర్శన అనంతరం ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు మేడారం చేరుకుని శ్రీ సమ్మక్క–సారలమ్మ తల్లులను దర్శించుకున్నారు. అనంతరం లక్నవరం సరస్సును కూడా సందర్శించారు. ఈ పర్యటనలో గ్రూప్ వన్ అధికారిణి రవళి, డీటీ భవానీ ప్రసాద్, పర్యాటక పోలీసు సిబ్బంది శ్రీనివాస్, శ్రీకాంత్, దశరథ్, శ్రీను, రెవెన్యూ, పురావస్తు, దేవాదాయ, పర్యాటక శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# విద్యుత్ ఉద్యోగుల ఐక్యగళం

- హెచ్-82 నూతన జిల్లా కమిటీ ఏకగ్రీవ ఎన్నిక!

**ప్రజావాయిస్/వికారాబాద్:** తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల యూనియన్ (టీ.వి.ఈ.యూ) హెచ్–82 వికారాబాద్ జిల్లా నూతన జిల్లా, డివిజన్ కమిటీలను బుధవారం వికారాబాద్ పట్టణంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి టీ జి ఎస్ పి డి సి ఎల్ కంపెనీ యూనియన్ సెక్రటరీ కె. వెంకటేష్, కంపెనీ జాయింట్ సెక్రటరీ ఎం.డి. జమీల్, వికారాబాద్ జిల్లా మాజీ అధ్యక్షుడు బి. జైపాల్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ రంగ అభివృద్ధిలో కార్మికుల పాత్ర కీలకమని తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా రాత్రింబవళ్లు విధులు నిర్వహిస్తూ విద్యుత్ సరఫరాలో కీలక సేవలు అందిస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్టిజన్ కార్మికులకు సంబంధించిన సమస్యలు, హక్కుల సాధన కోసం యూనియన్ తరఫున నిరంతరం పోరాటం చేస్తామని నూతన కమిటీ నాయకులు తెలిపారు. అనంతరం నూతన జిల్లా కమిటీ జిల్లా అధ్యక్షుడిగా సుభాన్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గా శ్రీనివాస్ , వికారాబాద్ డివిజన్ అధ్యక్షుడు శేఖర్ , ప్రధాన కార్యదర్శి , రామాంజనేయులు, కృష్ణ కార్మికుల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం నూతన కమిటీ ఆధ్వర్యంలో ఐక్యంగా పనిచేస్తామని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

# హామీలకే పరిమితమైన 'ఆర్ అండ్ ఆర్' ప్యాకేజీ

- సింగరేణి ఓసిపి విస్తరణతో దయనీయంగా 'జల్లారం' నిర్వాసితుల పరిస్థితి
- 18 ఏళ్లు నిండిన యువతకు దక్కని పరిహారం
- కూలేందుకు సిద్ధంగా ఇళ్లు
- బాధితులను పట్టించుకోని అధికారులు
- మాట తప్పిన మంథని ఎమ్మెల్యే శ్రీధర్ బాబు
- జల్లారం మాజీ సర్పంచ్ హరీష్ తీవ్ర ఆగ్రహం





**ప్రజా వాయిస్ రామగిరి** పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం జల్లారం గ్రామపంచాయతీ పరిధిలో సింగరేణి ఓపెన్ కాస్ట్ (ఓసిపి) గనుల తవ్వకాలు, విస్తరణ పనుల కారణంగా స్థానిక ప్రజల బతుకులు బుగ్గిపాలవుతున్నాయి. ఒక పక్క భూములు, ఇళ్లు కోల్పోయిన బాధితులకు నేటికీ పునరావాస, పునర్నిర్మాణ (ఆర్ అండ్ ఆర్) ప్యాకేజీలు పక్కాగా అందకపోగా, మరోపక్క రోజురోజుకూ దగ్గరవుతున్న బొగ్గ గనుల బ్లాస్టింగ్ తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేస్తోంది. గనులలో జరిపే ఓసిపి బ్లాస్టింగ్ ధాటికి గ్రామంలోని అనేక ఇళ్లు తీవ్రంగా దెబ్బతింటున్నాయి. ఇటీవల ఒక ఇంటిపై మట్టి/పెళ్లలు ఊడిపడి స్థానిక మహిళ తలకు తీవ్ర గాయమైన ఉదంతం ఇక్కడి పరిస్థితులకు అద్దం పడుతోంది. గ్రామంలో 18 సంవత్సరాలు నిండిన యువతకు చట్టబద్ధంగా అందాల్సిన ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ, ఎక్స్‌గ్రేషియా నిధులు సంవత్సరాలు గడుస్తున్నా లభించక మిస్సింగ్ జాబితాలోకి వెళ్లడంపై నిర్వాసితులు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు.

### మా బాటలు మాకు లేవు.. అధికారులకే దారులు

సింగరేణి యాజమాన్యం తమ బొగ్గు రవాణా, సిటీటి వాహనాల నిమిత్తం కంకర రోడ్లు నిర్మించుకోవడానికే ప్రాధాన్యత ఇస్తోంది తప్ప, వర్షకాలంలో బురదమయంగా మారిన గ్రామీణ రహదారులను, సిసి రోడ్లను బాగు చేయడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఆర్‌డీవో, ఆర్ అండ్ ఆర్ కమిషనర్ (హైదరాబాద్) చుట్టూ తిరిగినా అర్హులైన నిర్వాసితులకు న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### మాట తప్పారు.. మమ్మల్ని వదిలేశారు



ఎన్నికల ముందు మంథని ఎమ్మెల్యే శ్రీధర్ బాబు గారు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీలు, నిర్వాసితుల సమస్యల పరిష్కారంపై స్పష్టమైన హామీలు ఇచ్చారు. కానీ అధికారంలోకి వచ్చాక, సింగరేణి యాజమాన్యం తీరుపై లేదా బాధితుల ఆర్తనాదాలపై స్పందించకపోవడం దారుణం. ఎన్నికల ముందు ఇచ్చిన మాటను ప్రజాప్రతినిధులు పూర్తిగా విస్మరించారు. సింగరేణి యాజమాన్యం తమ అవసరాల కోసం గ్రామాన్ని ఆక్రమించుకుంటూ ప్రజలను భయాందోళనలకు గురిచేస్తోంది. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, సింగరేణి ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించి 18 ఏళ్లు నిండిన యువతకు పరిహారం, ఆగిపోయిన ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీలు అందించి న్యాయం చేయాలి. స్థానికులు అనేక పర్యాయాలు వినతిపత్రాలు అందించినా సింగరేణి యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఓసిపి పనులు గ్రామానికి అతి సమీపంలోకి రావడం వల్ల ధ్వని కాలుష్యం, ఇళ్ల కూలిపోయే ప్రమాదాలు పెరిగిపోయాయని, ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

# రామకృష్ణాపూర్ పీఎస్ ఆకస్మిక తనిఖీ

- శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశం!

**ప్రజా వాయిస్ / మంచిర్యాల క్రైమ్** రామగుండం పోలీస్ కమిషనరేట్ మంచిర్యాల జోన్ పరిధిలోని రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీలలో భాగంగా రామగుండం పోలీస్ కమిషనర్ ఘనంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న సీపీకి రామకృష్ణాపూర్ ఎస్ఐ శ్రీధర్, సీఐ రమేష్ మొక్కను అందజేసి ఘన స్వాగతం పలికారు. అనంతరం పోలీస్ సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు.స్టేషన్ ఆవరణలో అధికారులతో కలిసి మొక్కను నాటిన సీపీ.. పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలను క్రమబద్ధంగా ఉంచాలని, వాటి వివరాలను సక్రమంగా నమోదు చేయాలని ఆదేశించారు. రిసెప్షన్ కేంద్రం రికార్డులను పరిశీలించి, స్టేషన్‌లో '55' విధానాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని కోరారు.స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుతోనూ, బాధితుడితోనూ సిబ్బంది మర్యాదపూర్వకంగా, మానవీయ దృక్పథంతో వ్యవహరించాలని సీపీ స్పష్టం చేశారు. వారి సమస్యలను పూర్తిగా విని, చట్టపరిధిలో త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.రామకృష్ణాపూర్ ప్రాంతం హైవే, రైల్వే స్టేషన్లతో కూడుకుని కీలకమైన ప్రాంతంగా ఉందని సీపీ తెలిపారు. కొత్త కాలనీలు అభివృద్ధి చెందుతున్నందున శాంతిభద్రతలు, రహదారి భద్రత, మహిళల భద్రతతో పాటు మాదకద్రవ్యాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ముఖ్యంగా రైలు, రోడ్డు మార్గాల ద్వారా జరిగే గంజాయి అక్రమ రవాణాను అరికట్టేందుకు నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని హెచ్చరించారు.ప్రజల భాగస్వామ్యంతో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయించి నేరాల నియంత్రణలో ప్రతిభ కనబరుస్తున్న సిబ్బందిని ఈ సందర్భంగా సీపీ అభినందించారు. కొత్త కాలనీల్లో ఒంటరిగా ఉంటున్న వృద్ధుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత నిస్తూ, బ్లూకోట్స్ సిబ్బంది క్రమం తప్పకుండా పెట్రోలింగ్ నిర్వహించాలని.. వృద్ధుల రక్షణ కోసం ప్రత్యేక ప్రామాణిక కార్యాచరణ విధానం (షొప్ ) అమలు చేయాలని ఆదేశించారు.పోలీస్ సిబ్బంది శారీరక దృఢత్వంతో పాటు స్టేషన్ నిర్వహణపై శ్రద్ధ వహించాలని సూచించారు. రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ నిర్వహణ బాగుందని ప్రశంసించిన సీపీ, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేలా సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.







# రైతు మృతిలో తప్పుడు ధృవీకరణపై విచారణకు ఆదేశం

- అధికారుల్లో కలకలం

**ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి** రైతు మృతితో తప్పుడు ధృవీకరణ పై విచారణకు ఆదేశం.తప్పుడు నివేదికలు ఇచ్చిన అధికారుల్లో భయం పట్టుకుంది. వరంగల్ జిల్లా గీసుగొండ మండలం ధర్మారం గ్రామానికి చెందిన రైతు శానబోయిన కుమారస్వామి మృతిపై తప్పుడు మరణ ధృవీకరణ పత్రం జారీ చేసిన వ్యవహారంపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించారు. 'ప్రజా వాయిస్' దినపత్రికలో వచ్చిన కథనంపై విచారణకు ఆదేశించారు.రైతు బీమా సొమ్ము కోసం 17న మృతి చెందితే 10వ తేదీన చనిపోయినట్లుగా తప్పుడు సర్టిఫికెట్ ఇచ్చారన్న ఆరోపణలను సీరియస్ గా తీసుకున్నారు.ఈ ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి, తప్పుడు ధ్రువీకరణ ఇచ్చిన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని సంబంధిత అధికారి తెలిపారు. అలాగే దళారుల పాత్రపై కూడా ఆరా తీస్తున్నట్లు సమాచారం.అధికారుల విచారణ ఆదేశాలతో గీసుగొండ మండలంలో కలకలం రేగింది.

# చంద్రప్రియ అడుగులు అసెంబ్లీ వైపేనా?

- ' మన చంద్ర ఫౌండేషన్'తో ప్రజల్లోకి చంద్రప్రియ
- జహీరాబాద్ లో తండ్రి..వికారాబాద్ లో కూతురు!
- రాజకీయ రంగ ప్రవేశానికి రంగం సిద్ధమా?
- అధికారికంగా వెల్లడికాని రాజకీయ ప్రణాళిక
- వికారాబాద్ రాజకీయాల్లో కొత్త కలకలం



**ప్రజావాయిస్/వికారాబాద్ జిల్లా బ్యూరో:** రాజకీయాల్లో అనుభవజ్ఞుడైన మాజీ మంత్రి,కాంగ్రెస్ పార్టీ జహీరాబాద్ అసెంబ్లీ ఇంచార్జ్ డాక్టర్ ఏ. చంద్రశేఖర్ ఒకవైపు తన రాజకీయ కార్యకలాపాలను కొనసాగిస్తుండగా.. మరోవైపు ఆయన కుమార్తె డాక్టర్ చంద్రప్రియ వికారాబాద్‌లో సామాజిక సేవా కార్యక్రమాలతో ప్రజలకు చేరువవుతున్నారు. దీంతో తండ్రీకూతుళ్ల రాజకీయ ప్రస్థానంపై స్థానిక రాజకీయ వర్గాల్లో కొత్త చర్చ మొదలైంది.మహిళలు, చిన్నారుల ఆరోగ్య సంరక్షణ లక్ష్యంగా 'మన చంద్ర ఫౌండేషన్'ను చంద్రప్రియ ఆధ్వర్యంలో ప్రారంభించడం జరిగింది. ఆ తర్వాత కూడా వివిధ సామాజిక కార్యక్రమాల్లో ఆమె పాల్గొంటూ ప్రజలతో మమేకమవుతున్నారు. ఆపదలో ఉన్న కుటుంబాలను పరామర్శించడం, అవసరమైన వారికి సహాయం అందించడం వంటి కార్యక్రమాలతో తనదైన గుర్తింపును పెంచుకునే ప్రయత్నం చేస్తున్నట్లు కనిపిస్తోంది.మరోవైపు మాజీ మంత్రి చంద్రశేఖర్‌కు తెలంగాణ రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం ఉంది. ఆయన గతంలో వికారాబాద్ నుంచి పలుమార్లు ఎమ్మెల్యేగా గెలిచి మంత్రిగా పనిచేశారు. ప్రస్తుతం జహీరాబాద్ పరిధిలో ఆయన రాజకీయ కార్యకలాపాలు కొనసాగిస్తున్న నేపథ్యంలో.. వికారాబాద్‌లో కుమార్తె చంద్రప్రియ చురుకుదనం ప్రాధాన్యత సంతరించుకుంది.చంద్రప్రియ ప్రస్తుతం తన కార్యక్రమాలను ప్రధానంగా ఫౌండేషన్, సామాజిక సేవా కార్యక్రమాల పరిధిలోనే కొనసాగిస్తున్నారు. అయితే ఈ కార్యక్రమాల వెనుక భవిష్యత్తులో ప్రత్యక్ష రాజకీయ ప్రవేశానికి సంబంధించిన వ్యూహం ఉందా? అనే చర్చ మాత్రం రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది.ఏదైనా రాజకీయ పార్టీ నుంచి ఆమెకు భవిష్యత్తులో అవకాశం ఉంటుందా? స్వతంత్రంగా రాజకీయాల్లోకి వస్తారా? లేక సామాజిక సేవలకే పరిమితమవుతారా? అనే అంశాలపై ఇప్పటివరకు ఆమె నుంచి అధికారిక ప్రకటన వెలువడలేదు.అయితే ప్రజా సమస్యలపై స్పందిస్తూ, వివిధ వర్గాలతో సమావేశాలు నిర్వహిస్తూ చంద్రప్రియ ముందుకు సాగుతున్న తీరు స్థానిక రాజకీయ పరిశీలకుల దృష్టిని ఆకర్షిస్తోంది. దీంతో వికారాబాద్‌లోని వివిధ రాజకీయ పార్టీల నేతలు కూడా ఆమె కార్యక్రమాలను నిశితంగా గమనిస్తున్నట్లు చర్చ జరుగుతోంది.ప్రస్తుతం మాత్రం చంద్రప్రియ రాజకీయ ప్రకటనల కంటే సేవా కార్యక్రమాలకే ప్రాధాన్యం ఇస్తున్నట్లు కనిపిస్తోంది. ఆమె భవిష్యత్ రాజకీయ అడుగులు ఎలా ఉండబోతున్నాయి? ఏదైనా పార్టీతో కలిసి పనిచేస్తారా? లేక కొత్త రాజకీయ వేదికను ఎంచుకుంటారా? అన్నది రాబోయే రోజుల్లోనే స్పష్టత వచ్చే అవకాశం ఉంది.ఒకచోట తండ్రి.. మరోచోట కూతురు.. ఇద్దరి రాజకీయ చురుకుదనం స్థానికంగా ఆసక్తికర చర్చకు దారితీస్తుండగా.. చంద్రప్రియ భవిష్యత్ అడుగు ఎలా ఉండబోతుందన్నది ఇప్పుడు వికారాబాద్ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

# తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వార్షికోత్సవ సభను విజయవంతంచేయండి



**ప్రజా వాయిస్ మహబూబాబాద్** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వార్షికోత్సవ సభను విజయవంతం చేయాలని కోరుతూ మహబూబాబాద్ పట్టణంలోని 16వ వార్డు ఎల్బీజీ నగర్‌లో సీపీఐ(ఎం) 1వ, 2వ శాఖ సమావేశం నిర్వహించగా . ఈ సమావేశానికి ఆకుల సతీష్ అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా సీపీఐ(ఎం) పట్టణ కార్యదర్శి బానోత్ సీతారాం నాయక్ పాల్గొని మాట్లాడారుఈ సందర్భంగా బానోత్ సీతారాం నాయక్ మాట్లాడుతూ.. నిజాం నిరంకుశ పాలనకు, రజాకార్ల దౌర్జన్యాలకు, భూస్వాముల దోపిడీకి వ్యతిరేకంగా తెలంగాణ గడ్డపై కమ్యూనిస్టుల నాయకత్వంలో సాగిన సాయుధ రైతాంగ పోరాటం భారత ప్రజా ఉద్యమ చరిత్రలో చెరగని అధ్యాయమని అన్నారు. 1946–48 కాలంలో సాగిన ఈ పోరాటం కేవలం అధికార మార్పు కోసం జరిగినది కాదని, భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం, ఆత్మగౌరవం కోసం పేదలు, రైతులు, కూలీలు సాగించిన మహత్తర పోరాటమని పేర్కొన్నారు.వెట్టి చాకిరీ, అక్రమ పన్నులు, భూస్వాముల దౌర్జన్యాలు, మహిళలపై జరుగుతున్న అణచివేతకు వ్యతిరేకంగా ప్రజలు తిరుగుబాటు చేశారని తెలిపారు. "దున్నేవాడికే భూమి" అనే నినాదంతో వేలాది మంది రైతులు, కూలీలు పోరాట బాట పట్టారని, గ్రామాలను కేంద్రాలుగా చేసుకుని ప్రజలు దోపిడీకి ఎదురు నిలిచారని అన్నారు.ఈ పోరాటంలో నాలుగు వేల మందికి పైగా అమరులై, లక్షలాది ప్రజలు ఉద్యమంలో భాగస్వాములయ్యారని, సుమారు పది లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచి, వేలాది గ్రామాల్లో ప్రజా కమిటీల ఆధారంగా ప్రత్యామ్నాయ పరిపాలనకు బాటలు వేశారని ఆయన గుర్తుచేశారు. మహిళలు సైతం తుపాకులు చేతబట్టి పోరాటంలో పాల్గొని తమ ధైర్యసాహసాలను చాటారని అన్నారు.నిజాం రాచరికాన్ని, రజాకార్ల అరాచకాలను, భూస్వామ్య పెత్తందారీ వ్యవస్థను సవాలు చేసిన తెలంగాణ రైతాంగ పోరాట స్ఫూర్తి నేటికీ సజీవంగానే ఉందని సీతారాం నాయక్ అన్నారు. నేడు కూడా రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికులు, పేదలు తమ హక్కుల కోసం పోరాడాల్సిన పరిస్థితులు ఉన్నాయని పేర్కొన్నారు. భూమి, ఉపాధి, కనీస మద్దతు ధర, వ్యవసాయ రక్షణ, కార్మిక హక్కులు, సామాజిక న్యాయం కోసం ప్రజా ఉద్యమాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం త్యాగాలను వక్రీకరించే ప్రయత్నాలను ప్రజలు తిప్పికొట్టాలని, ఆ పోరాట చరిత్రను నేటి తరానికి చేరవేయాలని పిలుపునిచ్చారు. అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ మహబూబాబాద్ వి ఆర్ ఎన్ గార్డెన్ లో సెప్టెంబర్ 17న నిర్వహించనున్న తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వార్షికోత్సవ సభకు ప్రజలు, రైతులు, కూలీలు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు.ఈ సమావేశంలో సిపిఎం శాఖ కార్యదర్శులు,బడుగుల లక్ష్మయ్య,బానోత్ లింగ, పాటి సారయ్య,ఎస్ కె.ముఖరంజన్,బానోత్ కిరణ్ కుమార్, పార్టీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు..

# ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యం కాంగ్రెస్ పార్టీ పయనం

- మంత్రి పొన్నం
- పేద విద్యార్థుల ఆకలి తీర్చడమే మా ధ్యేయం
- హరే కృష్ణ మూవ్ మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ఇండియా కు ధన్యవాదాలు
- రూ.8 కోట్లతో సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ ప్రారంభం
- 17 మండలాల్లో 669 ప్రభుత్వ పాఠశాలలు,కళాశాలలకు ఆహారం అందిస్తాం







**ప్రజా వాయిస్,కరీంనగర్** ( సెప్టెంబర్ 16 ): పిల్లలకు ప్రభుత్వం అందించగలిగే గొప్ప ఆస్తి విద్యేనని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంతోపాటు విద్యార్థులకు నాణ్యమైన విద్య, మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. విద్యార్థులు ఉదయం ఆకలితో తరగతి గదులకు రాకుండా పోషకాహారంతో కూడిన అల్పాహారం అందించడం ద్వారా ఆకలిని తీర్చి అక్షరానికి అండగా నిలవడమే స్కూల్ బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమం ఉద్దేశమన్నారు. కరీంనగర్ మార్కెట్‌యార్డులో తెలంగాణ ప్రభుత్వం, హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ఇండియా ఇంప్లిమెంటేషన్ పార్ట్‌నర్‌గా కలిసి సుమారు రూ.8 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్‌ను బుధవారం మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాతో కలిసి ప్రారంభించారు. అనంతరం కిచెన్‌లో ఏర్పాటు చేసిన అధునాతన యంత్రాలు, వివిధ విభాగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో పిల్లల భవిష్యత్‌కు భూములు, ఆస్తులు, నిధులు అందించడం ముఖ్యంగా భావించేవారని, ప్రస్తుత కాలంలో పిల్లలకు అందించగలిగే గొప్ప ఆస్తి విద్యేనని అన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడంతోపాటు శిక్షణ పొందిన ఉపాధ్యాయులను అందుబాటులో ఉంచుతున్నామని, ఇప్పుడు విద్యార్థులకు ఉదయమే నాణ్యమైన అల్పాహారం అందించే కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే కార్యక్రమానికి తల్లిదండ్రులు సహకరించాలని కోరారు.ఆకలితో ఉన్న విద్యార్థులు చదువుపై పూర్తిస్థాయిలో దృష్టి సారించలేరని మంత్రి అన్నారు. పోషకాహారంతో కూడిన అల్పాహారం అందించడం ద్వారా విద్యార్థుల ఏకాగ్రత, హాజరు, సమయపాలన, తరగతి గది భాగస్వామ్యం, విద్యా పనితీరు మెరుగుపడేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఉదయమే ఉపాధి కోసం వెళ్లే పేద, మధ్యతరగతి కుటుంబాల తల్లిదండ్రులకు ఈ కార్యక్రమం సమయం, ఆర్థిక పరంగా కొంత ఉపశమనం కల్పిస్తుందని తెలిపారు. అల్పాహారం తయారీ, నిర్వహణ బాధ్యతల నుంచి ఉపాధ్యాయులు విముక్తి పొంది పూర్తిస్థాయిలో బోధనపై దృష్టి సారించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన సెంట్రలైజ్డ్ కిచెన్‌కు రోజుకు 50 వేల మంది విద్యార్థులకు అల్పాహారం అందించే సామర్థ్యం ఉందని మంత్రి తెలిపారు. 17 మండలాల్లోని 669 ప్రభుత్వ పాఠశాలలు, 11 ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు ఇక్కడి నుంచి అల్పాహారం సరఫరా చేస్తామని చెప్పారు. మొత్తం 49,025 మంది విద్యార్థులు ప్రతిరోజూ ప్రయోజనం పొందనున్నారని వివరించారు. నియోజకవర్గాల వారీగా హుస్నాబాద్‌లో 16,544 మంది, మానకొండూర్‌లో 8,645 మంది, చొప్పదండిలో 7,481 మంది, కరీంనగర్‌లో 16,355 మంది విద్యార్థులు లబ్ధి పొందనున్నారు. రాష్ట్రంలో ఇది ఆరో కమ్యూనిటీ కిచెన్ అని మంత్రి తెలిపారు. కిచెన్‌లో ఇడ్లీ, దోశ, పూరీ, బోండా, సాంబార్ తయారీకి ఆధునిక యంత్రాలను ఏర్పాటు చేశారు. పాత్రల శుభ్రత కోసం యంత్రాలు, పాల కేంద్రం, ఆహార పదార్థాల పరీక్షా ప్రయోగశాల, కూరగాయలను కట్ చేసి శుభ్రం చేసే యంత్రాలు, చట్నీ పౌడర్ తయారీ యంత్రాలను అందుబాటులో ఉంచారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులకు ఒకే విధమైన నాణ్యతతో, పరిశుభ్రమైన అల్పాహారం అందించడమే కేంద్రీకృత వంటశాలల ఉద్దేశమని మంత్రి తెలిపారు. ఆహార భద్రత, పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తూ ISO స్థాయి ప్రమాణాలు పాటించేలా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. థర్మల్ ఇన్సులేటెడ్ వాహనాల ద్వారా పాఠశాలలకు అల్పాహారం సకాలంలో చేరేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ఇష్టమైన సాధారణ ఆహార పదార్థాలతో మెనూ రూపొందించామని, ఇందుకోసం నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ (NIN) సహకారం తీసుకున్నామని వెల్లడించారు. వారంలో ఆరు రోజుల పాటు వివిధ రకాల అల్పాహారం అందించనున్నారు. సోమవారం ఇడ్లీ–సాంబార్, మంగళవారం పూరీ–ఆలూ కుర్మా, బుధవారం దోశ–చట్నీ, గురువారం ఉప్మా–చట్నీ, శుక్రవారం మిల్లెట్ ఇడ్లీ–సాంబార్, శనివారం బోండా–చట్నీ అందిస్తారు. రోజు విడిచి రోజు విద్యార్థులకు పాలు కూడా అందించనున్నారు. కేంద్రీకృత వంటశాలల ద్వారా సుమారు 15 వేల ప్రత్యక్ష, 10 వేల పరోక్ష ఉద్యోగ అవకాశాలు కల్పించే అవకాశం ఉందన్నారు. స్కూల్ బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమంలో ఇంప్లిమెంటేషన్ పార్ట్‌నర్‌గా వ్యవహరిస్తున్న హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ఇండియా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని మంత్రి తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం సీఎస్ఆర్ నిధుల కింద సంస్థకు సహకరిస్తోందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన అల్పాహారం అందించే కార్యక్రమంలో భాగస్వామిగా నిలిచినందుకు ఫౌండేషన్‌కు ధన్యవాదాలు తెలిపారు. హైదరాబాద్‌లో ఇందిరమ్మ క్యాంటీన్ల నిర్వహణలోనూ హరే కృష్ణ మూవ్‌మెంట్ భాగస్వామిగా ఉందని పేర్కొన్నారు. కిచెన్ ప్రారంభోత్సవం సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ విద్యార్థులకు స్వయంగా అల్పాహారం వడ్డించి వారితో కలిసి భోజనం చేశారు. అనంతరం కిచెన్‌లోని వివిధ విభాగాలను పరిశీలించి ఆహార తయారీ, పరిశుభ్రత, నాణ్యత ప్రమాణాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, అదనపు కలెక్టర్లు శ్రీనివాసరెడ్డి, అశ్వినీ తానాజీ వాకడే, జిల్లా విద్యాధికారి చైతన్య జైని, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డీవో షర్మిల, హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ఇండియా ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కౌంటియా దాస స్వామీజీ, కరీంనగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న, ఆర్టీఏ మెంబర్ పడాల రాహుల్, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



## ఓజోన్ పొర సంరక్షణ అందరి భాద్యత

### వన ప్రేమి డాక్టర్ పులుసం సాంబయ్య

**ప్రజా వాయిస్ కొత్త గూడ** ప్రపంచ ఓజోన్ డే సందర్భంగా ఓటాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అరోజు రమాదేవి ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థిని విద్యార్థులు ప్లాకార్డులు చేత బట్టుకొని, ఓజోన్ పొరను సంరక్షించుకోవాలని నినాదాలు చేస్తూ గ్రామ కూడళ్ళలో ర్యాలీ నిర్వహించారు ఈ సందర్భంగా విద్యార్థులకు ఓజోన్ సంరక్షణ పై డ్రాయింగ్ పోటీలు, వ్యాసరచన పోటీలు నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా పాఠశాల హెచ్ ఎం రమాదేవి మాట్లాడుతూ ఓజోన్ లేయర్ ఒక సహజ సిద్దమైన రక్షణ కవచం ఇది భూ మండలం లోని సమస్త జీవ కోటిని అతినీల లోహిత కిరణాల తాకిడి నుండి రక్షించే ఒక అద్భుతమైన కవచం ఇప్పుడు ఓజోన్ పొర రంద్రాలు పడే పరిస్థితి లో ఉంది దీనికి ప్రధాన కారణం ఇండస్ట్రీలైజేషన్, అర్బనైజేషన్, వ్యవసానికి విరివిగా ఉపయోగించే పేష్టిసైడ్స్, హెర్బయిసైడ్స్ ఇంకా మానవుని స్వార్థ పూరిత అనాలోచిత వాణిజ్యపరమైన విధానాలతో అడవులను నాశనం చేస్తు ప్రకృతి వైపరీత్యాలకు కారణభూతమై నేడు నేపాల్ లో సంబవించిన మంచు గ్లేసియర్స్ కరిగి వరదలు సంబవించయని అందుకే ప్రతి ఒక్కరు ఓజోన్ పొర గురించి అవగాహనా కల్గి ఉండిపర్యావరణ సమ తుల్యత ను కాపాడాలని వనప్రేమి డాక్టర్ పులుసం సాంబయ్య పిలుపునిచ్చారు ఈ కార్యక్రమం లో పాఠశాల హెచ్ ఎం రమాదేవి , ఉపాధ్యాయ బృందం భూక్యా దశరథ్ కుమార్, ఇస్లావత్ రాజు, ధనుసరి సుధాకర్, రావుల రమ, పినబోయిన శ్యామల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు

## అక్రమ ఇసుక రవాణాపై చర్యలు శూన్యం!!

- బుద్దగూడెం ప్రాంతంలో అడ్డగోలుగా ఇసుక తోలకాలు
- కొరవడిన అధికారుల నిఘా
- రెవెన్యూ, పోలీస్ శాఖల తీరుపై స్థానికుల్లో అనుమానాలు
- అధికారులకు సమాచారం ఇచ్చినా స్పందన కరువు



**ప్రజా వాయిస్ బూర్గుంపాడు** బూర్గంపాడు మండల పరిధిలోని బుడ్డగూడెం ప్రాంతాల్లో అక్రమ ఇసుక రవాణా వ్యవహారం రోజు రోజుకు శృతిమించుతోంది. రాత్రి వేళల్లో నది గర్భంలో కేంద్రాలను దింపి, సుమారు 20 ట్రాక్టర్లు ఏర్పాటు చేసుకోని అక్రమ ఇసుక రవాణాకు తెరాలేపుతున్నారు. ప్రాంతాలకు చేరుకుని ఇసుకను తవ్వి తరలిస్తున్నారనే ఆరోపణలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి. రాత్రివేళల్లో ట్రాక్టర్ల ద్వారా ఇసుక రవాణా జరుగుతుందని సంబంధిత శాఖలకు సమాచారం అందించిన గాని, మండల అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం పట్ల మండల వ్యాప్తంగా విమర్శలు వెళ్లు వెతుతున్నాయి.

### అధికారుల నిఘా ఎక్కడ?...

ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాపై నిఘా పెట్టాల్సిన రెవెన్యూ, పోలీస్ శాఖలు స్పందించకపోవడంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. బుడ్డగూడెం ప్రాంతం లో అక్రమ ఇసుక తరలింపు జరుగుతున్న నేపథ్యంలో,అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి వాస్తవ పరిస్థితులను గుర్తించాలని వారు కోరుతున్నారు.

### సమాచారం ఇచ్చిన స్పందన కరువు...

బుడ్డగూడెం ప్రాంతంలో, ప్రతిరోజు హద్దు అదుపు లేకుండా యంత్రాల సహాయంతో, ట్రాక్టర్లు ఏర్పాటు చేసి భారీ స్థాయిలో అక్రమ ఇసుక రవాణా చేస్తున్నారని స్థానిక ప్రజలు సంబంధిత శాఖ అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ అధికారులు పట్టించుకోకుండా కాలయాపన చేస్తున్నారని స్థానిక ప్రజలు విమర్శిస్తున్నారు.

### బూర్గంపాడు ఎస్ఐ మేడా ప్రసాద్ వివరణ...



బుడ్డగూడెం ప్రాంతంలో అక్రమ ఇసుక రవాణా పై ప్రజా వాయిస్ విలేకరి బూర్గంపాడు ఎస్సై మెడ ప్రసాద్ చరవాణిలో వివరణ కోరగా, బూర్గంపాడు మండలంలో అక్రమ ఇసుక రవాణా చేసే వారిపై కచ్చితంగా చర్యలు తీసుకుంటామని, ప్రభుత్వ ఆదాయానికి గండికోడుతూ అక్రమ ఇసుక రవాణా చేస్తే వారెంతటివారైనా చట్టపరమైన చర్యలు తప్పవని తెలిపారు




## పేరుకే ప్రభుత్వ దావఖాన... తీరని పేదల కష్టాలు!

**ప్రజా వాయిస్ మీరుదొడ్డి** ప్రజా వాయిస్ ప్రత్యేక కథనం"నేను వస్తా బిడ్డో... సర్కారు దావఖానకు" అన్న మాటలు పోయి, నేడు " అమ్మో... నేను రాను బిడ్డో సర్కారు దావఖానకు" అనే పరిస్థితికి చేరుకుంది మిరుదొడ్డి ప్రభుత్వ ఆసుపత్రి తీరు. సిద్దిపేట జిల్లా దుబ్బాక నియోజకవర్గంలోనే అత్యంత కీలకమైన మిరుదొడ్డి మండలంలో పేద ప్రజలకు నాణ్యమైన ఉచిత వైద్యం అందించాల్సిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నేడు అలంకారప్రాయంగా మారింది. చిన్నపాటి అనారోగ్య సమస్య వచ్చినా, అత్యవసర చికిత్స కావాలన్నా ప్రజలు కిలోమీటర్ల దూరంలో ఉన్న సిద్దిపేటకు పరుగులు తీయాల్సి వస్తోంది. రూ.లక్షలు వెచ్చించి ఆసుపత్రి భవనాన్ని నిర్మించినప్పటికీ, సరైన వసతులు, సిబ్బంది లేకపోవడంతో ప్రజలకు ఆసుపత్రి సేవలు ఆశించిన స్థాయిలో అందడం లేదు.గ్రామీణ ప్రాంతమైన మిరుదొడ్డి మండలంలో రాత్రి వేళల్లో ఎవరైనా పాము లేదా తేలు కాటుకు గురైతే తక్షణమే చికిత్స అందించే నాథుడే కరువయ్యాడు. రాత్రి సమయాల్లో ఆసుపత్రి మూసివేసి ఉండటంతో, విష ప్రభావం ఒంటికి పాకే లోపే బాధితులను సిద్దిపేటకు తరలించాల్సి వస్తోంది. ఈ ప్రయాణంలో సమయం వృధా అయి ఎంతోమంది ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నాయని స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు గర్భిణీ స్త్రీల పరిస్థితి వర్ణనాతీతంగా మారింది. సాధారణ ప్రసవాలు జరగాల్సిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రాత్రి వేళల్లో సేవలు నిలిచిపోవడంతో ప్రసవ సమయాల్లో మహిళలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. విధిలేక వేలాది రూపాయలు అప్పులు చేసి ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించాల్సిన దుస్థితి దాపురించింది.ప్రభుత్వ వైద్యంపై ప్రజల్లో నమ్మకం సన్నగిల్లక ముందే ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించాల్సిన అవసరం ఉంది. మిరుదొడ్డి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని వెంటనే 24 గంటల ఆసుపత్రిగా ప్రకటించి, ఎదుర్కొంటున్న సిబ్బంది కొరతను తీర్చాలని మండల ప్రజలు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నారు. అత్యవసర సమయంలో రోగికి తక్షణ వైద్యం అందించి ప్రాణాలు కాపాడేలా, ఆసుపత్రిలో అన్ని వేళలా వైద్యులను, నర్సింగ్ సిబ్బందిని అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు.

## ఉపాధ్యాయుల సంక్షేమమే TPUS లక్ష్యం

- PRC, DA పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి
- KGBV ఉపాధ్యాయులకు మినిమం టైం స్కేల్ వర్తింపజేయాలి
- 010 పద్దు కింద వేతనాలు చెల్లించాలి
- TPUS నాయకుడు గుడిపాటి కోటయ్య

**ప్రజా వాయిస్ దామరచర్ల** ఉపాధ్యాయుల సంక్షేమం, వారి సమస్యల పరిష్కారమే తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (TPUS) ప్రధాన లక్ష్యమని సంఘం నాయకుడు గుడిపాటి కోటయ్య అన్నారు. నల్గొండ జిల్లా దామరచర్ల మండలంలోని వివిధ పాఠశాలల్లో బుధవారం తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో సభ్యత్వ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా గుడిపాటి కోటయ్య మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం TPUS నిరంతరం పోరాడుతోందన్నారు. ముఖ్యంగా ఉపాధ్యాయులకు సంబంధించిన PRC, DA తదితర పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ముఖ్యమంత్రిని కలిసి విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.అలాగే కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో (KGBV) పనిచేస్తున్న ఉపాధ్యాయులకు మినిమం టైం స్కేల్ వర్తింపజేయాలని, వారికి 010 పద్దు కింద వేతనాలు చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరినట్లు చెప్పారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు సంఘం నిరంతరం కృషి చేస్తుందని స్పష్టం చేశారు.సభ్యత్వ అభియాన్ ద్వారా ఉపాధ్యాయులను సంఘంలో భాగస్వాములను చేసి, వారి సమస్యలను సమష్టిగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నట్లు నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో డొంకల వెంకటేశ్వర్లు, కర్ణాటి రామిరెడ్డి, శ్రీనివాస్ నాయక్, దేవేందర్, జైపాల్ రెడ్డి, రాము, భాస్కర్ రెడ్డి, రాజు, యాదగిరి, శాంతకుమారి, రాధా, మంగమ్మ, కవిత, పద్మ తదితరులు పాల్గొన్నారు.






## మందమర్రిలో టాస్క్‌ఫోర్స్ బృందం దాడి

- 12 పశువులు, వాహనం స్వాధీనం

**ప్రజా వాయిస్ / మంచిర్యాల క్రైమ్** మంచిర్యాల జోన్ పరిధిలోని మందమర్రి ప్రాంతంలో అక్రమంగా పశువులను తరలిస్తున్న వాహనాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. ఈ సందర్భంగా 12 పశువులతో పాటు మహీంద్రా క్యాంపర్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు,టాస్క్‌ఫోర్స్ ఏసీపీ శ్రీనివాస్ రావు నేతృత్వంలో బుధవారం అందిన విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ లచ్చన్న,సిబ్బంది మందమర్రి టోల్‌ప్లాజా వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు.ఈ క్రమంలో ఆసిఫాబాద్ జిల్లా నుంచి జగిత్యాల జిల్లాలోని రాజారాంపల్లె మార్కెట్‌కు పశువులను అక్రమంగా తరలిస్తున్న మహీంద్రా క్యాంపర్ వాహనాన్ని పోలీసులు ఆపి తనిఖీ చేశారు. వాహనంలో 8 ఆవులు,4 దూడలు, మొత్తం 12 పశువులు ఉన్నట్లు గుర్తించారు.దీంతో పశువులతో పాటు మహీంద్రా క్యాంపర్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.పోలీసులు వాహనాన్ని ఆపిన సమయంలో డ్రైవర్ వారిని గమనించి వాహనం నుంచి దిగి అక్కడి నుంచి పరారయ్యాడు. పరారీలో ఉన్న డ్రైవర్‌ను పట్టుకునేందుకు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.స్వాధీనం చేసుకున్న 12 పశువులు, మహీంద్రా క్యాంపర్ వాహనాన్ని తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం మందమర్రి పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓకు అప్పగించారు.



# మోడల్ రైతు బజార్ షాపులు ప్రారంభం

- మార్కెట్లో మౌలిక వసతులు సదుపాయాల కల్పనకు కృషి డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్
- భారతి నగర్ మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి

**పటాన్ చెరువు ప్రజావాయిస్** భారతీనగర్ డివిజన్ బాంబే కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన మోడల్ రైతు బజార్ షాపుల ప్రారంభ కార్యక్రమానికి పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ ఆదర్శ్ రెడ్డి భారతీనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సింధుఆదర్శ్ రెడ్డి అమీన్‌పూర్ డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్ లు కలిసి ప్రారంభించారు ఈ సందర్భంగా రైతు బజార్ షాపుల కేటాయింపుదారులతో మాట్లాడి, ప్రస్తుతం కొన్ని మౌలిక సదుపాయాల పనులు ఇంకా పెండింగ్‌లో ఉన్నప్పటికీ ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో ఆదివారం నుంచి కూరగాయలు, పండ్లు, నాన్‌వెజ్ తదితర అన్ని రకాల సరుకుల విక్రయాలను పూర్తిస్థాయిలో ప్రారంభించాలని షాపు కేటాయింపుదారులను ఆదర్శ్ రెడ్డి కోరారు.అలాగే రైతు బజార్‌లో మిగిలి ఉన్న షాపులకు టెండర్ ప్రక్రియను కూడా వీలైనంత త్వరగా పూర్తి చేసి, అన్ని షాపులను వినియోగంలోకి తీసుకురావాలని సింధు ఆదర్శ్ రెడ్డి అధికారులను కోరారు.రైతు బజార్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే భారతీనగర్, బాంబే కాలనీతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. ప్రజలకు తాజా కూరగాయలు, పండ్లు, నాన్‌వెజ్ తదితర సరుకులు ఒకే చోట అందుబాటు ధరల్లో లభించడంతో పాటు, నిత్యావసర సరుకుల కొనుగోలు మరింత సులభతరం అవుతుంది. ప్రజల సౌకర్యం, ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేసి రైతు బజార్‌ను పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని ఆదర్శ్ రెడ్డి గారు, సింధు ఆదర్శ్ రెడ్డి కోరారు.ఈ కార్యక్రమంలో రామచంద్రాపురం మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య , బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కుమార్ గౌడ్ , జగన్నాథ్ రెడ్డి , జీహెచ్ఎంసీ అధికారులు, షాపుల కేటాయింపుదారులు స్థానిక నాయకులు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం వహించవద్దు

- పనులు ప్రారంభించని కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టండి
- తాగునీరు పారిశుద్ధ్యం విద్యుత్ అంశాలకు ప్రథమ ప్రాధాన్యత
- త్వరలో నూతన సబ్ స్టేషన్లు షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభోత్సవం
- ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పని చేయండి
- పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- నియోజకవర్గస్థాయి ప్రభుత్వ శాఖల అధికారులతో ఎమ్మెల్యే జిఎంఆర్ సమీక్ష సమావేశం



**పటాన్ చెరువు ప్రజావాయిస్** ప్రజలకు అత్యంత ఆవశ్యకమైన తాగునీరు సరఫరా, నిరంతర విద్యుత్ పంపిణీ, పారిశుధ్యం, తదితర అంశాల్లో అలసత్వం వహించవద్దని.. నిరంతరం క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ అభివృద్ధి పనులను పర్యవేక్షించాలని ఆయా శాఖల ఉన్నత అధికారులకు ఎమ్మెల్యే జిఎంఆర్ సూచించారు. బుధవారం ఉదయం క్యాంపు కార్యాలయంలో అమీన్పూర్, పటాన్చెరు బల్దియా డిప్యూటీ కమిషనర్లు, మున్సిపల్ కమిషనర్లు, మున్సిపల్ చైర్మన్లు, విద్యుత్, నీటిపారుదల, టౌన్ ప్లానింగ్, క్యూర్ అర్బన్ రీజియన్ పాఠశాలల శాఖల అధికారులతో వివిధ అంశాలపై ఎమ్మెల్యే జిఎంఆర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తు తరాలకు నాణ్యమైన కార్పొరేట్ విద్యను అందించాలన్న లక్ష్యంతో అమీన్పూర్, పటాన్చెరు సర్కిళ్ల పరిధిలో 345 కోట్ల రూపాయలతో క్యూర్ అర్బన్ రీజియన్ పాఠశాలలు నిర్మిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే కిష్టారెడ్డిపేట, అమీన్పూర్, తెల్లాపూర్ పరిధిలో నిర్మాణ పనులు ప్రారంభించినట్లు తెలిపారు. ప్రాథమిక విద్య నుండి ఇంటర్మీడియట్ వరకు తరగతులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఆధునిక వసతులు.. అత్యాధునిక సౌకర్యాలతో వీటిని నిర్మిస్తున్నట్లు తెలిపారు.ఎల్ నినో ప్రభావంతో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. గ్రామాలు, పట్టణాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు.పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా లో ఓల్టేజ్ సమస్యలు తలెత్తకుండా పవర్ ట్రాన్స్ఫార్మర్లు, నూతన సబ్ స్టేషన్లు నిర్మిస్తున్నట్లు ఎమ్మెల్యే జిఎంఆర్ తెలిపారు. అక్టోబర్ మొదటి వారంలో పోచారం, లకడారం సబ్ స్టేషన్లు ప్రారంభించబోతున్నట్లు ఆయన తెలిపారు. నూతన కాలనీలలో పవర్ ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. శిథిలావస్థకు చేరుకున్న స్తంభాల స్థానంలో నూతన స్తంభాలు ఏర్పాటు చేయాలని.. అవసరమైతే సొంత నిధులతో స్తంభాలు కొనుగోలు చేసి ఇస్తానని అధికారులకు తెలిపారు. అమీన్పూర్, పటాన్చెరు సర్కిళ్ల పరిధిలోని ప్రతి వార్డులో ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలకు రూపకల్పన చేయాలని డిప్యూటీ కమిషనర్లను ఆదేశించారు. నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ.. ప్రజల సమస్యలను తెలుసుకుంటూ.. వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. టెండర్లు పూర్తయి శంకుస్థాపన చేసిన పనుల పురోగతిని తెలుసుకున్నారు. ఇస్నాపూర్, ఇంద్రేశం, గడ్డపోతారం, గుమ్మడిదల, జిన్నారం మున్సిపాలిటీల పరిధిలో 75 కోట్ల రూపాయల నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. 50 శాతం పనులు పూర్తయ్యాయని.. మిగిలిన పనులు త్వరలో పూర్తి చేయనున్నట్లు కమిషనర్లు తెలిపారు. పనులు ప్రారంభించని కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవడంతో పాటు.. అవసరమైతే బ్లాక్ లిస్టులో పెట్టాలని ఆదేశించారు. పన్ను సవరణ అంశంలో ప్రజలకు భారం కాకుండా చర్యలు చేపట్టాలని సూచించారు.ప్రజల అభిప్రాయాలు, ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేసినప్పుడే ప్రజల నమ్మకాన్ని పొందుతామని ప్రజాప్రతినిధులకు సూచించారు. ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయాలు చేయాలని.. అభివృద్ధిలో కలిసి పనిచేయాలని కోరారు.పటాన్చెరు, గుమ్మడిదల మండలాల పరిధిలోని గ్రామాలలో ప్రభుత్వం అందించే నిధులతో పాటు సిఎస్ఆర్ నిధులు కేటాయించనున్నట్లు తెలిపారు. పటాన్చెరువు మండల పరిధిలోని నందిగామ గ్రామంలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ ను త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ శాఖల అధికారులు ప్రతి నెలకు ఒకసారి అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలపై సమావేశాలు నిర్వహిస్తూ.. సమన్వయంతో పనిచేస్తే అభివృద్ధి పరుగులు పెడుతుందని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారంలో అలసత్వం వహించకూడదని.. నిధుల కొరత ఉంటే తనను నేరుగా సంప్రదించాలని కోరారు. పటాన్చెరు నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు ఈ సమీక్ష సమావేశంలో నియోజకవర్గస్థాయి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు



# గణేష్ ఉత్సవాల వేళ పారిశుద్ధ్యం గాలికొదిలేసిన మున్సిపల్

- రెండు నెలలుగా రోడ్డుపై మురుగునీరు
- రాంనగర్ - గాంధీ నగర్ ఎన్టీఆర్ చౌరస్తా కూడలిలో పారుతున్న వైనం
- ప్రజలకు ఇబ్బందులు పట్టించుకోని శానిటేషన్ అధికారులపై స్థానికుల మండిపాటు

**ప్రజా వాయిస్ జహీరాబాద్:** గణేష్ పండుగ ఉత్సవాల శుభ సందర్భంగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నామని ప్రకటిస్తున్నప్పటికీ, కాలనీల్లో నెలకొన్న మురుగునీటి సమస్యలను మాత్రం పూర్తిగా విస్మరించారని స్థానికులు ఆరోపిస్తున్నారు. పట్టణ మున్సిపాలిటీ పరిధిలోని గాంధీ నగర్, రాంనగర్ ఎన్టీఆర్ విగ్రహం ప్రధాన కూడలిలో గత రెండు నెలలుగా మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తున్నా సంబంధిత శానిటేషన్ అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్గంలో వెళ్లే ప్రధాన మార్గమే మురుగునీటితో నిండిపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. ఈ మురుగు నీరు రోడ్డుపై వస్తున్నడడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ,గణేష్ ఉత్సవాల పండుగ ఏర్పాట్లతో పాటు ప్రజారోగ్యం, పారిశుద్ధ్యానికి సంబంధించిన సమస్యలపై కూడా అధికారులు దృష్టి సారించాలని,రామ్ నగర్ , గాంధీనగర్ ప్రాంతంలో నెలకొన్న సమస్యను వెంటనే శాశ్వతంగా పరిష్కరించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# ఆర్టీఐ సమాచారం కోరితే బెదిరింపులు

- సమాచార హక్కు కమిషనర్ ను ఆశ్రయించిన ముదిగొండ గోపాల్
- నిడమనూరు తహసీల్దార్ కార్యాలయంపై సమగ్ర విచారణకు డిమాండ్



**ప్రజా వాయిస్, నిడమనూరు** నిడమనూరు మండల తహసీల్దార్ కార్యాలయంలో జరుగుతున్న అక్రమాలు, నిధుల దుర్వినియోగానికి సంబంధించిన వివరాలను సమాచార హక్కు చట్టం–2005 ద్వారా కోరగా అధికారులు సమాచారం ఇవ్వకుండా నిర్లక్ష్యం చేశారని, పైగా తాను కోరిన సమాచార వివరాలను ప్రైవేట్ వ్యక్తులకు చేరవేసి వారి ద్వారా తనను ఫోన్‌లో బెదిరింపులకు గురిచేశారని ముదిగొండ గోపాల్ ఆరోపించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను ఫోన్‌లో బెదిరించిన ఘటనకు సంబంధించిన ఆడియో రికార్డులు కూడా తన వద్ద ఉన్నాయని, ఈ విషయంపై నిబంధనల ప్రకారం ఆర్డీఓకు మొదటి అప్పీల్ దాఖలు చేయగా, సమాచారం అందించాలని ఆర్డీఓ కార్యాలయం నుంచి నిడమనూరు తహసీల్దార్ కార్యాలయానికి నోటీసులు జారీ చేసినప్పటికీ ఇప్పటివరకు స్పందన లేదని పేర్కొన్నారు.సంబంధిత అధికారులు స్పందించకపోవడంతో న్యాయం కోసం తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కు కమిషనర్ దేశాల భూపాల్‌ను హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో కలిసి గోపాల్ ఫిర్యాదు అందజేశామని తెలిపారు.తాను సమర్పించిన పత్రాల్లో పేర్కొన్న అంశాలను పరిశీలించి, ఎక్కడైనా విధుల నిర్వహణలో అవకతవకలు, నిధుల దుర్వినియోగం జరిగి ఉంటే సమగ్రంగా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను కోరినట్లు తెలిపారు.ఫిర్యాదుపై స్పందించిన కమిషనర్ భూపాల్, గోపాల్ సమక్షంలోనే నిడమనూరు తహసీల్దార్‌కు ఫోన్ చేసి మాట్లాడేందుకు ప్రయత్నించినట్లు గోపాల్ తెలిపారు. అయితే తహసీల్దార్ ఫోన్ లిఫ్ట్ చేయలేదని పేర్కొన్నారు. ఫిర్యాదును పరిశీలించి వాస్తవాలు నిర్ధారణ అయితే చట్టపరమైన, శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చినట్లు ఆయన వెల్లడించారు.ఆర్టీఐ దరఖాస్తుదారుడి వివరాలను అనధికార వ్యక్తులకు చేరవేయడం వల్ల తనకు ప్రాణహాని ఉందని గోపాల్ ఆందోళన వ్యక్తం చేశారు. తాను కలెక్టర్, ఆర్డీఓ తదితర అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ స్థానిక స్థాయిలోనే విచారణ జరగడం వల్ల తనకు న్యాయం జరగడం లేదని ఆరోపించారు.స్థానిక తహసీల్దార్ జంగాల కృష్ణయ్య ఆధ్వర్యంలోనే విచారణ జరగడం వల్ల నిష్పాక్షిక విచారణపై అనుమానాలు ఉన్నాయని గోపాల్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో స్థానిక అధికారులకు సంబంధం లేని ప్రత్యేక అధికారిని నియమించి, మొత్తం వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టాలని, క్షేత్రస్థాయిలో ఆడిట్ నిర్వహించాలని జిల్లా కలెక్టర్‌ను పత్రికా ముఖంగా కోరారు.అలాగే తనకు ఎదురవుతున్న బెదిరింపుల నేపథ్యంలో రక్షణ కల్పించాలని జిల్లా కలెక్టర్‌ను గోపాల్ విజ్ఞప్తి చేశారు.

# మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలల సమస్యలపై అసెంబ్లీలో సిర్పూర్ ఎమ్మెల్యే హరీష్ బాబు

**ప్రజా వాయిస్ కగజ్ నగర్** కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం టీఎంఆర్ఈఐఎస్ బాయ్స్–1, బాయ్స్–2 పాఠశాలలు ఎదుర్కొంటున్న సమస్యలను సిర్పూర్ శాసనసభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు అసెంబ్లీలో ప్రస్తావించారు. బాయ్స్–1లో 9 మంది రెగ్యులర్ సిబ్బంది, 19 మంది ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఉండగా, బాయ్స్–2లోనూ దాదాపు అంతే సిబ్బంది ఉన్నారని తెలిపారు. పాఠశాలల పక్కనే డంపింగ్ యార్డు ఉండటం వల్ల విద్యార్థులు అనారోగ్యాల బారిన పడుతున్నారని వివరించారు. అడ్మినిస్ట్రేషన్ సరిగా లేదని, మారుమూల జిల్లాకు మంత్రి స్వయంగా వచ్చి రివ్యూ మీటింగ్ నిర్వహించాలని కోరారు.మండలాల్లో ఇంటిగ్రేటెడ్ మండల ఆఫీసు కాంప్లెక్స్‌లను నిర్మించాలని కూడా అసెంబ్లీలో విజ్ఞప్తి చేశారు.






# ఘనంగా బార్బర్స్ డే వేడుకలు

- జెండా ఆవిష్కరించిన కడియాల

**జూలూరుపాడు, ప్రజా వాయిస్:**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జూలూరుపాడు మండల కేంద్రంలో నాయి బ్రాహ్మణ సేవా సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో బార్బర్స్ డే వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని ప్రధాన రహదారిలో నాయి బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రధాన సెంటర్ లో నాయి బ్రాహ్మణ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు కడియాల సత్యనారాయణ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 16 న నాయి బ్రాహ్మణులకు స్వాతంత్రం వచ్చిన రోజుగా అభివర్ణించారు. 365 రోజులలో 364 రోజులు శ్రమ దోపిడీకి గురవుతున్న మాకు ఈ రోజునే విశ్రాంతి కలుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా నాయి బ్రాహ్మణ మిత్రులందరికీ బార్బర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు కుదురుపాక నిర్మల, జిల్లా నాయకులు కొల్లిపాక వెంకటేశ్వర్లు, జిల్లా యూత్ సహాయ కార్యదర్శి మార్కాపూరి నరసింహారావు, డివిజన్ సహాయ కార్యదర్శి వల్లోజి రమేష్, వైరా నియోజవర్గం ఇన్చార్జి మాడుగుల నాగరాజు, కో కన్వీనర్ కడియాల పుల్లయ్య, మండల అధ్యక్షుడు కడియాల శ్రీను, కార్యదర్శి పెద్దవరపు కృష్ణార్జునరావు తో పాటు మహిళలు, కుల పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



# గణనాథుడికి వినతిపత్రం

**ప్రజా వాయిస్, కథలాపూర్:**తెలంగాణ విమోచన దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని కోరుతూ బుధవారం కథలాపూర్ మండలం సిరికొండలో 'నవతరం యూత్' సభ్యులు వినాయకుడికి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం, సీఎంకి మంచి ఆలోచన ప్రసాదించాలని వేడుకున్నారు. సెప్టెంబర్ 17న అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, బడుల్లో జాతీయ జెండా ఎగురవేయాలని, అమరవీరులు, స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాలను సత్కరించాలని కోరారు. కార్యక్రమంలో యూత్ ప్రతినిధులు చింతకుంట రవి, కాసోజి ప్రశాంత్, గాంధారి శ్రీనివాస్, రాహుల్, శివ, శ్రీశాంత్, చరణ్, రామ్ పాల్గొన్నారు.

# గురుకుల పాఠశాలలో విద్యార్థిని గాయపరిచిన పిచ్చికుక్క

- ప్రహరీ గోడ కూలిపోవడంతో ఆశ్రమ పాఠశాలలోకి ప్రవేశించిన పిచ్చికుక్క
- ప్రహరీ గోడ కూలి విద్యార్థిని విద్యార్థులకు ప్రాణ సంకటం

**ప్రజా వాయిస్ దోమకొండ**/దోమకొండ మండలంలోని సాంఘిక సంక్షేమ గురుకుల ఆశ్రమ పాఠశాల కళాశాలలో విద్యార్థిని పిచ్చికుక్క గాయపరిచింది. గత సంవత్సరం కురిసిన భారీ వర్షాలకు గురుకుల పాఠశాల ప్రహరీ గోడ కూలిపోయింది. ప్రహరీ గోడను నిర్మించాలని తల్లిదండ్రులు ఆశ్రమ పాఠశాల సిబ్బంది పలుమార్లు విన్నవించిన ప్రహరి గోడ నిర్మించలేదు. కూలిపోయిన ప్రాణాలు గోడ నుండి పిచ్చికుక్క ప్రవేశించి విద్యార్థిని గాయపరిచింది. ఆశ్రమ పాఠశాలలో కుక్కల బెడద తీవ్రంగా ఉందని సిబ్బంది వాపోతున్నారు. విద్యార్థిని గాయపరిచిన కుక్కల బెడదల వల్ల విద్యార్థిని విద్యార్థులు భయభ్రాంతులకు గురవుతున్నారు.విద్యార్థులు కుక్కల సమస్యలపై త్వరగా పరిష్కరించాలనిపంచాయతీ పాలకవర్గం, సర్పంచ్ నరసయ్యకి ప్రిన్సిపల్ విన్నవించారు.





## SIR ఓటర్ల జాబితా సవరణను వేగవంతం చేయాలి

**ప్రజా వాయిస్ పరకాల** ఎస్ ఐ ఆర్ ఓటర్ల జాబితా సవరణను వేగవంతం చేయాలని ఎస్ ఐ ఆర్ కోఆర్డినేటర్ చందుపట్ల రాజిరెడ్డి అన్నారు. బుధవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో SIR ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ద్వారా పరకాల మున్సిపాలిటీ 2,13వ వార్డులలోని 56,57వ బూత్ ల వారిగా ఓటరు అన్ మ్యాపింగ్ కాని వారికి, నోటీసులు అందించిన వాటిని స్వీకరించారు. అప్లోడ్ కంప్లీట్ చేసి వాటిని సవరణ ముసాయిదా ప్రకారం వారు ఓటు హక్కు వినియోగించుకోని ఓటు మన బాధ్యత మన హక్కు దీనిని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని చందుపట్ల రాజిరెడ్డి కోరారు. . ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ సుమన్, జిపిఓ షాకీర్, మున్సిపాలిటీ కమిషనర్ పవన్, పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఒంటేరు శ్రావణ్ కుమార్, BLA లు బొమ్మకంటి చంద్రమౌళి, బొచ్చు మహేందర్,BLO కోడెపాక పూర్ణిమ, కవిత, అల్లం శ్రీరామ్, ఒంటేరు సారయ్య, బొచ్చు క్రిస్ట, బొచ్చు కొమురయ్య, బొమ్మకంటి కృష్ణ, రైరాకుల సారయ్య బొచ్చు మహేష్, బొచ్చు సారయ్య తదితరులు పాల్గొన్నారు.

## జగిత్యాల జిల్లా ఎండోమెంట్ ధార్మిక సెల్ కమిటీల నియామకం

**ప్రజా వాయిస్, కోరుట్ల:** జగిత్యాల జిల్లా వ్యాప్తంగా ఎండోమెంట్ ధార్మిక సెల్ అసెంబ్లీ, మండల, మున్సిపల్ కమిటీలను నియమించినట్లు జిల్లా కన్వీనర్ మాడవేణి నరేష్, రాష్ట్ర జాయింట్ కన్వీనర్ భోగా రవికుమార్ తెలిపారు. ఈ నూతన కమిటీలు తక్షణమే అమల్లోకి వస్తాయని వారు తెలిపారు. మండలాల వారీగా నూతన బాధ్యులు: రాయికల్ నుంచి బోడ్గం శైలేందర్, రాగుల లింగం, బీర్పూర్ నుంచి శ్రీపతి రమేష్, గర్శకుర్తి రమేష్, పెగడపల్లి నుంచి గుంటుల జగదీష్, సంకిటి మల్లారెడ్డి, ఎండపల్లి నుంచి నడిమెట్ల రాజేశం, వెల్గటూర్ నుంచి కొల్లూరి జితేందర్, రామగిరి రాజు, ధర్మారం నుంచి దేవసాని రాజన్న, కోరుట్ల టౌన్ నుంచి బొమ్మన జలేందర్, గుర్రాల ప్రసాద్, కోరుట్ల రూరల్ నుంచి ఎదురుగట్ల చక్రపాణి, మెట్పల్లి నుంచి జరుపుల శ్రీనివాస్, మల్లాపూర్ నుంచి వనతడుపుల రమణాచారి, ఇబ్రహీం పట్నం నుంచి బండి గోపాల్, జగిత్యాల అర్బన్ నుంచి బి. శేఖర్, బి. నవీన్, జగిత్యాల రూరల్ నుంచి బి. రామ్మోహన్ శర్మ, జి. మహేష్ లతో పాటు పలువురు నియమితులయ్యారు.

# లోధి సామాజిక వర్గం అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టాలి

- సామాజిక వివక్షకు తావులేకుండా అవకాశాలు కల్పించాలి
- విద్య, ఉపాధి రంగాల్లో మరింత ప్రోత్సాహం అవసరం
- క్షేత్రస్థాయిలో లోధి వర్గ ప్రజల సమస్యలను తెలుసుకున్న బీసీ కమిషన్
- సమస్యలను అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక, సిఫార్సులు: బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్




**పెద్ద శంకరంపేట, ప్రజా వాయిస్:** లోధి సామాజిక వర్గ ప్రజలు సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, డాక్టర్ బాలలక్ష్మీ రంగు పేర్కొన్నారు. లోధి సామాజిక వర్గంపై ఎలాంటి సామాజిక వివక్షకు తావులేకుండా చూడాల్సిన అవసరం ఉందన్నారు.లోధి సామాజిక వర్గ ప్రజలు ఎదుర్కొంటున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి తదితర సమస్యలను క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసేందుకు బీసీ కమిషన్ చైర్మన్, సభ్యులు బుధవారం మెదక్ జిల్లా పెద్ద శంకరంపేట మండలంలోని లోధి సామాజిక వర్గం నివసిస్తున్న ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సంఘాల ప్రతినిధులు, స్థానిక ప్రజలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

### ప్రజల నుంచి నేరుగా అభిప్రాయాల సేకరణ

విద్య, ఉపాధి, ఆర్థికాభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, రిజర్వేషన్లు, వృత్తిపరమైన అవకాశాలు తదితర అంశాలపై కమిషన్ సభ్యులు ప్రజల అభిప్రాయాలను స్వీకరించారు. ఈ సందర్భంగా లోధి సామాజిక వర్గానికి చెందిన ప్రజలు తమకు ఎదురవుతున్న సమస్యలను కమిషన్ దృష్టికి తీసుకువచ్చారు. విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలను పెంచడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.తమ సామాజిక, ఆర్థిక పరిస్థితులపై సమగ్ర అధ్యయనం నిర్వహించి, తమ సమస్యల పరిష్కారానికి తగిన సిఫార్సులు చేయాలని సంఘాల ప్రతినిధులు కమిషన్‌ను కోరారు.

### సమస్యలను అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక

ఈ సందర్భంగా బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ మాట్లాడుతూ లోధి సామాజిక వర్గ ప్రజలు సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. సమాజంలో ఎలాంటి వివక్షకు తావులేకుండా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజల నుంచి నేరుగా అభిప్రాయాలు సేకరించడం ద్వారా వాస్తవ పరిస్థితులను తెలుసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.లోధి సామాజిక వర్గ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి సామాజిక, ఆర్థిక పరిస్థితులు, విద్య, ఉపాధి అవకాశాలకు సంబంధించిన అంశాలను సమగ్రంగా పరిశీలిస్తామని చెప్పారు. ప్రజలు అందించిన వినతులు, సూచనలు, అభిప్రాయాలను పరిశీలించి, కమిషన్ పరిధిలో అధ్యయనం చేసిన అనంతరం ప్రభుత్వానికి తగిన నివేదికలు, సిఫార్సులు అందజేస్తామని తెలిపారు.

### * విద్య, ఉపాధికి మరిన్ని అవకాశాలు కల్పించాలి

అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ పెద్ద శంకరంపేట మండలంలోని ఆరేపల్లి, పెద్ద శంకరంపేట, కమలాపూర్ గ్రామాల్లో లోధి సామాజిక వర్గానికి చెందిన 43 కుటుంబాల్లో 179 మంది ఉన్నట్లు తెలిపారు. అలాగే రేగోడు మండలంలోని కొత్వాన్‌పల్లి గ్రామంలో 19 కుటుంబాలకు చెందిన 77 మంది ఉన్నట్లు వివరించారు.లోధి సామాజిక వర్గానికి చెందిన ప్రజలు కుల ధ్రువీకరణ పత్రాలు పొందే విషయంలో అవగాహన లోపం కారణంగా ప్రస్తుతం ముదిరాజ్ కులం పేరుతో ధ్రువీకరణ పత్రాలు పొందుతున్నట్లు తెలిపారు. ఈ అంశంపై సంబంధిత అధికారులు పరిశీలించి, ప్రజలకు అవసరమైన అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.లోధి సామాజిక వర్గ ప్రజలకు మరిన్ని విద్య, ఉపాధి అవకాశాలు కల్పించి సామాజికంగా ముందుకు తీసుకెళ్లేందుకు చర్యలు అవసరమని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. ఎలాంటి సామాజిక వివక్షకు గురికాకుండా చూడాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో రమాదేవి, బీసీ సంక్షేమ శాఖ అధికారి ఉపేందర్, తహసీల్దార్ నారాయణ, ఎంపీడీవో క్రాంతికుమార్, సర్పంచ్ జంగం రేణుక, శ్రీనివాస్‌తో పాటు సంబంధిత జిల్లా అధికారులు, బీసీ సంక్షేమ శాఖ అధికారులు, లోధి కుల సంఘాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## భార్య కాపురానికి రావడంలేదని దారుణం

- ఆమె ముక్కు కొరికిన భర్త

**ప్రజా వాయిస్ /మంచిర్యాల క్రైమ్** మంచిర్యాల జిల్లాలో ఒక అమానుష ఘటన వెలుగు చూసింది. భార్య కాపురానికి రావడం లేదన్న కోపంతో కట్టుకున్న భర్తే ఆమెపై విచక్షణారహితంగా దాడికి తెగబడ్డాడు. ఈ దారుణ ఘటన కోటపల్లి మండలం మల్లంపేట గ్రామంలో చోటుచేసుకుంది.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మల్లంపేట గ్రామానికి చెందిన ఎనగందుల మణిచందర్, మమత దంపతుల మధ్య కొంతకాలంగా కుటుంబ కలహాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో భార్య మమత కొద్దిరోజులుగా పుట్టింటిలోనే ఉంటోంది.తాజాగా భార్య కాపురానికి రావడం లేదనే నెపంతో మణిచందర్ తీవ్ర ఆవేశానికి లోనయ్యాడు. ఆమెపై దాడి చేసి, అత్యంత పాశవికంగా మమత ముక్కు కొరికేశాడు. ఈ ఘటనలో బాధితురాలికి తీవ్ర గాయాలయ్యాయి.కుటుంబసభ్యులు వెంటనే స్పందించి బాధితురాలిని మెరుగైన చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అక్కడ ఆమెకు చికిత్స అందుతోంది. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, నిందితుడి కోసం దర్యాప్తు చేపట్టి గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.






## శ్రీధృతి ప్రైవేటు స్కూలు మూసివేతలో జాప్యం ఎందుకు?

- ప్రొసీడింగ్స్ ఆర్.సి నం.1238/బి2/2026 విడుదల చేసినా కానీ చర్యలు శూన్యం
- పై అధికారుల, రాజకీయ ఒత్తిళ్లతో చేతులెత్తేసిన హయత్ నగర్ ఎంఈఓ, రంగారెడ్డి డీఈవో
- విద్యార్థులకు ఏదైనా జరగరానిది జరిగితే ఏ అధికారి, ఏ రాజకీయ నాయకుడు బాధ్యత వహిస్తారు?
- ఆర్జేడీ సోమిరెడ్డికి ఫిర్యాదు చేసిన బి.సి చైతన్య వేదిక విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు నగేష్ సూర్యవంశం



**హయత్ నగర్** మండలం, సాహెబ్ నగర్ కలాన్, భవానీ ఎన్‌క్లేవ్‌లో అనుమతులు లేకుండా నడుస్తున్న ఉన్న శ్రీ ధృతి ప్రైవేటు పాఠశాలను మూసివేయాలని బుధవారం ఆర్జేడీ ఆఫీసులో.. ఆర్జేడీ సోమిరెడ్డికి బి.సి చైతన్య వేదిక విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు నగేష్ సూర్యవంశం ఫిర్యాదు చేశారు. తదనంతరం నగేష్ మాట్లాడుతూ.. శ్రీ ధృతి ప్రైవేటు పాఠశాల మౌలిక సదుపాయాలు, అనుమతులు లేకుండా నడుస్తుందని, పాఠశాలను మూసివేయాలని పలుమార్లు ఎంఈఓ, డిఈఓ, కలెక్టర్ ని కలిసి ఫిర్యాదు చేసినా కానీ అధికారులు ఎవరు కూడా పట్టించుకోవట్లేదని.. రాజకీయ ఒత్తిళ్లతో హయత్ నగర్ ఎంఈఓ శ్రీనివాసులు, రంగారెడ్డి డీఈవో వెంకటేశ్వర్లు చేతులెత్తేసారని ఆరోపించారు.ఇదే విషయమై గతంలో ఈ స్కూల్ అనుమతులు లేకుండా నడుస్తున్నందుకు జూలై ఎనిమిదో తారీకు సంబంధిత అధికారులు సీజ్ చేసినప్పటికీ.. ఎంఈఓ ఆదేశాలు బేఖాతరు చేసి మరుసటి రోజే స్కూల్ యాజమాన్యం ఓపెన్ చేసిందని కలెక్టర్, డీఈఓ కి పూర్తి వివరాలతో గుర్తు చేయగా .. కలెక్టర్, డీఈఓ స్పందిస్తూ స్కూల్ పై చట్టపరంగా కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని సంబంధిత ఎంఈఓ కు ప్రొసీడింగ్స్ ఆర్.సి నం.1238/బి2/2026 విడుదల చేసినా కానీ చర్యలు శూన్యం అని వాపోయారు. అనుమతి లేకుండా నడుస్తున్న ఈ స్కూల్లో విద్యార్థులకు ఏదైనా జరగరానిది జరిగితే ఏ అధికారి బాధ్యత తీసుకుంటారని, ఏ రాజకీయ నాయకుడు బాధ్యత వహిస్తాడని, శ్రీధృతి ప్రైవేటు స్కూలు మూసివేతలో జాప్యం ఎందుకు అని ప్రశ్నించారు. ఈ విషయంపై సమగ్ర విచారణ జరపవలసిందిగా.. విద్యార్థుల భవిష్యత్తును, తల్లిదండ్రుల ఆశలను నాశనం చేస్తున్న ఇలాంటి ప్రైవేటు పాఠశాలలను గుర్తించి తక్షణమే మూసివేయా



## అవగాహనతోనే హెచ్ఐవి నివారణ సాధ్యం

**ప్రజా వాయిస్ దోమకొండ**/దోమకొండ. అవగాహనతోనే హెచ్ఐవి నివారణ సాధ్యమవుతుందని తెలంగాణ ఎయిడ్స్ నివారణ సంస్థ బృందం ప్రతినిధులు డాక్టర్ తిరుమల్ రావు, కే రమేష్ తెలిపారు. దోమకొండలో బుధవారం వై.ఆర్.జి కేర్ లింక్ వర్కర్ స్కీమ్ చేస్తున్న కార్యక్రమాలపై సమీక్షించారు. గ్రామపంచాయతీ, దోమకొండ ప్రభుత్వ ఆసుపత్రి, మహిళా గ్రామ సంఘాలను వారు సందర్శించారు. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో హెచ్ఐవి, సుఖ వ్యాధుల ప్రచార నిమిత్తం గోడలపై వేయించిన రాతలను పరిశీలించారు. గ్రామపంచాయతీ సహకారం పై పాలక వర్గాన్ని అభినందించారు. వారు ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రతి ఒక్కరిలో హెచ్ఐవిపై అవగాహన పెరగాలని కోరారు. అవగాహనతో పాటు నివారణ జాగ్రత్తలతోనే హెచ్ఐవి ని అరికట్టడం జరుగుతుందని తెలిపారు. వివిధ రకాల కేటగిరీ ప్రజలతో మాట్లాడారు. హెచ్ఐవి నివారణలో అన్ని వర్గాల వారు భాగస్వాములు కావాలని కోరారు. లింకు వర్కర్ స్కీం ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరిండెంట్ వెంకటేశ్వర్లు, గ్రామ ఉప సర్పంచ్ బొమ్మెర శ్రీనివాస్, వై ఆర్ జి కేర్ ఉమ్మడి జిల్లా డిఆర్పి సుధాకర్, గ్రామ కార్యదర్శి యాదగిరి, వార్డు సభ్యులు పాలకుర్తి శేఖర్, అమర్నాథ్, చింతల స్వామి, రెడ్ క్రాస్ మండల అధ్యక్షుడు రవికుమార్, నాయకులు నాగారపు ఎల్లయ్య, శ్యాం కుమార్, గంగా రాములు, రాజయ్య, ఏఎన్ ఎం సువర్ణ, అంగన్వాడి టీచర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

# '22-ఏ సెక్షన్'తో ప్రజలకు అన్యాయం జరగకూడదు

- భూముల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి
- ప్రజల ఆస్తి హక్కులను కాపాడాలి
- ములుగు కలెక్టర్ కు టీడీపీ నాయకుల వినతి



**ప్రజా వాయిస్ ములుగు జిల్లా:/** 22-ఏ సెక్షన్ కారణంగా ములుగు జిల్లా ప్రజలకు భవిష్యత్తులో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలుగుదేశం పార్టీ జిల్లా నాయకులు బుధవారం ములుగు జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు, తెలంగాణ రాష్ట్ర నాయకత్వం యానాల అనంతరెడ్డి సూచనలతో వివిధ మండలాల పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి ఈ కార్యక్రమం నిర్వహించారు.

### 22-ఏ సెక్షన్ తో ప్రజలు ఇబ్బందులు పడకుండా చూడాలి:

22-ఏ సెక్షన్ పరిధిలో ఉన్న భూముల విషయంలో ప్రజలకు ఎదురయ్యే సమస్యలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని నాయకులు కోరారు. భూముల రిజిస్ట్రేషన్లు, క్రయవిక్రయాలు, వారసత్వ హక్కులు తదితర అంశాల్లో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా స్పష్టమైన పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు.

### నిజమైన భూ యజమానులకు న్యాయం చేయాలి:

ఏళ్ల తరబడి భూములను సాగు చేసుకుంటూ జీవిస్తున్న ప్రజలకు 22-ఏ సెక్షన్ వల్ల ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని నాయకులు కోరారు. అర్హత ఉన్న భూములను నిబంధనల ప్రకారం పరిశీలించి, ప్రజల హక్కులకు భంగం కలగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

### ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యం:

భూముల విషయంలో ప్రజల్లో నెలకొన్న ఆందోళనలను అధికారులు పరిగణనలోకి తీసుకుని సంబంధిత శాఖలతో సమన్వయం చేసి సమస్యను పరిష్కరించాలని తెలుగుదేశం పార్టీ నాయకులు కోరారు.ఈ కార్యక్రమంలో కొడవలి రఘు, మంగపేట, ఇంగటాపూర్ మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్‌రావు, వాజేడు మండల పార్టీ అధ్యక్షుడు గుడివాడ సత్యనారాయణ, సీనియర్ నాయకుడు ఆంజనేయులు, ఏటూరునాగారం మండలం సీనియర్ నాయకుడు గణపనేని శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ ఎం. లాలయ్య, నిరంజన్‌రెడ్డి, రామ్మూర్తి, రమణ, గోవిందరావుపేట మండల పార్టీ అధ్యక్షుడు జంపాల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి ఎస్. రవీంద్రచారి, మండల తెలుగు యువత అధ్యక్షుడు మేపిదేవి నాగబాబు, సమ్మారావు, తాడ్వాయి మండల నాయకుడు దేవనాయక్, ములుగు మండల పార్టీ అధ్యక్షుడు ఎం.ఏ. సలీం, ఇతర నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# పేద కుటుంబాలకు అండగా సీఎం రిలీఫ్ ఫండ్..

**అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యం.**

**మండల కాంగ్రెస్ అధ్యక్షులు సీతారాం రెడ్డి..**

ప్రజా వాయిస్, బయ్యారం..

బయ్యారం మండలం కోటగడ్డ గ్రామానికి చెందిన కేస పెద్ద లింగయ్య గత కొంత క్రితం అనారోగ్యంతో చికిత్స పొంది సీఎం రిలీఫ్ ఫండ్ కు దరఖాస్తు చేసుకున్న సిరిగద్దె రమేష్ కి మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్ సహకారంతో ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు �డ సింగిల్ విండో డైరెక్టర్ జూలకంటి సీతారాం రెడ్డి లబ్ధిదారుడుకు 20000/- రూపాయల విలువగల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు డ సింగిల్ విండో డైరెక్టర్ జూలకంటి సీతారాం రెడ్డి మాట్లాడుతూ,ప్రజలకు అవసరమైన సమయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక చేయూత అందించడం కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పాలనకు నిదర్శనమని, ప్రజల కష్టకాలంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం భరోసాగా నిలుస్తోందని, సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా నిరుపేదలకు ఆర్థిక చేయూత అందిస్తుందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా కృషి చేస్తామని తెలిపారు.ఈ సందర్భంగా లబ్ధిదారుడు లింగయ్యకి సహకరించిన ఎంపీ బలరాం నాయక్ , ఎమ్మెల్యే కోరం కనకయ్య కి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు �డ సింగిల్ విండో డైరెక్టర్ జూలకంటి సీతారాం రెడ్డికు కృతజ్ఞతలు తెలిపారు. ఈ పంపిణీ కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ కళింగ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులుడ దళిత రత్న పుల్లూరి బాలరాజు తదితర పాల్గొన్నారు...



# ప్రాణాంతకంగా మారిన రహదారి

**ఎమ్మెల్యే ఆదిశ్రీనివాస్ దృష్టిసారించాలి**

ప్రజా వాయిస్ కోనరావుపేట /సిరిసిల్ల

రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండల కేంద్రం మీదుగా ఎల్లారెడ్డిపేట చేరుకోవడానికి 12 కిలో మీటర్లదూరం వస్తుంది ఎల్లారెడ్డి పేట మీదుగా కామారెడ్డి చేరుకోవడానికి అతి సులువుమార్గం ఇందులో భాగంగా శివగలపల్లి, అక్కపెల్లి, అడవి మార్గం మధ్యలో అర కిలోమీటర్ తారు రోడ్డు పూర్తిగా అధ్వానంగా మారడంతో వాహనదారులు చాలా ఇబ్బంది పడుతూ ప్రమాదాలకు గురవుతున్నారు ఈతారురోడ్డు వేములవాడ నియోజకవర్గపరిధి కావడంవల్ల దీనిపై సదరు ఎమ్మెల్యే ఆదిశ్రీనివాస్, దృష్టిసారించి త్వరతగతిన రోడ్డు పూర్తి చేయించాలని వాహనదారులు శివంగలపల్లి గ్రామస్తులు కోరుకుంటున్నారు.



# నాయి బ్రాహ్మణుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం అండ

**నిరుపేద నాయి బ్రాహ్మణ కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లలో ప్రాధాన్యత**

**దేవాలయాల్లో సంప్రదాయ సేవలకు నాయి బ్రాహ్మణులకు తగిన గుర్తింపు**

**మంత్రి సీతక్క దృష్టికి సమస్యలు తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తా**

**పైడాకుల అశోక్. డిసిసి అధ్యక్షుడు**

ప్రజా వాయిస్ ములుగు జిల్లా:/

నాయి బ్రాహ్మణుల సంక్షేమం, అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోక్ తెలిపారు. నాయి బ్రాహ్మణ కుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై సంఘం ప్రతినిధులతో మాట్లాడారు.తరతరాలుగా సంప్రదాయ వృత్తినే ఆధారంగా చేసుకుని జీవిస్తున్న నాయి బ్రాహ్మణ కుటుంబాలు అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అశోక్ తెలిపారు. నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు గృహ వసతి కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అర్హులైన నిరుపేద నాయి బ్రాహ్మణ కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో ప్రాధాన్యత కల్పించేలా మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా సహకరిస్తానన్నారు.

దేవాలయాల్లో నాయి బ్రాహ్మణుల సంప్రదాయ సేవలకు గుర్తింపు కల్పించాలి అని అశోక్ అన్నారు. తరతరాలుగా దేవాలయాల్లో సేవలందిస్తున్న నాయి బ్రాహ్మణులకు తగిన ప్రాధాన్యత కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. వెంట్రుకల సేకరణ, కేశ సేవలకు సంబంధించిన హక్కులు, అవకాశాల్లో నాయి బ్రాహ్మణులకు న్యాయమైన వాటా దక్కేలా కృషి చేస్తానని స్పష్టం చేశారు. సంఘం ప్రతినిధులు తమ సమస్యలను తన దృష్టికి తీసుకువచ్చారని, వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు మంత్రి సీతక్కతో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. నాయి బ్రాహ్మణ సంక్షేమం కేవలం మాటలకే పరిమితం కాకుండా అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందేలా కాంగ్రెస్ పార్టీ తరఫున తనవంతు సహకారం అందిస్తానని పైడాకుల అశోక్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా నాయి బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు తమ సమస్యల పరిష్కారానికి అశోక్ హామీ ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు, జిల్లా స్థాయి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.









# టేబుల్ టెన్నిస్ లో రాష్ట్రస్థాయికి ఐపీఎస్ విద్యార్థులు

**- జిల్లా ర్యాంకింగ్ పోటీల్లో మూడు పతకాలు**

ప్రజా వాయిస్, సుల్తానాబాద్

టేబుల్ టెన్నిస్‌లో సుల్తానాబాద్ ఇండియన్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు. ఇటీవల సుల్తానాబాద్‌లోని ఎస్ఎన్ఆర్ స్పోర్ట్స్ అకాడమీలో నిర్వహించిన పెద్దపల్లి జిల్లా స్థాయి ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ పోటీల్లో ముగ్గురు విద్యార్థులు పతకాలు సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు.15 సంవత్సరాల బాలుర విభాగంలో ఎన్. సహర్ష్ అద్భుత ప్రతిభ కనబరిచి బంగారు పతకాన్ని సొంతం చేసుకున్నాడు. 13 సంవత్సరాల బాలుర విభాగంలో పి. కౌశిక్, శ్రీతన్ దీక్షన్ కాంస్య పతకాలు సాధించారు. జిల్లా స్థాయిలో మెరుగైన ప్రదర్శనతో నిలిచిన ఈ ముగ్గురు విద్యార్థులు ఈ నెల 17న హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి ర్యాంకింగ్ పోటీలకు ఎంపికయ్యారు.విద్యార్థుల విజయంపై పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్‌కుమార్, ప్రిన్సిపాల్ కృష్ణప్రియ హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థులను సన్నద్ధం చేసిన టేబుల్ టెన్నిస్ కోచ్ సత్యనారాయణను అభినందించారు. క్రీడల ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని పేర్కొన్నారు. క్రీడా రంగంలో విద్యార్థులు మరింతగా రాణించేలా పాఠశాల తరఫున అవసరమైన ప్రోత్సాహం, సహకారం అందిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సునీత, మేనేజర్ శివ, పీఈటీలు సతీష్, జ్యోతి పాల్గొన్నారు.

# తెలంగాణ సాయుధ పోరాటం లో నైజాం నవాబును గడగడలాడించిన సింహం బద్దం ఎల్లారెడ్డి

**జలపాతంలాంటి ఉద్యమ ప్రస్థానం..**

**వెట్టిచాకిరీపై కదంతొక్కిన సమరయోధుని స్ఫూర్తిదాయక జీవిత విశేషాలు**

ఉమ్మడి కరీంనగర్ జిల్లా,ప్రస్తుత రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం గాలిపల్లి గ్రామంలో బద్దం హన్మంతరెడ్డి, లచ్చవ్వ (లక్ష్మమ్మ) దంపతులకు రెండో సంతానంగా 1906లో బద్దం ఎల్లారెడ్డి జన్మించారు. చిన్నతనం నుంచే నిజాం పాలనలోని అన్యాయాలను, గ్రామీణ ప్రాంతాల్లో దొరలు, దేశ్‌ముఖ్‌ల అణచివేతను కళ్లారా చూసిన ఆయనలో విప్లవాగ్ని రగిలింది. విద్యార్థి దశలోనే స్వాతంత్ర్య కాంక్షతో చదువును, ఉద్యమాన్ని సమాంతరంగా సాగించిన ఆయన, గాంధీజీ పిలుపుతో పాఠశాల విద్యను దాటి 1930లో కాకినాడ ఉప్పు సత్యాగ్రహంలో చురుగ్గా పాల్గొన్నారు. ఆ పోరాటంలో అరెస్టై రాజమండ్రి జైలులో ఏడు నెలల శిక్ష అనుభవించారు. జైలు నుంచి విడుదలయ్యాక తిరిగి స్వగ్రామం గాలిపల్లి చేరుకుని పాఠశాలను స్థాపించి, ఖద్దరు చొక్కా ఉద్యమాన్ని నడుపుతూనే యువతకు దేశభక్తి పాఠాలు బోధించారు. తదనంతర కాలంలో జవహర్‌లాల్ నెహ్రూ సోషలిస్టు భావజాలానికి, కమ్యూనిజానికి ఆకర్షితులైన ఎల్లారెడ్డి, ప్రజలకు తిండి, భూమి, ఆత్మగౌరవం దక్కాలంటే నైజాం భూస్వామ్య వ్యవస్థపై సాయుధ తిరుగుబాటే శరణ్యమని నమ్మారు. 1940వ దశకంలో ఆంధ్రమహాసభకు ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టి, దానిని నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాడే అగ్నిగోళంగా మలిచారు. 1940లో ఆదివాసీ పోరాట యోధుడు కొమురం భీమ్‌ను నిజాం సైన్యం దారుణంగా హత్య చేసినప్పుడు, సొంతంగా ఘటనా స్థలానికి వెళ్లి నిజ నిర్ధారణ నివేదిక తయారు చేసి పౌర హక్కుల కోసం గళమెత్తిన మొదటి నాయకుడిగా నిలిచారు. ఆయన ఉపన్యాసాలు, చైతన్య రథయాత్రలు నిజాం సర్కారును భయపెట్టడంతో ఆయనపై రాజద్రోహం కేసులు మోపి జైల్లో బంధించినా పోరాట పటిమను సడలించలేకపోయారు. 1947 సెప్టెంబర్ నాటికి నిజాం నవాబు స్వతంత్రంగా ఉంటానని ప్రకటించడంతో ఎల్లారెడ్డి సాయుధ పోరాటానికి పిలుపునిచ్చారు. ఆయన పిలుపుతో ఉమ్మడి కరీంనగర్ వ్యాప్తంగా వేలాదిమంది యువకులు, రైతులు గుర్రేళ్లు, బరిసెలు, కొడవళ్లు చేతపట్టి పోరుబాట పట్టారు. 1948 సెప్టెంబర్ 14న గాలిపల్లిలో ప్రజలందరినీ సమీకరించి జాతీయ పతాకాన్ని ఎగురవేసి నైజాంకు సవాల్ విసిరారు. ఆ ఆగ్రహంతో నిజాం పోలీసులు జరిపిన కాల్పులకు ప్రతీకారంగా, ఎల్లారెడ్డి వ్యూహంతో విప్లవ దళాలు సిరిసిల్ల పోలీస్ స్టేషన్‌పై దాడి చేసి ఆయుధాలను స్వాధీనం చేసుకోవడం ఆయన సాహసానికి అద్దం పడుతుంది.తెలంగాణ విమోచనం అనంతరం దేశంలో తొలిసారి జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కరీంనగర్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసి, భావి భారత ప్రధాని పి.వి. నరసింహారావుపైనే విజయం సాధించి పార్లమెంట్‌లో అడుగుపెట్టారు బద్దం ఎల్లారెడ్డి. ప్రజాప్రతినిధిగా, ఎమ్మెల్యేగా, ఎంపీగా బాధ్యతలు నిర్వర్తించిన జీవితాంతం పేదలు, బలహీనవర్గాల సంక్షేమానికే కృషి చేశారు. విమోచన దినోత్సవం వేళ, రజాకార్ల గుండెల్లో గుండెదురొడ్డి మనకు స్వేచ్ఛాయుత తెలంగాణను అందించిన బద్దం ఎల్లారెడ్డి చూపిన తెగువ, చేసిన త్యాగం తరతరాలకు స్ఫూర్తిదాయకం.

.. రౌతు సంతోష్



# నేడు మండల సమీక్ష సమావేశం

**అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష.. అధికారులకు దిశానిర్దేశం**

**సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, అధికారుల హాజరు తప్పనిసరి**

ప్రజా వాయిస్,వేములపల్లి:

మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సమీక్ష, సామర్థ్య అభివృద్ధి సమావేశం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో జ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. కార్యాలయ సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు మండల ప్రత్యేక అధికారి ఎస్. వెంకటేశ్వర్‌రావు అధ్యక్షతన సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు.మండల పరిధిలోని గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు సమావేశానికి సకాలంలో హాజరై సమీక్షలో పాల్గొనాలని ఆమె కోరారు. గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, పరిపాలనకు సంబంధించిన అంశాలపై సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు.

# తెలంగాణలో స్కూళ్లకు దసరా సెలవులు ఎప్పట్నించి అంటే...?

తెలంగాణ రాష్ట్రంలోని పాఠశాల విద్యార్థులకు విద్యార్థులకు ముఖ్యమైన అప్‌డేట్. రాష్ట్రంలో 1 నుంచి 10వ తరగతి విద్యార్థులకు సంబంధించి సమ్మేటివ్ అసెస్‌మెంట్-1 (SA-1) పరీక్షల షెడ్యూల్‌తో పాటు దసరా సెలవులను విద్యాశాఖ వెల్లడించింది. దీని ప్రకారం, అక్టోబర్ 1వ తేదీ నుంచి 9వ తేదీ వరకు ఎస్ఏ-1 పరీక్షలు జరగనున్నాయి. అనంతరం అక్టోబర్ 10 నుంచి 22వ తేదీ వరకు పాఠశాలలకు దసరా సెలవులను ప్రభుత్వం ప్రకటించింది. పరీక్షల నిర్వహణలో సౌలభ్యం కోసం తరగతుల వారీగా వేర్వేరు సమయాలను కేటాయించారు.




పరీక్షల సమయాల వివరాలు ఇలా ఉన్నాయి:

1 నుంచి 5వ తరగతి వరకు: విద్యార్థులకు ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:00 గంటల వరకు

6, 8వ తరగతులకు: ఉదయం 9:15 నుంచి మధ్యాహ్నం 12:00 గంటల వరకు

7వ తరగతికి మధ్యాహ్నం 1:15 నుంచి సాయంత్రం 4:00 గంటల వరకు

9వ తరగతికి మధ్యాహ్నం 1:15 నుంచి సాయంత్రం 4:15 గంటల వరకు

10వ తరగతి విద్యార్థులకు ఉదయం 9:15 నుంచి మధ్యాహ్నం 12:15 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు.కాగా, తరగతుల వారీగా ఆయా సబ్జెక్టుల పరీక్ష తేదీలతో కూడిన పూర్తి స్థాయి కూడిన టైమ్ టేబుల్ ఇప్పటికే అందుబాటులోకి వచ్చింది. ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం విద్యార్థులు, ఉపాధ్యాయులు పరీక్షలకు సన్నద్ధం కావాలని విద్యాశాఖ సూచించింది.

# జాబ్ మేళాలతో కొలువులు రావు

**హామీలు అమలు చేయకుండా హడావుడి కార్యక్రమాలెందుకు?**

**రూ.4 వేల నిరుద్యోగ భృతి.. జాబ్ క్యాలెండర్ ఏమైంది?**

**రెండు లక్షల ఉద్యోగాల భర్తీపై స్పష్టత ఇవ్వాలి**

**ఖాళీల లెక్క తేల్చి.. నియామక తేదీలు ప్రకటించాలి**

ప్రజా వాయిస్,మోతె:

జాబ్ మేళాల పేరుతో నిరుద్యోగ యువతను మభ్యపెట్టకుండా, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు శీలం సైదులు యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని కోరారు. బుధవారం మోతె మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టుల సంఖ్యను ప్రజల ముందుంచాలని, నోటిఫికేషన్లు, పరీక్షలు, నియామకాలకు తేదీలు ప్రకటిస్తూ జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయాలని అన్నారు. నెలకు రూ.4 వేల నిరుద్యోగ భృతి ఇస్తామన్న హామీ ఏమైంది? రెండు లక్షల ఉద్యోగాల భర్తీ ఎక్కడ ఆగింది? జాబ్ క్యాలెండర్ ఎందుకు అమలు కావడం లేదు అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.జాబ్ మేళాలు నిర్వహించడం మాత్రమే నిరుద్యోగ సమస్యకు పరిష్కారం కాదని పేర్కొన్నారు. ప్రభుత్వ ఖాళీలను భర్తీ చేసి యువతకు శాశ్వత ఉపాధి కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. నిరుద్యోగుల భవిష్యత్తుపై స్పష్టమైన కార్యాచరణ ప్రకటించి, ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.సమావేశంలో జిల్లా నాయకులు ఏలూరి వెంకటేశ్వర్లు, ఆరె లింగారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి మద్ది మధుసూదన్‌రెడ్డి, మాజీ సర్పంచులు బానోత్ వెంకన్న, మూడ్ క్రిష్ణ, దేవుల, మాజీ జడ్పీటీసీ నవీతే రాంకోటయ్య, కారింగుల సత్యనారాయణ, బత్తిని కనకయ్య, కమలాకర్, రాముడు, ప్రవీణ్, వెంకన్న, లింగయ్య, నాగరాజు, రవి తదితరులు పాల్గొన్నారు.







## గిరిజనేతరులు సాగు చేసుకుంటున్నా భూమికి పట్టలేకపాయే ఎరువులు రాకపాయే

### ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనేతరుల రైతులకు యూరియా కష్టాలు

**ప్రజా వాయిస్ కొత్త గూడ**

ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త యూరియా బుకింగ్ యాప్ నిబంధనలు మహబూబాబాద్ జిల్లా లోని గిరిజనేతర రైతులకు శాపంగా మారాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనేతర రైతులకు పట్టాలు లేకపోవడంతో యాప్‌లో యూరియా బుకింగ్ చేసుకోలేక ఇబ్బందులు పడుతున్నామని రైతులు చెబుతున్నారు.గతంలో ఆధార్ నంబర్ ఆధారంగా వ్యవసాయ వివరాలను నమోదు చేసి యూరియా పొందే అవకాశం ఉండేదని... ఇప్పుడు మాత్రం భూమి పట్టా, ల్యాండ్ డీటెయిల్స్ తప్పనిసరి చేయడంతో ఏజెన్సీలో ఏళ్లుగా సాగు చేసుకుంటున్న గిరిజనేతర రైతులకు కొత్త సమస్య ఎదురైంది.ల్యాండ్ డీటెయిల్స్ నమోదు చేసినా... వ్యవసాయ అధికారి లాగిన్ ద్వారా అప్రూవల్, సంబంధిత భూ పత్రాల అప్‌లోడ్ తప్పనిసరి కావడంతో యూరియా కోసం రైతులు పడిగాపులు కాస్తున్నారు.ఇప్పటికే వర్షాల ప్రభావంతో పంటలు నష్టపోతున్న రైతులకు... యూరియా అందక మరింత ఇబ్బందులు ఎదురవుతున్నాయి.తమ సమస్యపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి... ప్రత్యామ్నాయ మార్గం చూపి, ప్రతి రైతుకు అవసరమైన సమయంలో యూరియా అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.



## భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చరిత్రను విస్మరిస్తే సహించబోము

### హమారా ప్రసాద్ వీపుపై స్వేరో నగరా

**తొర్రూర్ ప్రజా వాయిస్**

మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పట్టణ కేంద్రంలోని ఆర్ ఢ బి గెస్ట్ హౌస్ లో నిర్వఖహించిన పత్రిక సమావేశంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి,.ఆర్ అంబేద్కర్ వ్యక్తిత్వాన్ని కించపరిచేలా, అవమానించేలా ఎవరైనా ఉద్దేశపూర్వకంగా వ్యాఖ్యలు చేయడం లేదా రచనలు చేయడం ఉద్రిక్తతలకు దారి తీసే అవకాశం ఉందని తెలిపారు.హమారా ప్రసాద్ అనే వ్యక్తి కొత్త పుస్తకం రచించడం జరిగింది.ఆ ;పుస్తకంలో ప్రపంచ మేధావి, రాజ్యాంగ డా.బాబా సాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యంగానీ తప్పు పట్టే విధంగా ఉన్నట్లు స్వేరోస్ రాష్ట్ర క2దమిటీ మరియు జిల్లా కమిటీ వ్యతిరేకించారు.ఈ సందర్భంగా మంద శ్యామ్ మాట్లాడుతూ, హమారా ప్రసాద్ అనే వ్యక్తి బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగని మార్క్ చేసే విధంగా, ఓ కొత్త పుస్తకం రచించడం జరుగుతుంది. పేద బడుగు,బలహీన, దళిత వర్గాలపై ఉనికపై దెబ్బతీసే విధంగా దళిత సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి బీజేపీ మరియు ఆర్ఎస్ఎస్, కనుసున్నాల్లో భారత రాజ్యాంగం అవమానించే విధంగా ఉక్కు రక్షిస్తున్నాడని, దాని తక్షణమే విరమించుకోకపోతే స్వేరోస్ వారికి తగిన విధంగా గుణపాఠం చెప్తుందని అన్నారు.



## మండల ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డు

**ప్రజా వాయిస్ :-**

తిరుమలగిరి మండల కేంద్రంలోని కొంపల్లి గ్రామ పాఠశాలలోని చారి సార్ మరియు శైలజ మేడం గార్లకు మండల ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డు రావడం జరిగింది ఈ యొక్క విషయం తెలుసుకున్న కొంపెల్లి గ్రామ సర్పంచ్ సాలమ్మ రవీందర్ గారు పాఠశాలకు వెళ్లి ఆ యొక్క ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలియజేసి సన్మానం చేయడం జరిగింది ఈ యొక్క కార్యక్రమంలో హాలియా మున్సిపల్ రెండో వార్డ్ కౌన్సిలర్ అన్నపూర్ణ సైదులు గారు మరియు కొంపెల్లి గ్రామ 4వా వార్డు మెంబర్ పోతురాజు లింగయ్య గారు,7వా వార్డ్ మెంబెర్ జంగాల వజ్రమ్మ వెంకన్న గారు మరియు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర రెడ్డి గారు, గ్రామ పెద్దలు, యువకులు పాఠశాల ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## పేరుకే కొత్త మండలం..పాలన మాత్రం పాత మండలం నుంచే!

### పలిమెల మండల కేంద్రం నుంచే ప్రభుత్వ సేవలు అందించాలని ప్రజల డిమాండ్

### సమస్యల కోసం 30 కిలోమీటర్లు.. ఒక్క పనికి ఒక రోజు వృథా!

### అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పరిపాలనను పలిమెలకు మార్చాలని విజ్ఞప్తి

**ప్రజా వాయిస్, పలిమెల:**

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మారుమూల ప్రాంతమైన పలిమెల కొత్త మండలంగా ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా.. ఇప్పటికీ పూర్తిస్థాయి ప్రభుత్వ పరిపాలనా సేవలు అందుబాటులోకి రాకపోవడంపై మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలిమెల మండలం ఏర్పడినప్పటికీ పలు ప్రభుత్వ శాఖల సేవలు ఇప్పటికీ పాత మండల కేంద్రం మహాదేవపూర్ నుంచే అందుతున్నాయని ప్రజలు పేర్కొంటున్నారు.గతంలో పలిమెలలో కార్యాలయ భవనాలు, పోలీస్ స్టేషన్, నెట్‌వర్క్ వంటి సౌకర్యాలు లేవని, అందువల్ల అధికారులు అక్కడి నుంచి సేవలు అందించేందుకు ఇబ్బందులు ఉన్నాయని చెప్పిన సందర్భాలు ఉన్నాయని ప్రజలు గుర్తు చేస్తున్నారు. అయితే ప్రస్తుతం పలిమెల మండల కేంద్రంలో అవసరమైన సౌకర్యాలు అందుబాటులో ఉన్నప్పటికీ.. ఇప్పటికీ పరిపాలనా సేవలు మహాదేవపూర్ నుంచే ఎందుకు కొనసాగుతున్నాయో అర్థం కావడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు.ఏదైనా ప్రభుత్వ పనికి అధికారులను కలవాలన్నా, సమస్యపై దరఖాస్తు ఇవ్వాలన్నా మండలంలోని పలు గ్రామాల ప్రజలు సుమారు 30 కిలోమీటర్ల దూరంలోని మహాదేవపూర్‌కు వెళ్లాల్సి వస్తోందని వాపోతున్నారు. దీంతో ఒక పని కోసం రోజంతా సమయం, డబ్బు వృథా అవుతున్నాయని చెబుతున్నారు. అంతదూరం వెళ్లిన తర్వాత కూడా కొన్ని సందర్భాల్లో పని పూర్తికాక తిరిగి రావాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పేరుకే పలిమెల కొత్త మండలం.. పరిపాలన మాత్రం మహాదేవపూర్ నుంచే కొనసాగుతోందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఖఅధికారులు అక్కడ.. ప్రజలు ఇక్కడ అన్నట్లుగా పరిస్థితిలి మారిందని మండలంలోని పలు గ్రామాల ప్రజలు అంటున్నారు. పలిమెల నుంచే ప్రభుత్వ సేవలు అందించేందుకు



అవసరమైన సౌకర్యాలు ఉన్నాయని, ఇంకా ఏవైనా సమస్యలు ఉంటే వాటిని ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలని కోరుతున్నారు.తక్షణమే పలిమెల మండల కేంద్రం నుంచే అన్ని ప్రభుత్వ శాఖల పరిపాలనా సేవలు అందేలా జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. సమస్య పరిష్కారానికి అధికారులు స్పందించకపోతే శాంతియుతంగా ధర్నాలు చేపట్టి ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్తామని మండల ప్రజలు పేర్కొన్నారు.

## ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు

### రైతువేదికలో రైతులకు ఆయిల్ పామ్ సాగుపై శిక్షణ

**ప్రజా వాయిస్, కోరుట్ల:**

పంట మార్పిడిలో భాగంగా రైతులు ఆయిల్ పామ్ సాగు చేపట్టి అధిక ఆదాయం పొందవచ్చని మండల వ్యవసాయ అధికారి నాగమణి అన్నారు. బుధవారం కోరుట్ల మండలం పైడిమడుగు గ్రామంలోని రైతువేదిక నందు 'ఆత్మ' ఆధ్వర్యంలో రైతులకు ఆయిల్ పామ్ సాగు యాజమాన్య పద్ధతులపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో నాగమణి మాట్లాడుతూ.. మండలంలో ఇదివరకే ఆయిల్ పామ్ సాగు చేపట్టిన రైతుల తోటల్లో దిగుబడులు ప్రారంభమయ్యాయని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర ప్రకారమే గెలల కొనుగోలు జరుగుతోందని, విక్రయించిన వెంటనే సొమ్ము నేరుగా రైతుల ఖాతాల్లో



జమ అవుతోందని చెప్పారు. రైతులు సంప్రదాయ పంటల నుంచి ఆయిల్ పామ్ వైపు మళ్లాలని ఆకాంక్షించారు. అనంతరం ఉద్యాన విస్తరణ అధికారి అన్వేష్ మాట్లాడుతూ.. ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం భారీగా సబ్సిడీలు అందిస్తోందన్నారు. ఒక్కో మొక్క అసలు ఖరీదు 193 ఉండగా, రైతు వాటాగా కేవలం 20 చెల్లిస్తే సరిపోతుందన్నారు. దీంతో పాటు బిందు సేద్యం (డ్రిప్)



పరికరాలపై కూడా ప్రభుత్వం ప్రత్యేక సబ్సిడీలు ఇస్తోందని తెలిపారు. ఆసక్తి ఉన్న రైతులు వెంటనే తమ పరిధిలోని వ్యవసాయ విస్తరణ అధికారి లేదా ఉద్యాన విస్తరణ అధికారిని సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్, ఆత్మ బిఎఫ్ఏసి సభ్యులు, వ్యవసాయ విస్తరణ అధికారి అనిల్, ఆయిల్ పామ్ ఫీల్డ్ ఆఫీసర్ భరత్ మరియు పరిసర గ్రామాల రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరికి చేరేలా ప్రజాప్రతినిధులు కృషి చేయాలి :ఉమ్మడి జిల్లాల ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి

**ప్రజా వాయిస్ తెలకపల్లి సెప్టెంబర్ 16**

తెలకపల్లి మండలం లక్నారం గ్రామంలో బుధవారం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ దూల సువర్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ కూచకుల దామోదర్ రెడ్డి హాజరై లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ గ్రామంలోని అర్హులైన ప్రతి ఒక్కరికీ స్మార్ట్ రేషన్ కార్డులు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా సహకరిస్తామని పేర్కొన్నారు.అదేవిధంగా లక్నవరం నుంచి రాకొండ వరకు బీటీ రోడ్డు ఏర్పాటుకు అన్ని విధాలా సహకరిస్తానని ఎమ్మెల్సీ హామీ ఇచ్చారు. త్వరలోనే రోడ్డు పనులకు అవసరమైన ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. అలాగే గ్రామంలోని పాఠశాల కిచెన్ షెడ్ నిర్మాణానికి రూ.4 లక్షల నిధులు మంజూరైనట్లు వెల్లడించారు.

**శిథిలావస్థలో పాఠశాల భవనం**



స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం సందర్భంగా గ్రామ యువకులు లక్నవరం పాఠశాలకు నూతన భవనం మంజూరు చేయాలని కోరుతూ ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. గ్రామ యువకుడు దాసర్ల శరత్ ఆధ్వర్యంలో యువకులు ఈ వినతిపత్రాన్ని సమర్పించారు.పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో విద్యార్థులకు ప్రమాదకరంగా మారిందని, అదనపు తరగతి గదుల అవసరం ఉందని ఎమ్మెల్సీ దృష్టికి తీసుకెళ్లారు. విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని నూతన పాఠశాల భవనాన్ని మంజూరు చేయాలని కోరారు.వినతిపత్రం అందుకున్న అనంతరం ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి గ్రామంలోని పాఠశాలను సందర్శించి భవనం పరిస్థితిని పరిశీలించారు. ఉపాధ్యాయులను వివరాలు అడిగి తెలుసుకుని తరగతి గదులను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఒక తరగతి గదిలో పైకప్పు పెచ్చులు ఊడిపోయిన పరిస్థితిని గమనించారు.పాఠశాలలో నెలకొన్న పరిస్థితులపై స్పందించిన ఎమ్మెల్సీ విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. తన శాయశక్తులా కృషి చేసి పాఠశాలకు నూతన భవనం ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటానని ఉపాధ్యాయులు, గ్రామస్తులకు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారి విజయకుమార్ ఉప సర్పంచ్ వార్డ్ మెంబర్స్ మరియు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మండల నాయకులు, గ్రామ యువకులు, మహిళలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వినాయక నిమజ్జనంలో అపశ్రుతి

### చెరువులోకి దిగిన ఆరుగురు విద్యార్థుల మృతి

### మృతి చెందిన విద్యార్థులు శిరీష చారిటబుల్ ట్రస్టు వారిగా గుర్తించారు





**పటాన్ చెరువు ప్రజావాయిస్**

వినాయక నిమజ్జనంలో తీవ్ర అపశృతి చోటు చేసుకున్న సంఘటన పటాన్చెరువు మండలంలోని ఇంద్రేశం మున్సిపాలిటీ పరిధిలోని పెద్ద కంజర్ల గ్రామంలో జరిగింది స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పెద్ద కంజర్ల గ్రామంలోని వినాయక చవితి సందర్భంగా గ్రామంలో వినాయక నిమజ్జనం ఊరేగింపు కార్యక్రమంలో విగ్రహాన్ని స్థానిక నేరేడు చెరువులోకి నిమజ్జనానికి తీసుకు వెళ్తుండగా ప్రమాదవశాత్తు ఆరుగురు విద్యార్థులు నీట మునిగి మృతి చెందారు మృతులంతా శిరీష చారిటబుల్ ట్రస్ట్ విద్యార్థులుగా





గుర్తించారు, మృతులు నరసింహారాజు సుమంత్ ( డిప్లొమా సెకండ్ ఇయర్ ) గణేష్( డిప్లమో సెకండ్ ఇయర్ ) ఉదయ్ కిరణ్ ( డిప్లమా థర్డ్ ఇయర్ ) శ్యాం కుమార్ ( డిప్లమా ఫస్ట్ ఇయర్ ) సిద్ధార్థ్ పదవ తరగతి చదువుతున్నారు స్థానికుల ఫిర్యాదు మేరకు మృతదేహాలను స్థానిక పటాన్చెరువు ప్రాచీన గ్లోబల్ ఆసుపత్రికి తరలించారు విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆసుపత్రికి చేరుకొని మృతదేహాలకు నివాళులర్పించారు ఒకేసారి ఆరుగురు విద్యార్థులు మృతి చెందిన





ఘటన దురదృష్టకరమన్నారు ఒకేసారి ఆరుగురు విద్యార్థులు మృతి చెందడం పట్ల ఆయన తీవ్రంగా కలత చెందారు



అనంతరం బాధితులను పరామర్శించారు గురువారం ఉదయం 10 గంటల వరకు పోస్టుమార్టం కార్యక్రమాలను పూర్తి చేయాలని అనంతరం మృతి దేహాలను అస్వస్థలాలకు అంబులెన్స్లలో తరలించాలని సూచించారు అంబులెన్స్లను తన సొంత ఖర్చులతో అంబులెన్స్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు ఈ ఘటనతో పెద్ద కంచర్ల పరిసర గ్రామాలలో తీవ్ర విషాద ఛాయలు అమలుకున్నాయి మృతుల కుటుంబాలు బంధువులు మిత్రుల బోధనలతో ఆసుపత్రి వద్ద విషాద వాతావరణం నెలకొంది

# మెదక్ జిల్లా లేబర్ సెల్ కన్వీనర్‌గా నాయికోటి శ్యామయ్య



**ప్రజా వాయిస్ టేక్మాల్:**
మెదక్ జిల్లా లేబర్ సెల్ కన్వీనర్‌గా టేక్మాల్ మండలానికి చెందిన నాయికోటి శ్యామయ్య నియమితులైన సందర్భంగా టేక్మాల్ మండల బీజేపీ నాయకులు ఆయనను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. నూతన బాధ్యతలు చేపట్టిన శ్యామయ్యకు నాయకులు అభినందనలు తెలియజేస్తూ, పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని బీజేపీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా మండల బీజేపీ నాయకులు మాట్లాడుతూ, శ్యామయ్యకు లభించిన బాధ్యత పార్టీ పట్ల ఆయనకున్న నిబద్ధతకు గుర్తింపుగా భావిస్తున్నామని తెలిపారు. జిల్లా లేబర్ సెల్ కన్వీనర్‌గా కార్మికుల సమస్యలను తెలుసుకొని, వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్మిక వర్గానికి పార్టీ విధానాలను చేరువ చేయడంతో పాటు, వారి సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లేలా పనిచేయాలని సూచించారు. అలాగే టేక్మాల్ మండలంలో బీజేపీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని కోరారు. గ్రామస్థాయిలో పార్టీ కార్యక్రమాలను విస్తృతం చేసి ప్రజలకు అందుబాటులో ఉండాలని తెలిపారు. పార్టీ అభివృద్ధి కోసం కార్యకర్తల సహకారంతో సమష్టిగా పనిచేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. నాయికోటి శ్యామయ్యను సన్మానించిన కార్యక్రమంలో టేక్మాల్ మండల బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. నూతన బాధ్యతల్లో శ్యామయ్య విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యులు సిద్ధిరాములు, కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యులు ఎల్లుపేట రాజు, వడ్డె రాములు, గిరిజన మోర్చా ఉపాధ్యక్షులు మోహన్, బీజేవైఎం మాజీ కార్యదర్శి మదన్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి సేనాపతి, ఉపాధ్యక్షులు నాగరాజు, వినోద్, బూత్ అధ్యక్షులు నాగరాజు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# నల్లగొండ పట్టణంలోని సున్నిత ప్రాంతాల్లో గణేష్‌మండపాలను పరిశీలించిన జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్..

**ప్రజా వాయిస్ /నల్గొండ క్రైమ్:**
గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నల్లగొండ పట్టణంలోని కమ్యూనల్‌గా సున్నితమైన, మిశ్రమ జనాభా ఉన్న ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణేష్ మండపాలను జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. మండపాల నిర్వాహకులతో మాట్లాడి ఉత్సవాల నిర్వహణకు సంబంధించి పలు సూచనలు చేశారు. గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో, సోదరభావంతో నిర్వహించాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వాహకులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ సూచించారు. మండపాల వద్ద 24 గంటల పాటు వాలంటీర్లను అందుబాటులో ఉంచాలని, నిర్వాహకులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. మండపాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి నిరంతరం పనిచేసేలా చూడాలని, మండపం పరిసరాలు, ప్రవేశ--నిష్క్రమణ మార్గాలు స్పష్టంగా కనిపించే విధంగా కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రతి గణేష్ మండపాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో పాటు జియో ట్యాగింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని నిర్వాహకులకు సూచించారు. అగ్ని ప్రమాదాల నివారణకు ఫైర్ సేఫ్టీ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, విద్యుత్ వైర్లు, స్విచ్ బోర్డులు, జనరేటర్లు తదితరాలను సురక్షితంగా ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. మండపాల వద్ద అవసరమైన అగ్నిమాపక పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. మైనర్ విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు గైర్హాజరై గణేష్ మండపాల వద్ద ఉండకుండా మండపాల నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా ఎస్పీ సూచించారు. గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ప్రశాంతంగా నిర్వహించడంతో పాటు విద్యార్థుల చదువులకు ఎలాంటి ఆటంకం కలగకుండా నిర్వాహకులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. పాఠశాలలు, కళాశాలలకు గైర్హాజరై గణేష్ మండపాల వద్ద కనిపించే విద్యార్థులకు వారి తల్లిదండ్రులు, మండపాల నిర్వాహకుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించి, విద్య యొక్క ప్రాముఖ్యతను వివరించనున్నట్లు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తల్లిదండ్రులు తమ పిల్లలు పాఠశాలలు, కళాశాలలకు క్రమం తప్పకుండా హాజరయ్యేలా, చదువులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా ఎస్పీ కోరారు. మండపాల వద్ద ఏర్పాటు చేసిన సౌండ్ సిస్టమ్‌ను నిబంధనల ప్రకారం మాత్రమే వినియోగించాలని, నిర్ణీత సమయం అనంతరం శబ్ద కాలుష్యాన్ని పూర్తిగా నిలిపివేయాలని ఎస్పీ తెలిపారు. ఇతర మతాల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఎలాంటి పాటలు, నినాదాలు లేదా కార్యక్రమాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. మండపాలకు వచ్చే భక్తులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా వాహనాల పార్కింగ్‌కు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. మండపాల వద్ద అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపించినా, ఏదైనా సమస్య లేదా అవాంఛనీయ పరిస్థితి తలెత్తినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్పీ సూచించారు. సోషల్ మీడియాలో వచ్చే వదంతులు, తప్పుడు ప్రచారాలను నమ్మకుండా, వాటిని ఫార్వర్డ్ చేయకుండా పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. సున్నిత ప్రాంతాల్లో పోలీసుల నిరంతర నిఘా, పెట్రోలింగ్, బందోబస్తు చర్యలు కొనసాగుతున్నాయని ఎస్పీ తెలిపారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు జిల్లా పోలీస్ శాఖ నిరంతరం అప్రమత్తంగా ఉంటుందని పేర్కొన్నారు. గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా, సోదరభావంతో, అన్ని వర్గాల ప్రజల మనోభావాలను గౌరవిస్తూ నిర్వహించేందుకు గణేష్ మండపాల నిర్వాహకులు, ప్రజలు పోలీస్ శాఖకు పూర్తిగా సహకరించాలని జిల్లా ఎస్పీ కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ వెంట నల్లగొండ డీఎస్పీ కే. శివరాం రెడ్డి, ఎస్బీ సీఐ నాగరాజు, నల్లగొండ 1 టౌన్ సీఐ రాజశేఖర్ రెడ్డి, ఇతర పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# అభివృద్ధి పనుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు

### అధికారులపై ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ఆగ్రహం

**ప్రజా వాయిస్ దుబ్బాక /చేగుంట**
అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి తీవ్రస్థాయిలో హెచ్చరించారు. చేగుంట మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై వివిధ శాఖల పనితీరుపై సమగ్ర సమీక్ష జరిపారు. మూడు నెలలకోసారి జరిగే ఈ కీలక సమావేశానికి పలువురు శాఖల అధికారులు గైర్హాజరు కావడంపై ఎమ్మెల్యే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలు ప్రజలకు పూర్తిస్థాయిలో అందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని, విధుల్లో బాధ్యతారాహిత్యాన్ని ఎంతమాత్రం ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. పాఠశాలల్లో నాణ్యమైన విద్యనందిస్తూ విద్యార్థుల నమోదును పెంచాలని విద్యాశాఖ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. మండలానికి మంజూరైన 104 గృహాలలో మిగిలివున్న 54 ఇళ్ల నిర్మాణాలను నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పంచాయతీరాజ్ పరిధిలోని సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులను త్వరగా పూర్తి చేయాలని, వర్షాకాలం దృష్ట్యా ప్రమాదకర విద్యుత్ స్తంభాలు, వేలాడుతున్న తీగలను వెంటనే సరిచేయాలని సూచించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యాన్ని ముమ్మరం చేస్తూ డెంగ్యూ, మలేరియా వ్యాధులు ప్రబలకుండా దోమల నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ఏవైనా సమస్యలు ఎదురైతే సర్పంచ్‌లు, ఇతర స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో పరిష్కరించుకోవాలని స్పష్టం చేశారు. మారుతున్న కాలానికి అనుగుణంగా గ్రామీణ యువత, రైతాంగం ఆధునిక ఉపాధి మార్గాల వైపు దృష్టి సారించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. క్లౌడ్ కిచెన్లు, పాడి పరిశ్రమ, బయోగ్యాస్, ఇథనాల్ ఉత్పత్తుల ద్వారా ఆర్థికంగా ఎదగడానికి పుష్కల అవకాశాలు ఉన్నాయని వివరించారు. భవిష్యత్తులో మొక్కజొన్న వ్యర్థాలతో బయో-ప్లాస్టిక్, పేపరు, ప్లేట్ల తయారీ పరిశ్రమలు పెరిగే అవకాశం ఉన్నందున రైతులు ఆధునిక విధానాలను అవలంబించాలని సూచించారు. ప్రకృతి వనరులను సద్వినియోగం చేసుకుంటూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి హేమ భార్గవి, ఎస్సై చైతన్యకుమార్, మండల స్థాయి అధికారులు, పలు గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



# యూపీఐపై కొత్త రుసుము.. తిరిగి నగదు వైపు అడుగులేనా?

యూపీఐ ద్వారా జరిగే కొన్ని వ్యాపార లావాదేవీలపై కొత్తగా మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) విధించడం పట్ల రిటైలర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఆర్ఏఐ) తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నిర్ణయం దేశాన్ని మళ్లీ నగదు ఆధారిత ఆర్థిక వ్యవస్థ వైపు మళ్లించే ప్రమాదం ఉందని హెచ్చరించింది. 2026 అక్టోబర్ 15వ తేదీ నుంచి అమల్లోకి రానున్న ఈ నూతన నిబంధనల ప్రకారం, రూ. 2,000 దాటిన వ్యాపార చెల్లింపులపై ఈ రుసుము వర్తిస్తుంది. కొత్త నిబంధనల మేరకు, వినియోగదారుల నుంచి వ్యాపారులకు జరిగే రూ. 2,000 పైబడిన చెల్లింపులపై 0.4 శాతం ఎండీఆర్ విధిస్తారు. రైల్వే, టెలికాం, ఇన్సూరెన్స్, ఇంధనం వంటి రంగాలకు ఫ్లాట్‌గా రూ. 5 రుసుము ఉంటుంది. అయితే, యూపీఐ క్యూఆర్ కోడ్‌ల ద్వారా నెలకు రూ. 1 లక్ష లోపు లావాదేవీలు నిర్వహించే చిన్న వ్యాపారులకు ఈ ఛార్జీల నుంచి మినహాయింపు కల్పించారు. ఈ మార్పు కేవలం 4 శాతం లావాదేవీలపై మాత్రమే ప్రభావం చూపుతుందని, మిగిలిన 96 శాతం వ్యాపార లావాదేవీలు ఉచితంగానే కొనసాగుతాయని ఆర్థిక మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఈ నిర్ణయంపై రిటైలర్ల సంఘాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. "తక్కువ లాభాలతో పనిచేసే చిన్న వ్యాపారులు ఇకపై యూపీఐ కంటే నగదు లావాదేవీలకే ప్రాధాన్యత ఇచ్చే అవకాశం ఉంది" అని ఆర్ఏఐ సీఈఓ కుమార్ రాజగోపాలన్ పేర్కొన్నారు. దీపావళి పండుగ సీజన్‌కు ముందు ఇలాంటి నిర్ణయం తీసుకోవడం సరైంది కాదని, ఇది వ్యాపారాలపై మరింత భారం మోపుతుందని క్లాతింగ్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు సంతోష్ కటారియా తెలిపారు. గతంలో నగదు రహిత లావాదేవీలను ప్రోత్సహించిన వ్యాపారులే, ఇప్పుడు తిరిగి నగదును ప్రోత్సహించే పరిస్థితి నెలకొంటుందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఛార్జీలు ప్రభుత్వ పన్ను కాదని, యూపీఐ వ్యవస్థను నిర్వహించే బ్యాంకులకు, పేమెంట్ యాప్ సంస్థలకు వెళ్లే రుసుము అని ప్రభుత్వ వర్గాలు వివరించాయి. ఈ నిర్ణయాన్ని ఐదేళ్ల క్రితమే ప్రతిపాదించామని, దీనిని వెనక్కి తీసుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశాయి. వినియోగదారులపై ఎలాంటి భారం పడదని ప్రభుత్వం పునరుద్ఘాటించింది. వెరసి, ఈ మార్పుల ప్రభావం వ్యాపారులపైనే ఉంటుంది తప్ప, సాధారణ వినియోగదారులకు ఎలాంటి ఇబ్బంది ఉండదు.



# ఉద్యోగ జీవితానికి గుర్తుగా వాటర్ డిస్పెన్సర్ వితరణ

### విరమణ అనంతరం అభిమానం చాటిన వెన్న ఉదయ సేత్

**జూలూరుపాడు, ప్రజా వాయిస్:**
మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రికార్డు అసిస్టెంట్‌గా విధులు నిర్వహించి, గత నెల 31న ఉద్యోగ విరమణ పొందిన వెన్న ఉదయ సేత్ తన ఉద్యోగ జీవితానికి గుర్తుగా పాఠశాల సిబ్బందికి ఉపయోగపడే విధంగా 16 వేల రూపాయల విలువైన వోల్టాస్ వాటర్ డిస్పెన్సర్, మినీ ఫ్రిజ్ ను మంగళవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి లక్ష్మీనరసయ్య కి అందజేశారు. ఈ సందర్భంగా వెన్న ఉదయ సేత్ మాట్లాడుతూ తాను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహించిన కాలంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది తనను ఎంతో ఆప్యాయంగా, అభిమానంతో, గౌరవంగా చూసుకున్నారని తెలిపారు. పాఠశాలతో తనకు ఏర్పడిన ఆత్మీయ అనుబంధానికి గుర్తుగా ఈ వాటర్ డిస్పెన్సర్ ను అందజేస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగ విరమణ అనంతరం కూడా పాఠశాల పట్ల తనకున్న అభిమానం, ఆత్మీయతను చాటుతూ సిబ్బంది ఉపయోగార్థం విలువైన వాటర్ డిస్పెన్సర్ ను అందజేయడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి లక్ష్మీనరసయ్య, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది వెన్న ఉదయ సేత్ ని అభినందిస్తూ, హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన సేవలను, పాఠశాల పట్ల చూపిన అభిమానాన్ని పాఠశాల సిబ్బంది కొనియాడారు.




# వనపర్తి డిపో ముందు ఘనంగా స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ 47వ ఆవిర్భవ దినోత్సవ వేడుకలు

### వనపర్తి డిపో ముందు అధ్యక్షులు ఏ జీ కృష్ణ జెండా ఆవిష్కరణ

**ప్రజా వాయిస్.. వనపర్తి**
రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా ఈ డి లకమిటీతో జరిగిన చర్చలు సందర్భంగా అంగీకరించిన అంశాలను అమలు చేయాలని ఎస్ డబ్ల్యూ ఎఫ్ సి ఐ టి యు ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు వీరాంజనేయులు హాజరయ్యారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులపై పెంచిన పని భారాన్ని తగ్గించాలి రూట్ సర్వే చేసి టైమింగ్ కేటాయించాలి అలవెన్సులు 80% పెంచి తక్షణమే అమలు చేయాలి. బ్రెడ్ విన్నర్ స్కీమ్ లో అపాయింట్మెంట్ అయినా ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలి అని ఆయన అన్నారు. రిటైర్మెంట్ ఉద్యోగుల బకాయిలు వెంటనే చెల్లించి జూనియర్ అసిస్టెంట్ టెస్ట్ పాస్ అయిన వారందరికీ పోస్టింగ్ ఇవ్వాలి ఉద్యోగ భద్రత పై కమిటీని వెంటనే ఏర్పాటు చేసి వెంటనే విలినా కమిటీ ఏర్పాటు చేయాలి అని డిమాండ్ చేశారు. అనంతరం డిపో మేనేజర్ కు వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర అధ్యక్షుడు వీరాంజనేయులుకార్మికులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించి కార్మికుల యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు ఈ కార్యక్రమంలో రీజియన్ అధ్యక్ష కార్యదర్శులు ఏ కృష్ణయ్య ఎస్ వెంకటయ్య రీజియన్ సహాయ కార్యదర్శి ఎండి ఖయ్యూం డిపో అధ్యక్ష కార్యదర్శులు కేజీ కృష్ణ సి నాగేశ్వర్ ఉపాధ్యక్షుడు నారాయణ తదితరులు కార్మికులు పాల్గొన్నారు.

# కొత్తకోట మున్సిపల్ కాంప్లెక్స్‌లో పోలీసు షాప్ నెం.6కు ఓపెన్ టెండర్

### జిల్లా ఎస్పీసునిత రెడ్డి
### ఈ నెల 28న బహిరంగ టెండర్ నిర్వహణ
### షాప్‌ను అద్దెకు తీసుకునేందుకు ఆసక్తిగల వ్యాపారులకు అవకాశం



**ప్రజా వాయిస్.. వనపర్తి**
వనపర్తి జిల్లాకొత్తకోట మండల కేంద్రంలోని గాంధీ చౌరస్తా ఎక్స్‌రోడ్డులోని మున్సిపల్ కాంప్లెక్స్ భవనంలోని పోలీసుశాఖకు సంబంధించిన షాప్ నంబర్--6ను అద్దెకు కేటాయించేందుకు ఈ నెల 28-09-2026 సోమవారం రోజు వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయంలోని ఏఆర్ హెడ్ క్వార్టర్ లో ఉదయం 11 గంటలకు ఓపెన్ టెండర్ నిర్వహించనున్నట్లు వనపర్తి జిల్లా ఎస్పీ సునిత రెడ్డి, ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వ్యాపారులు ఓపెన్ టెండర్‌లో పాల్గొని షాప్‌ను అద్దెకు పొందేందుకు అవకాశం ఉందని ఎస్పీ పేర్కొన్నారు. టెండర్‌కు సంబంధించిన నిబంధనలు, రిజర్వ్ ధర తదితర పూర్తి వివరాల కోసం రిజర్వ్ ఇన్‌స్పెక్టర్, (RI-MTO) వనపర్తి శ్రీనివాస్ ని సంప్రదించాలని సూచించారు.

సంప్రదించవలసిన అధికారి:
శ్రీనివాస్,రిజర్వ్ ఇన్స్పెక్టర్
(RI-MTO), వనపర్తి
ఫోన్: 8712670604 ను
సంప్రదించాలని ఎస్పీ సునీత రెడ్డి తెలిపారు.



# బాధిత కుటుంబానికి చాడ గౌడ సంఘం అండ

### రూ.15 వేల ఆర్థిక సాయం అందజేత

**మోటకొండూరు/ప్రజా వాయిస్ :-**
అనారోగ్యంతో ఇటీవల మృతి చెందిన ధూపతి శేఖర్ గౌడ్ కుటుంబానికి చాడ గౌడ సంఘం అండగా నిలిచింది. బుధవారం బాధిత కుటుంబ సభ్యులను సంఘం ప్రతినిధులు పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం సంఘం తరపున మృతుని కుటుంబానికి రూ.15 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు ఇరగని శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న ప్రతి గౌడ కుటుంబానికి సంఘం తరపున తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు. సభ్యులంతా ఐక్యంగా ఉండి ఒకరికొకరు తోడుగా నిలవాలని కోరారు. విరాళాలు సేకరించడంలో సహకరించిన సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ భూమయ్య గౌడ్, నాయకులు మల్లం బిక్షపతి గౌడ్, కూరెల్ల మురళి గౌడ్, సీసా రాములు గౌడ్, సూదగాని నరసింహ గౌడ్, కంకటి నరేష్ గౌడ్, శవ్వ సత్యనారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం



**ప్రజావాయస్ వేములపల్లి**
గుర్తుతెలియని మహిళ మృతదేహాన్ని నల్గొండ జిల్లా వేములపల్లి మండలం అన్నపురెడ్డిగూడెం గ్రామ శివారులోని సాగర్ ఎడమ కాలువలో గుర్తించినట్లు వేములపల్లి ఎస్సై డి వెంకటేశ్వర్లు తెలిపారు ఆయన తెలిపిన వివరాల ప్రకారం సుమారు 35 నుంచి 40 సంవత్సరాల మధ్య వయసుగల మహిళ మృతదేహం కాలువలో కొట్టుకొని వస్తుండగా గమనించిన స్థానికులు సమాచారం అందించగా అక్కడికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకొనీ మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించి మార్చురీలో భద్రపరిచామన్నారు సదరు మహిళ బూడిద రంగు టాప్, బ్రౌన్ రంగు ప్యాంటు, ధరించి సుమారు 5 అడుగుల ఎత్తు ఉన్నట్లు ఆయన తెలిపారు ఎవరైనా గుర్తించినట్లయితే వేములపల్లి పోలీస్ స్టేషన్లో సంప్రదించాలని ఇతర వివరాలకు ఫోన్ నెంబర్లు 8712670190,8712670808 , సంప్రదించాలన్నారు




# డివిజన్ పిఆర్టీయు సర్వ సభ్య సమావేశం

### ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కేవలం పీఆర్టీయుకే సాధ్యం..

### జహీరాబాద్ డివిజన్ పిఆర్టియు సర్వసభ సమావేశం ఏర్పాటు చేసిన వైనం..

**ప్రజా వాయిస్ జహీరాబాద్:** డివిజన్ పరిధిలోని ఆరు మండలాల సర్వ సభ్య సమావేశం బుధవారం నాడు జహీరాబాద్ లోని శుభం ఫంక్షన్ హాల్లో పిఆర్టియు జిల్లా అధ్యక్షుడు తులసీరాం అధ్యక్షతన సుమారు 500 మంది ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించడం జరిగింది ఈ సర్వ సభ సమావేశంలో బెస్ట్ టీచర్స్ అవార్డు గ్రహీతలు మొత్తం 35 మహిళా టీచర్లకు ఘనంగా సన్మానం చేసి జ్ఞాపికను కూడా అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన పీఆర్టీయు టీఎస్ నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల సాధన కేవలం పీఆర్టీయు ఉపాధ్యాయ సంఘానికే సాధ్యం అయ్యిందని, ఇంకా పెండింగ్ లో ఉన్న సమస్యల సాధన కోరకు ప్రణాళికలతో ముందుకు వెళుతున్నామని అన్నారు. అంతేకాకుండా 51 శాతం ఫిట్మెంట్ తో దసరా కానుకగా పీఆర్సీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. అలాగే పెండింగ్లో ఉన్న ఆరు డీఎలను తక్షణమే మంజూరు చేయాలని సిపిఎస్ ను రద్దు చేసి ఓపియస్ ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ బకాయిలు, పదవి విరమణ పొందిన వారి బకాయిలను ఏకకాలంలో చెల్లించాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా కాంగ్రెస్ పార్టీ జహీరాబాద్ పట్టణ అధ్యక్షుడు నరేష్ గౌడ్ జహీరాబాద్ డివిజన్ లో విధులు నిర్వహిస్తున్న 35 మంది ఉత్తమ టీచర్లకు సన్మానం చేసే భాగ్యం కల్పించినందుకు నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ పిఆర్టీయు నాయకులు, టీచర్స్ తదితరులు పాల్గొన్నారు..

# రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే మా లక్ష్యం

### రాహుల్ గాంధీ నాయకత్వంలో దేశానికి నూతన దిశ: నీలం మధు

### దేశ ఐక్యత కోసం కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు సుదీర్ఘ పాదయాత్ర చేపట్టడం అభినందనీయం

### 1,500 కిలోమీటర్లకు పైగా పాదయాత్ర పూర్తి చేసిన కాటూరి వెంకటేశ్వర్లుకు పటాన్‌చేరులో ఘన స్వాగతం..





**పటాన్ చెరువు ప్రజావాయిస్**
భారతదేశం కోసం ఎన్నో త్యాగాలు చేసి ప్రజా సమస్యలపై నిరంతరం పాటుపడుతున్న గాంధీ కుటుంబం వారసుడు రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే లక్ష్యంగా పాదయాత్ర చేపట్టడం గొప్ప విషయమని ప్రతి కార్యకర్త రాహుల్ ను ప్రధాని చేసేందుకు కృషి చేయాలని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి నీలం మధు అన్నారు. దేశ ఐక్యత, సామాజిక న్యాయం, సమ్మిళిత అభివృద్ధి లక్ష్యంగా కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు కొనసాగుతున్న జాతీయ పాదయాత్ర బుధవారం పటాన్‌చేరు నియోజకవర్గానికి చేరుకుంది. ప్రకాశం జిల్లాకు చెందిన న్యాయవాది, సామాజిక కార్యకర్త కాటూరి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఈ పాదయాత్రకు మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి నీలం మధు ముదిరాజ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ముత్తంగి పుట్టి రింగ్ రోడ్ వద్ద ఘన స్వాగతం పలికారు అక్కడి నుంచి ముత్తంగి డివిజన్ పరిధిలోని పీఎస్ఆర్ గార్డెన్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కాటూరి వెంకటేశ్వర్లును శాలువాతో సత్కరించి అభినందించారు. కాటూరి వెంకటేశ్వర్లు గత జూన్ 19న కన్యాకుమారి నుంచి తన పాదయాత్రను ప్రారంభించారు. తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల మీదుగా ఇప్పటివరకు 1,500 కిలోమీటర్లకు పైగా కాలినడకన ప్రయాణించి తెలంగాణలోని పటాన్‌చేరు నియోజకవర్గానికి చేరుకున్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో ప్రజలను కలుసుకుంటూ వారి సమస్యలు, అభిప్రాయాలు, ఆకాంక్షలను తెలుసుకుంటూ యాత్రను కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా నీలం మధు ముదిరాజ్ మాట్లాడుతూ దేశ భవిష్యత్తుకు ప్రజల ఆకాంక్షలకు అనుగుణమైన నాయకత్వం అవసరమని అన్నారు. ప్రజల మధ్యకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకోవడం, అన్ని వర్గాలను కలుపుకొని ముందుకు సాగడం ప్రజాస్వామ్యానికి ఎంతో ముఖ్యమని అన్నారు. దేశంలో యువతకు ఉపాధి అవకాశాలు, రైతులకు భరోసా, మహిళలకు సమాన అవకాశాలు, పేదలకు సామాజిక భద్రత, ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు కల్పించాలనే ఆలోచనలతో ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. దేశ ఐక్యత, సోదరభావం, సామాజిక న్యాయం కోసం ప్రజలను చైతన్యపరిచే కార్యక్రమాలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు వేల కిలోమీటర్లు కాలినడకన ప్రయాణించడం సాధారణ విషయం కాదని, ప్రజల సమస్యలను తెలుసుకోవాలనే సంకల్పంతో ఇంత సుదీర్ఘ ప్రయాణాన్ని చేపట్టిన కాటూరి వెంకటేశ్వర్లును అభినందిస్తున్నామన్నారు. ఎండ, వర్షం, అనేక ఇబ్బందులను ఎదుర్కొంటూ పాదయాత్రను కొనసాగించడం గొప్ప విషయమని కొనియాడారు. దేశంలోని అన్ని ప్రాంతాలు, అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా ముందుకు సాగినప్పుడే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో జిల్లా ×చీఖజ జిల్లా అధ్యక్షులు కొల్కురి నర్సింహారెడ్డి, కౌన్సిలర్స్ గోపాల్ రెడ్డి, దస్తగిరి, మన్నే రాఘవేంద్ర, సంపత్ రెడ్డి, నారాయణదాసు, మణికంఠ, సందీప్ గౌడ్, మాజీ సర్పంచులు రాజి రెడ్డి, సుంకరి రవీందర్, జగన్, సీనియర్ నాయకులు ముత్తంగి అశోక్, మధు పంతులు, గడ్డ యాదయ్య, షాపురం నరసింహారెడ్డి, రుద్రారం లక్ష్మారెడ్డి , దండోరా నర్సింహ, గోపాలకృష్ణ, లక్దారం లక్ష్మ రెడ్డి, సంజీవ, సందీప్ యాదవ్, మైలారం శ్రీను, పాండు, శంకర్, ప్రకాష్ రాథోడ్, ప్రవీణ్, రంజిత్, రాజ్ గోపాల్,కాంగ్రెస్ శ్రేణులు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..

# ఎస్ జి ఎఫ్ జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలకు ఆకునూరు విద్యార్థులు

**ప్రజా వాయిస్ సైదాపూర్ :-**
మండలంలోని ఆకునూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఈనెల 7 నుండి 9 వరకు జరిగిన మండల స్థాయి వాలీబాల్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఈనెల 16 నుండి 19 వరకు జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో జరిగే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు బొట్ల రామస్వామి తెలిపారు జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులను బుధవారం ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు రామస్వామి మాట్లాడుతూ వాలీబాల్ సీనియర్ బాలికల విభాగంలో ఏడుగురు జూనియర్ విభాగంలో నలుగురు వాలీబాల్ సీనియర్ బాలుర విభాగంలో ముగ్గురు జూనియర్ విభాగంలో ముగ్గురు మొత్తం 17 మంది విద్యార్థులు జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారని అన్నారు. అలాగే ఖో ఖో నలుగురు విద్యార్థులు ఎంపికయ్యా రని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు బొట్ల రామస్వామి పిడి నిర్మల ఉపాధ్యాయులు హన్మండ్ల భాస్కర్ సమ్మయ్య సుధాకర్ హరియా నాయక్ చిరంజీవి అనిత తదితరులు పాల్గొన్నారు. వాలీబాల్ బాలికల సీనియర్ విభాగంలో ఎర్రల రక్షిత నెల్లి ప్రణతి నెల్లి శ్వేత కాటిక సిరి బొడిగే రక్షిత గుర్రం అర్చన రాయిశెట్టి అవంతి లు జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. వాలీబాల్ బాలికల జూనియర్ విభాగంలో శిరవేణి సంకీర్తన మ్యాదరి హాసిని ఎండి అప్సాన బత్తుల కృపారాణి ఎంపికయ్యారు. వాలీబాల్ సీనియర్ బాలుర విభాగంలో పెండోట సూర్యతేజ సోతుకు సాయి ఆశిష్ గుర్రం ప్రణీత్ జూనియర్ విభాగంలో జేల్లా శివ బొజ్జ నిశాంత్ పెండొట వరుణ్ తేజా లు ఎంపికయ్యారు. ఖో ఖో లో నెల్లి అను బత్తుల అనుశ్రీ గొట్టే నిత్య గుర్రం ఆరాధ్య లు ఎన్నికయ్యారు.



# ఇంధన భవిష్యత్తుపై విద్యార్థుల శాస్త్రీయ విశ్లేషణ



## జిల్లా స్థాయి సైన్స్ సెమినార్

**ప్రజా వాయిస్ కగజ్ నగర్**
కాగజ్‌నగర్‌లోని డివిజనల్ సైన్స్ సెంటర్లో బుధవారం జిల్లా స్థాయి సైన్స్ సెమినార్‌ను జిల్లా సైన్స్ అధికారి కటుకం మధూకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, పరిశోధనా ఆలోచనా విధానం పెంపొందించడం, సమకాలీన సమస్యలపై అవగాహన కల్పించడం ఈ సెమినార్ లక్ష్యం. మండల విద్యాశాఖ అధికారి వాసాల ప్రభాకర్ ముఖ్య అతిథిగా, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రమీల విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమాన్ని దుర్గాప్రసాద్ నిర్వహించారు. ఇండియన్ ఎనర్జీ బాస్కెట్ 2047 - అవకాశాలు మరియు సవాళ్లు అంశంపై విద్యార్థులు పరిశోధనాత్మక ఆలోచనలు వెల్లడించారు. భవిష్యత్ ఇంధన అవసరాలు, సౌర, పవన, జల, అణు ఇంధనం, బయో ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్, ఎలక్ట్రిక్ వాహనాలు, ఇంధన నిల్వ వ్యవస్థలపై విశ్లేషణాత్మకంగా ప్రసంగించారు. 2047 నాటికి దేశం అభివృద్ధి చెందాలంటే ఇంధన భద్రత, పర్యావరణ పరిరక్షణ, ఇంధన పొదుపు, పునరుత్పాదక ఇంధన వినియోగం, సాంకేతిక అభివృద్ధి అవసరమని వక్తలు పేర్కొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతి కాగజ్‌నగర్ కస్తూరిబా గాంధీ విద్యాలయం 10వ తరగతి విద్యార్థిని గిరిజ దివ్యశ్రీకి, ద్వితీయ బహుమతి కాగజ్‌నగర్ సెయింట్ క్లారెట్ హై స్కూల్ విద్యార్థి కృష్ణ భాంగ్‌కు లభించాయి. తృతీయ బహుమతిని ఆసిఫాబాద్ జెడ్ పి హెచ్ ఎస్ బాలికల పాఠశాల విద్యార్థిని నాబా హూరియా, శ్రీ విశ్వశాంతి హై స్కూల్ విద్యార్థిని సఫా ఫాతిమా పంచుకున్నారు. సైన్స్ సెమినార్లు విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించి, సమాజ సమస్యలకు శాస్త్రీయ పరిష్కారాలు అన్వేషించేలా ప్రోత్సహిస్తాయని జిల్లా సైన్స్ అధికారి కటుకం మధూకర్ పేర్కొన్నారు.



# 17న ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో సభ

### రైతాంగ పోరాట స్ఫూర్తి హక్కుల ఉద్యమాలకు బాట

### శంషాబాద్‌లో సీపీఐ ఆధ్వర్యంలో అమరవీరుల సంస్మరణ

### ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకమన్న నేతలు

**ప్రజా వాయిస్/శంషాబాద్:**
తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో అమరులైన వారి త్యాగాలను స్మరించుకుంటూ శంషాబాద్‌లో సీపీఐ ఆధ్వర్యంలో సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. అంబేద్కర్ చౌరస్తాలో జరిగిన ఈ కార్యక్రమంలో అమరవీరులకు నివాళులు అర్పించి,పార్టీ జెండాను ఆవిష్కరించారు.సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రాచమల్ల యాదగిరి, మండల కార్యదర్శి నర్ర గిరి మాట్లాడుతూ..భూస్వామ్య,పెత్తందారీ దౌర్జన్యాలకు వ్యతిరేకంగా సాగిన రైతాంగ పోరాటం ప్రజా ఉద్యమాల చరిత్రలో కీలక ఘట్టమన్నారు.రైతులు, పేదలు,అణగారిన వర్గాల హక్కుల కోసం జరిగిన పోరాటాలను నేటి తరానికి పరిచయం చేయాల్సిన అవసరం ఉందన్నారు. చాకలి ఐలమ్మ పోరాటాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించిన నాయకులు,మహిళలు ఆమె స్ఫూర్తితో సామాజిక న్యాయం,ప్రజాస్వామ్య హక్కులు,మహిళల రక్షణ కోసం ముందుకు రావాలని పిలుపునిచ్చారు.రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల ముగింపులో భాగంగా గురువారం హైదరాబాద్ ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఉదయం 11 గంటలకు బహిరంగ సభ నిర్వహించనున్నట్లు సీపీఐ నాయకులు తెలిపారు. సభకు పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.కార్యక్రమంలో సీపీఐ నాయకులు గిలక రాజు, శ్రీనివాస్,దండి రవికుమార్, నరేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



# ఎల్కతుర్తి తహసీల్దార్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ రవి అకాస్మిక తనిఖీ

**ప్రజా వాయిస్ ఎల్కతుర్తి**

హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు అదనపు కలెక్టర్ రవి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని వివిధ విభాగాలను పరిశీలించి అక్కడ నిర్వహిస్తున్న ఫైళ్లను తనిఖీ చేశారు. పెండింగ్లో ఉన్న ఫైలు కార్యాలయ నిర్వహణ ప్రజలకు అందుతున్న సేవలపై అదనపు కలెక్టర్ రవి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రికార్డులు దస్తావేజులు పరిశీలిస్తూ సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు సకాలంలో అందేలా అధికారులు బాధ్యతగా పనిచేయాలని అదనపు కలెక్టర్ సూచించినట్లు సమాచారం విధి నిర్వహణలో తహసీల్దార్ ప్రసాద్ రావు, డిప్యూటీ తహసిల్దార్ రమేష్, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.



# ఆపదలో అండగా నిలిచిన అప్పాయిపల్లి యువత

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

**ప్రజా వాయిస్ దౌల్తాబాద్:**

అనారోగ్యంతో అకాల మరణం చెందిన ఒక పేద కుటుంబానికి గ్రామానికి చెందిన యువత అండగా నిలిచి తమ ఉదారతను చాటుకున్నారు. దౌల్తాబాద్ మండలం అప్పాయిపల్లి గ్రామానికి చెందిన డాకి కీర్తన ఇటీవల తీవ్ర అనారోగ్యంతో మృతి చెందగా, ఈ విషయం తెలుసుకున్న గ్రామ యువకులు బాధితురాలి నివాసానికి వెళ్ళి వారి కుటుంబాన్ని పరామర్శించారు. కీర్తన మృతి ఆ కుటుంబానికి తీరని లోటని విచారం వ్యక్తం చేస్తూ, ఈ కష్టసమయంలో తమవంతు బాధ్యతగా రూ.10,000 ఆర్థిక సహాయాన్ని మృతురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు. కష్టాల్లో ఉన్నవారిని ఆదుకోవడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావలసిన అవసరం ఉందని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. మానవత్వంతో స్పందించి ఆర్థిక సాయం అందించిన యువతను గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నర్సింలు, మాజీ ఉప సర్పంచ్ కేశబోయిన ప్రభాకర్, వార్డు సభ్యుడు బానుతో పాటు స్వామి, రమేష్, సాయిలు, మల్లేష్, అనిల్, సాయి తదితరులు పాల్గొన్నారు.

# దుబ్బాకలో ఘనంగా కొనసాగుతున్న నవరాత్రి ఉత్సవాలు

## భక్తులకు అన్నదానం

## చిన్నారులతో అట పాటలు సాంస్కృతిక కార్యక్రమాలు

**ప్రజా వాయిస్ దుబ్బాక**

దుబ్బాక పట్టణంలో కత్తి కార్తిక ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ సిద్ధి వినాయక స్వామివారి నవరాత్రి ఉత్సవాలు మూడో రోజు భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. ఈ సందర్భంగా కత్తి కార్తిక గౌడ్ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.వినాయకుడిని దర్శించుకునేందుకు తరలివచ్చిన భక్తులకు నిత్య అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కత్తి కార్తిక గౌడ్ స్వయంగా భక్తులకు అన్నప్రసాదాలు వడ్డించి శుభాకాంక్షలు తెలిపారు. సాయంత్రం చిన్నారుల కోసం ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రత్యేక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని ఆకట్టుకున్నారు.నవరాత్రి ఉత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరిస్తుండటంపై కత్తి కార్తిక గౌడ్ సంతోషం వ్యక్తం చేశారు.





# దళిత యువతిని మోసం చేసిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలి:డీబీఎఫ్ డిమాండ్

**ప్రజా వాయిస్ దౌల్తాబాద్**

ప్రేమ పేరుతో దళిత యువతిని పెళ్లి చేసుకుని, అనంతరం వదిలేసిన వ్యక్తిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని దళిత బహుజన్ ఫ్రంట్ (డీబీఎఫ్) జాతీయ కార్యదర్శి శంకర్ డిమాండ్ చేశారు. బుధవారం దౌల్తాబాద్ మండలం ముత్యంపేట గ్రామంలోని బాధితురాలి కుటుంబాన్ని ఆయన పరామర్శించి ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ ముత్యంపేట గ్రామానికి చెందిన బీసీ వర్గానికి చెందిన భానుచందర్ అనే యువకుడు ఓ దళిత యువతిని ప్రేమించి, స్నేహితుల సమక్షంలో కులాంతర వివాహం చేసుకున్నాడని తెలిపారు. వీరిద్దరూ గజ్వేల్లో కాపురం పెట్టిన కొద్దిరోజులకే, భానుచందర్ తన తల్లిదండ్రుల ఒత్తిడికి తలొగ్గి ఆమెను నడిరోడ్డుపై వదిలేశాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అన్యాయంపై బాధితురాలి ఫిర్యాదు మేరకు ఉన్నతాధికారుల ఆదేశాలతో కేసు నమోదు అయినప్పటికీ, నిందితుడిని అరెస్టు చేయడంలో పోలీసులు తీవ్ర జాప్యం వహిస్తున్నారని ఆరోపించారు. ఇకనైనా పోలీసులు వెంటనే స్పందించి నిందితుడిని అరెస్టు చేసి, బాధితురాలితో పాటు ఆమె కుటుంబానికి తగిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ పరామర్శ కార్యక్రమంలో డీబీఎఫ్ నాయకులు సతీష్, నర్సింలు, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



# 22-A చట్టం వల్ల ప్రజలకు తీవ్ర ఇబ్బందులు

## నిషేధిత జాబితా నుంచి ప్రైవేట్ ఆస్తులను తొలగించాలని సిద్దిపేట కలెక్టరేట్‌లో టీడీపీ నేతల వినతి

**ప్రజా వాయిస్ సిద్ధిపేట హుస్నాబాద్**

రిజిస్ట్రేషన్ చట్టం 1908లోని సెక్షన్ 22–ఏ ప్రకారం నిషేధిత ఆస్తుల జాబితాలో ప్రైవేట్ ఆస్తులను తప్పుగా, పరిమితికి మించి చేర్చడం వల్ల సామాన్య ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని, ఈ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని తెలుగుదేశం పార్టీ సిద్దిపేట జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సిద్దిపేట జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పరిపాలనాధికారి (ఏవో)కి వారు బుధవారం వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా టీడీపీ నాయకుడు బత్తుల శ్రీనివాస్ మాట్లాడుతూ, నిషేధిత జాబితాలో ప్రైవేట్ భూములను చేర్చడం వల్ల బాధితులు తమ స్వంత ఆస్తులపై సర్వహక్కులు కోల్పోయి అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సెక్షన్ 22–ఏ శాసన ఉద్దేశాన్ని పరిగణనలోకి తీసుకుని, రెవెన్యూ రికార్డులను సమగ్రంగా సమీక్షించి తక్షణమే తగిన సవరణలు చేయాలని ఆయన కోరారు. అలాగే బాధితుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేకంగా సమర్థవంతమైన ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను ఏర్పాటు చేసి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను అర్థించారు.ప్రజా సమస్యలపై అధికారులు త్వరగా స్పందించి న్యాయం చేయాలని ఈ సందర్భంగా నేతలు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుయువత నాయకుడు ఒగ్గు రాజుతో పాటు ఎండి హాసన్, పాసికంటి సత్యం, మాచవరం వెంకటేశ్వరరావు, రామంచ రాములు, గౌరీశెట్టి దామోదర్, దూస శ్రీనివాస్ తదితర టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అంతా అబద్ధం..

## రేవంత్ రెడ్డి ఆరోపణలకు కవిత కౌంటర్



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన భూ ఆరోపణలపై తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కవిత తీవ్రంగా స్పందించారు. తన ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్న ఆస్తుల కంటే ఒక్క గజం భూమి అదనంగా ఉన్నట్లు నిరూపించినా, ఆ భూమిని ప్రభుత్వానికే అప్పగిస్తానని ఆమె సవాల్ విసిరారు. అసెంబ్లీ వేదికగా ముఖ్యమంత్రి తన కుటుంబంపై అసత్య ఆరోపణలు చేశారని, ఆయన మాటలపై తమకు విశ్వాసం లేదని స్పష్టం చేశారు.ఈ వ్యవహారంలో వాస్తవాలు వెలుగులోకి రావాలంటే సీబీఐ విచారణకు ఆదేశించాలని ఆమె డిమాండ్ చేశారు. కేవలం తనపైనే కాకుండా, అసెంబ్లీలో ముఖ్యమంత్రి ప్రస్తావించిన 'గుంటనక్క'తో పాటు కేసీఆర్ ఫాంహౌస్‌లోని సీఎం గూఢచారి, నవీన్ రావు, కొండల్ రావు, గంగుల కమలాకర్, ఎర్రబెల్లి దయాకర్ రావు, జగదీశ్ రెడ్డి, రామేశ్వర్ రావు, ప్రతిమ శ్రీనివాస్ రావు, పల్లా రాజేశ్వర్ రెడ్డి, సుధీర్ రెడ్డి, పైలెట్ రోహిత్ రెడ్డి తదితరులందరి భూములపై సమగ్ర విచారణ జరిపించాలని కవిత డిమాండ్ చేశారు.'గుంపు మేస్త్రీ – గుంటనక్క' ముమ్మాటికీ కలిసే ఉన్నారని ఈ సందర్భంగా కవిత వ్యాఖ్యానించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కానీ, ఎన్నికల అఫిడవిట్‌లో వెల్లడించిన దానికంటే గజం భూమి అదనంగా ఉన్నా ప్రభుత్వానికే అప్పగిస్తానని ఆమె పునరుద్ఘాటించారు. ముఖ్యమంత్రి చేసిన ఆరోపణలు, కవిత సవాల్‌తో రాష్ట్ర రాజకీయాల్లో భూముల వివాదం మరింత వేడెక్కింది.

# ఎస్టీల సంక్షేమానికి కేసీఆర్ ప్రభుత్వమే శ్రీరామరక్ష

## మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్




**ప్రజా వాయిస్ హుస్నాబాద్:**

తెలంగాణలో గిరిజనుల సంక్షేమం, సమగ్ర అభివృద్ధికి కేసీఆర్ ప్రభుత్వమే ప్రాధాన్యతనిచ్చిందని హుస్నాబాద్ నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు వొడితల సతీష్ కుమార్ తెలిపారు. బిఆర్ఎస్ హయాంలో తండాలను గ్రామపంచాయతీలుగా మార్చి గిరిజనులకు స్వయం పరిపాలన సాధించి పెట్టడమే కాకుండా, ఎస్టీ రిజర్వేషన్లను 10 శాతానికి పెంచిన ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు.ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలు, విదేశీ విద్య, కేసీఆర్ కిట్లు, రైతుబంధు, రైతుబీమా, కళ్యాణలక్ష్మి, ఆసరా పింఛన్లు వంటి పథకాల ద్వారా గిరిజన కుటుంబాలకు బీఆర్ఎస్ ప్రభుత్వం అండగా నిలిచిందని పేర్కొన్నారు. అయితే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని ఆయన విమర్శించారు. ఐటీడీఏలు, గిరిజన కార్పొరేషన్లకు నిధుల కేటాయింపు నిలిచిపోయిందని, ప్రతి మండలంలో ఎస్సీ, ఎస్టీ రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేస్తామన్న హామీ ఎటుపోయిందో కాంగ్రెస్ నాయకులు జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే గిరిజనాభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయాలని, గిరిజనుల హక్కుల సాధన కోసం బిఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ పోరాడుతుందని సతీష్ కుమార్ స్పష్టం చేశారు.



# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓజోన్ దినోత్సవం

**ప్రజా వాయిస్ కగజ్ నగర్**

కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ ఓజోన్ దినోత్సవాన్ని పురస్కరించుకుని రసాయన శాస్త్ర, భౌతిక శాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు.సూర్యుడి నుంచి వచ్చే అతినీలలోహిత కిరణాల నుంచి ఓజోన్ పొర జీవజాలాన్ని రక్షిస్తుందని, కాలుష్య కారకాల వల్ల ఓజోన్ పొర దెబ్బతినడం వల్ల అనేక దుష్పరిణామాలు సంభవిస్తాయని కళాశాల ప్రిన్సిపల్ కే.శ్రీదేవి వివరించారు. వాతావరణంలోకి నిరంతరం విడుదలయ్యే క్లోరో ఫ్లోరో కార్బన్ల వల్ల ఓజోన్ పొర దెబ్బతిని, అతినీలలోహిత కిరణాలు నేరుగా జీవులపై పడడం ద్వారా చర్మ క్యాన్సర్లు, ఇతర వ్యాధులు సంభవిస్తాయని రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఇ.శారద తెలిపారు. ఓజోన్ పొర రక్షణ కోసం ఏర్పాటైన మాంట్రియల్ ఒప్పందం పట్ల అందరూ అవగాహన కలిగి కాలుష్య కారకాలను తగ్గించాలని సూచించారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలి

## ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుగులోత్ వంశీ



**జూలూరుపాడు, ప్రజా వాయిస్ :**

ప్రభుత్వ పాఠశాలలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని అఖిలభారత విద్యార్థి సమైక్య (ఏఐఎస్ఎఫ్) జిల్లా సహాయ కార్యదర్శి గుగులోత్ వంశీ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం మండల పరిధిలోని వివిధ పాఠశాలల్లో ఏఐఎస్ఎఫ్ చేపట్టిన సభ్యత నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు పూర్తిస్థాయిలో యూనిఫాం అందజేయాలని, విద్యారంగ సంస్థల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. పాఠశాలలు ప్రారంభమై మూడు నెలలు పూర్తి కావస్తున్న ఇప్పటివరకు ప్రభుత్వం విద్యార్థులకు కనీస వసతులు కల్పించకుండా కాలయాపన చేస్తూ, విద్యార్థుల జీవితాలను ప్రశ్నార్థకం చేస్తున్నారని విమర్శించారు. తక్షణమే విద్యాసంస్థల్లో సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి సభ్యులు అనిల్ కుమార్, సాయి ఈశ్వర్, లితికేష్, జంబో, హరి, శిరీష, సింధు, బన్నీ, నందిని తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

**మండలంలో సర్పంచులతో సమావేశం**

**పనితీరుపై నిర్లక్ష్యం వహిస్తే చట్ట పరమైన చర్యలు**

**ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి**

**సెప్టెంబర్ 16 (ప్రజా వాయిస్) చేగుంట:**
చేగుంట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సర్పంచ్ ల ముఖ్య సమావేశం బుధవారం నిర్వహించిన రెండో సర్వసభ్య సాధారణ సమావేశానికి దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై వివిధ శాఖల పనితీరుపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. మూడు నెలలకోసారి జరిగే ఇంతటి కీలక సమావేశానికి పలు శాఖల అధికారులు గైర్హాజరు కావడంపై ఎమ్మెల్యే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, విధుల్లో బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.విద్యా వ్యవస్థపై సమీక్షిస్తూ ఇన్‌చార్జ్ ఎంఈవో నీరజను ఉద్దేశించి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధనపై నమ్మకం లేకే తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడులకు పంపడం లేదని, విద్యార్థుల నమోదు పెరిగేలా విద్యా ప్రమాణాలను ఎందుకు మెరుగుపరచడం లేదని ప్రశ్నించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు, పౌష్టికాహార పంపిణీపై జిల్లా సంక్షేమ శాఖ అధికారి (డీడబ్ల్యూవో) హేమ భార్గవితో కలిసి



ఆరా తీశారు. గృహనిర్మాణ శాఖ సమీక్షలో భాగంగా మండలంలో మంజూరైన 104 ఇళ్లలో ఇప్పటికే 50 నిర్మాణాలు పూర్తయ్యాయని అధికారులు తెలపగా, మిగిలిన ఇళ్లను నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో సర్పంచ్ లేదా ఉప సర్పంచ్‌ల ప్రమేయం, సహకారం లేకుండా ఏ శాఖ పనులూ ముందుకు సాగవని, ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే స్థానిక సర్పంచ్‌ల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని హౌసింగ్ సహా అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. పంచాయతీ రాజ్ పరిధిలోని సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులను నాణ్యతతో పూర్తి చేయాలని, వర్షాల వల్ల విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ప్రమాదకర స్తంభాలు, వేలాడే తీగలను సరిచేయాలని స్పష్టం చేశారు. అలాగే వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా వ్యాధులు ప్రబలకుండా దోమలు, ఈగల నివారణకు చర్యలు చేపట్టాలని, గ్రామాల పరిశుభ్రతపై ప్రజల్లో చైతన్యం తేవాలని సర్పంచ్‌లకు సూచించారు (పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సౌజన్య డెంగ్యూ నివారణపై అవగాహన కల్పించారు).ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మారుతున్న కాలానికి అనుగుణంగా గ్రామీణ యువత, రైతాంగం ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలు, సరికొత్త వ్యవసాయ విధానాల వైపు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం పట్టణాల్లో క్లౌడ్ కిచెన్‌ల ద్వారా సరికొత్త అవకాశాలు వస్తున్నాయని, పల్లెల నుంచి వంట నిపుణులు వెళ్లి నెలకు రూ. 10 వేల నుంచి రూ. 20 వేల వరకు సంపాదిస్తున్నారని పేర్కొన్నారు. మార్కెట్లో స్వచ్ఛమైన పాలకు విపరీతమైన డిమాండ్ ఉన్నందున పాల ఉత్పత్తితో పాటు బయోగ్యాస్, ఇథనాల్ తయారీపై దృష్టి పెట్టాలన్నారు. భవిష్యత్తులో మొక్కజొన్న అతిపెద్ద కమర్షియల్ పంటగా మారుతుందని, దాని వ్యర్థాల నుంచి బయో-ప్లాస్టిక్ వస్తువులు, ప్లాస్టిక్ పేపర్లు, బాటిళ్లు, సాసర్లు, ప్లేట్లతో పాటు భారీగా ఇథనాల్ ఉత్పత్తి జరుగుతోందని తెలిపారు. రేపటి రోజుల్లో జనరేటర్లు నడవడానికి సైతం డీజిల్‌కు బదులుగా ఇథనాల్ ఆధారిత ఇంధనమే కీలకం కానుందని, ప్రకృతి వనరులు, వర్షపు నీటిని సద్వినియోగం చేసుకుంటే రోగాల ముప్పు లేకుండా జీవించవచ్చని, మరో ఐదేళ్లలో ప్రపంచ ముఖచిత్రం పూర్తిగా మారిపోనుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి హేమ భార్గవి, ఎస్సై చైతన్యకుమార్, వివిధ గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# హాలియాలో వినాయక నిమజ్జనానికి పటిష్ఠ బందోబస్తు

**211 మండపాలకు జియో ట్యాగింగ్..**

**రౌడీషీటర్లు, డీజే నిర్వాహకులకు బైండోవర్**

**ఉదయం, సాయంత్రం, రాత్రి ప్రత్యేక గస్తీ..**

**అలీనగర్ వద్ద నిమజ్జన ఏర్పాట్లు**

**నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని పోలీసుల హెచ్చరిక**

**ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం నిర్వహించేందుకు సహకరించాలని ఎస్ఐ సాయి ప్రశాంత్ విజ్ఞప్తి**

**ప్రజా వాయిస్,హాలియా:**
వినాయక నిమజ్జనాన్ని ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు హాలియా పోలీస్ స్టేషన్ పరిధిలో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. నల్గొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఆదేశాల మేరకు మిర్యాలగూడ డీఎస్పీ జి.రవి, హాలియా సీఐ ఎస్.రాఘవరావు పర్యవేక్షణలో ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టారు. ఇప్పటివరకు 211 వినాయక మండపాలు ఆన్‌లైన్‌లో నమోదు కాగా.. వాటన్నింటికీ జియో ట్యాగింగ్ పూర్తి చేశారు. దీంతో మండపాల వద్ద పోలీసుల నిఘా, గస్తీని మరింత పటిష్ఠం చేశారు.

**ముందస్తు చర్యలు**
వినాయక చవితికి ముందే రౌడీషీటర్లను బైండోవర్ చేసిన పోలీసులు.. డీజే నిర్వాహకులు, యజమానులపైనా ఇదే తరహా చర్యలు తీసుకున్నారు. హాలియా పట్టణం, అనుముల మండల పరిధిలో ఉదయం, సాయంత్రం, రాత్రి వేళల్లో ప్రత్యేక గస్తీ కొనసాగుతోంది. బ్లూకోల్ట్స్, పోలీస్ పెట్రోలింగ్ వాహనాలు, స్టేషన్ సిబ్బంది నిరంతరం తిరుగుతూ పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.

**14వ మైలు వద్ద ఏర్పాట్లు**
అలీనగర్ చెక్‌పోస్ట్ సమీపంలోని 14వ మైలు వద్ద విగ్రహాల నిమజ్జనానికి అవసరమైన ఏర్పాట్లను సంబంధిత శాఖల సమన్వయంతో చేపట్టారు. నిమజ్జన కార్యక్రమం పూర్తయ్యే వరకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు ప్రత్యేక నిఘా కొనసాగించనున్నారు.

**డీజేలకు బ్రేక్**




నిమజ్జన సమయంలో అధిక శబ్దంతో డీజేలు వినియోగించరాదని మండపాల నిర్వాహకులకు పోలీసులు స్పష్టం చేశారు. నిబంధనలు అతిక్రమించి డీజేలు నిర్వహిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. భక్తులు, మండపాల నిర్వాహకులు పోలీసుల సూచనలు, నిబంధనలు పాటించి ప్రశాంతంగా నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించేందుకు సహకరించాలని హాలియా ఎస్ఐ బండి సాయి ప్రశాంత్ కోరారు.

# పేదరికాన్ని జయించిన పట్టుదల

**నీట్‌లో సత్తా.. ప్రతిభకు పట్టం!..**

**నకిరేకల్ కుర్రాడికి ఉస్మానియా మెడికల్ కాలేజీలో సీటు!**

**ప్రజా వాయిస్, నకిరేకల్:**
“కష్టాలు మనుషులను కృంగదీస్తాయి.. కానీ దృఢసంకల్పం ముందు పేదరికమైనా తలవంచాల్సిందే” అని నిరూపించాడు నకిరేకల్‌కు చెందిన అబూబకర్ సిద్ధిఖ్. ఎన్నో ఆర్థిక ఇబ్బందులు, కుటుంబంలో ఎదురైన తీరని లోటును అధిగమించి, ప్రతిష్ఠాత్మక ఉస్మానియా మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ (వీదీదీూ) సీటు సాధించి అందరికీ ఆదర్శంగా నిలిచాడు.

**తీరని లోటు.. లొంగని పట్టుదల**
నకిరేకల్‌కు చెందిన మౌలానా అక్బర్ కుమారుడే అబూబకర్ సిద్ధిఖ్. కుటుంబానికి కొండంత అండగా ఉన్న తండ్రి గతేడాది అకస్మాత్తుగా మృతి చెందడంతో ఆ కుటుంబం తీవ్ర శోకసంద్రంలో మునిగిపోయింది. ఒకవైపు తండ్రి లేడనే ఆవేదన, మరోవైపు వెంటాడుతున్న ఆర్థిక ఇబ్బందులు అబూబకర్ లక్ష్యానికి పరీక్షగా నిలిచాయి. అయితే, తన తండ్రి ఆశయాలను నిలబెట్టాలని, చదువే తన జీవితాన్ని మార్చే మార్గమని నమ్మిన అబూబకర్, ఆ బాధను దిగమింగి రాత్రింబవళ్లు చదువుపైనే దృష్టి సారించాడు.

**నీట్‌లో సత్తా..ఉస్మానియాలో సీటు**
కుటుంబ పరిస్థితులు ఏమాత్రం తన లక్ష్యానికి అడ్డంకి కాకుండా గట్టి పట్టుదలతో శ్రమించిన అబూబకర్, జాతీయ స్థాయిలో నిర్వహించిన నీట్ పరీక్షలో 552 మార్కులు సాధించి సత్తా చాటాడు. ఈ అత్యుత్తమ మార్కులతో రాష్ట్రంలోనే పేరుగాంచిన ఉస్మానియా మెడికల్ కాలేజీలో మెడిసిన్ సీటు కైవసం చేసుకున్నాడు.

**స్ఫూర్తిదాయక విజయగాథ**
పేదరికం ముందు ఎన్నో కలలు చెదిరిపోతున్న ఈ రోజుల్లో, చదువుకోవాలనే నిజమైన సంకల్పం ఉంటే ఆర్థిక ఇబ్బందులు అడ్డుకావని అబూబకర్ నిరూపించాడు. ఇది కేవలం ఒక విద్యార్థి సాధించిన విజయం మాత్రమే కాదని, కష్టపడే తత్వానికి దక్కిన గౌరవమని స్థానికులు, పలువురు



ప్రముఖులు కొనియాడారు. అబూబకర్ సిద్ధిఖ్ సాధించిన ఈ విజయం ఎంతోమంది పేద విద్యార్థులకు, భవిష్యత్తుపై ఆశ కోల్పోతున్న యువతకు గొప్ప స్ఫూర్తిగా నిలుస్తోంది.

# 22ఏ భూములపై గుడ్‌న్యూస్.. సీఎం రేవంత్ కీలక హామీలు

22ఏ భూముల సమస్యల పరిష్కారంపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకోనుంది. 22ఏ సమస్యల్లో 12 రకాల అంశాలను గుర్తించామని సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో తెలిపారు. యూఎల్‌సీ భూముల విషయంలో త్వరలో కొత్త విధానం తీసుకొస్తామని చెప్పారు.అధీకృత లేఅవుట్లలో పెండింగ్‌లో ఉన్న రిజిస్ట్రేషన్లను వారంలో పరిష్కరిస్తామని సీఎం ప్రకటించారు. హెచ్‌ఎండీఏ, డీటీసీపీ అనుమతులు ఉన్న లేఅవుట్ల రిజిస్ట్రేషన్లు కూడా చేస్తామన్నారు.ఇకపై 22ఏ జాబితాలో భూమిని చేర్చడం, తొలగించడం కోసం స్పష్టమైన నిబంధనలు తీసుకొస్తామని రేవంత్‌రెడ్డి చెప్పారు. పొరపాటున వ్యక్తిగత భూములు 22ఏ జాబితాలో చేరితే కలెక్టర్లు, ఆర్డీవోలు వాటిని తొలగించేలా చర్యలు తీసుకుంటామన్నారు.ప్రభుత్వం క్రమబద్ధీకరించిన భూములను నిషేధిత జాబితా నుంచి తొలగిస్తామని తెలిపారు. జీవో 166, జీవో 59, జీవో 58 కింద క్రమబద్ధీకరించిన భూములకు కూడా ఇది వర్తిస్తుందన్నారు. వేలంలో కొనుగోలు చేసిన భూములు, బ్యాంకుల్లో తనఖా పెట్టి వేలం వేసిన భూములను కూడా 22ఏ జాబితా నుంచి తొలగిస్తామని చెప్పారు.ధరణి వ్యవస్థపై గత బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని సీఎం విమర్శించారు. నీటి ప్రాజెక్టుల తర్వాత కేసీఆర్ దృష్టి భూములపై పడిందని ఆరోపించారు. భూదోపిడీ ఆలోచనల నుంచే ధరణి పుట్టిందన్నారు. కేసీఆర్, సోమేశ్‌కుమార్ కలిసి ధరణిని రూపొందించారని చెప్పారు.ప్రభుత్వం కోటి ఎకరాలను నిషేధిత జాబితాలో పెట్టిందన్న ఆరోపణలపైనా రేవంత్ స్పందించారు. అసలు వివాదం 3.73 లక్షల ఎకరాల ప్రైవేట్ పట్టా భూముల గురించేనన్నారు. వాటిని చూపించి కోటి ఎకరాల భూమిని నిషేధిత జాబితాలో పెట్టారంటూ ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు.హైకోర్టు ఆదేశాల మేరకు 2025లో నిషేధిత భూముల జాబితాను ప్రజలకు అందుబాటులో ఉంచామని సీఎం తెలిపారు.





# డాక్టర్ చదువు కోసం 30 వేల రూపాయల ఆర్థిక సహాయం

**దాతృత్వం చాటుకున్న కేఎంపి హెల్పింగ్ హాండ్ సొసైటీ సభ్యులు**

**పట్టుదలతో చదివి మంచి డాక్టర్ కావాలి. సర్పంచ్ పసునూరు యుగంధర్ రెడ్డి**

**ప్రజా వాయిస్ కొండమల్లేపల్లి మండలం సెప్టెంబర్ 16**
నాంపల్లి మండలం ముష్టిపల్లి గ్రామానికి చెందిన ఆదిరాల పరమేష్ కుమార్తె రూప ఇటీవల కరీంనగర్ లోని ప్రతిమ మెడికల్ కళాశాలలో ఎంబిబిఎస్ సీటు సాధించింది. ఇటీవల తండ్రి మరణంతో రూప చదువుకు ఎవరు సహకరిస్తారని సంశమంలో పడింది. కుటుంబ సభ్యులు కేఎంపి హెల్పింగ్ హాండ్స్ దృష్టికి తీసుకురాగా 30వేల రూపాయలు సేకరించి గురువారం సర్పంచి పసునూరు యుగంధర్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు .ఈ సందర్భంగా కొండమల్లేపల్లి సర్పంచ్ మాట్లాడుతూ పట్టుదలతో చదివి భవిష్యత్తులో మంచి వైద్యురాలివి కావాలని ఆదిరాల రూపకు కొండమల్లేపల్లి సర్పంచ్ పసునూరు యుగేందర్ రెడ్డి సూచించారు. చదువుకు పేదరికం అడ్డు కాకూడదని చదువు కోసం ఇలాంటి స్వచ్ఛంద సంస్థలను సంప్రదించాలని భవిష్యత్తులో కూడా సహకరిస్తారని సూచించారు. కే.ఎం.పీ హెల్పింగ్ హాండ్స్ వెల్ఫేర్ సొసైటీ సేవలు అభినందనీయమని అన్నారు .ఈ కార్యక్రమంలో కొడిదల వెంకటయ్య, ఏరుకొండ రాము, కూన భానుచందర్, అలుగుబెల్లి నాగార్జున రెడ్డి ,ఎండి లతీఫ్, దండు రవికుమార్, బొడ్డుపల్లి మల్లికార్జున్, బిజిలీ లింగం ,అందుగుల వెంకటేష్, వస్కుల శ్రీను, పర్వతం కొండల్ ,పాల్వాయి సైదులు, వస్కుల ప్రవీణ్, అందుగుల పరమేష్, వెంకటేష్ ,వసుకుల శ్రీను, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



# గణేష్ నిమజ్జన ఏర్పాట్లను పర్యవేక్షించిన అధికారులు

**ప్రజా వాయిస్/ అనుమల:**
పురపాలక సంఘం హాలియా నల్గొండ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గణేష్ నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు చేపట్టిన ఏర్పాట్లలో భాగంగా అనుముల మండల పరిధిలోని 14వ మైలు చెక్‌పోస్ట్ వద్ద గణేష్ నిమజ్జన ఏర్పాట్లను హాలియా మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి, మున్సిపల్ కమిషనర్ కే. రవీందర్ రెడ్డి పర్యవేక్షించారు.ఈ సందర్భంగా ఎమ్మార్వో పూర్ణచందర్, ఎంపీడీవో మజీద్, సీఐ రాఘవరావు, ఎస్సై సాయి ప్రశాంత్ తదితర అధికారులు పాల్గొన్నారు.గణేష్ నిమజ్జన కార్యక్రమంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా, ప్రజలు మరియు భక్తులు ప్రశాంత వాతావరణంలో నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించుకునేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నిమజ్జన ప్రాంతంలో అవసరమైన భద్రతా, పారిశుద్ధ్య, మౌలిక వసతుల ఏర్పాట్లను సమన్వయంతో చేపట్టేలా అధికారులు పర్యవేక్షించారు.




# గణేష్ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన అడిషనల్ ఎస్పీ రమేష్

**వినాయక మండపాల్లో భద్రతా చర్యలపై ఆరా..**

**డీజేల నిషేధంపై అవగాహన**

**ప్రజా వాయిస్ వేములపల్లి**
ప్రస్తుత గణేష్ ఉత్సవాల నేపథ్యంలో నల్లగొండ అడిషనల్ ఎస్పీ జి. రమేష్ బుధవారం వేములపల్లి మండలంలో పర్యటించి గణేష్ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు.వేములపల్లిలోని ఎన్ఎస్పీ ఎడమ కాలువ వద్ద ఏర్పాటు చేసిన నిమజ్జన స్థలాన్ని అడిషనల్ ఎస్పీ పరిశీలించారు. నిమజ్జనం సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు.అనంతరం వేములపల్లి మండలంలోని పలు వినాయక మండపాలను సందర్శించారు. ఆయా మండపాల వద్ద పోలీసులు భద్రతా తనిఖీల కోసం ఏర్పాటు చేసిన పాయింట్ బుక్‌లను పరిశీలించారు. ఉత్సవ కమిటీ సభ్యులతో మాట్లాడి ఉత్సవాల నిర్వహణకు సంబంధించిన నిబంధనలను వివరించారు.


# వేగం పెంచిన రజనీకాంత్..‘ధర్మన్’ షూటింగ్‌పై అప్‌డేట్ ఇచ్చిన దర్శకుడు

సూపర్ స్టార్ రజనీకాంత్ కథానాయకుడిగా నటిస్తున్న భారీ చిత్రం ‘ధర్మన్’ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. దర్శకుడు అశ్వత్ మారిముత్తు ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. తాజాగా ఈ సినిమా మూడో షెడ్యూల్ బుధవారం ప్రారంభమైంది. ఈ విషయాన్ని దర్శకుడు అశ్వత్ తన ఎక్స్ ఖాతా ద్వారా అధికారికంగా ప్రకటించారు.షూటింగ్ సెట్స్ నుంచి ఒక ఆసక్తికరమైన బిహైండ్-ది-సీన్స్ (బీటీఎస్) వీడియో క్లిప్‌ను ఆయన పంచుకున్నారు. ఈ వీడియోలో సూపర్ స్టార్ రజనీకాంత్, నటి రాశి ఖన్నాతో ముచ్చటిస్తూ కనిపించారు. “ధర్మన్ మూడో షెడ్యూల్ కోసం మళ్లీ తలైవర్‌తో కలిశాను” అంటూ ఈ పోస్ట్‌కు క్యాప్షన్ జోడించారు. ఈ క్లిప్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.ఇటీవలే సెప్టెంబర్ 4న ఈ చిత్ర రెండో షెడ్యూల్‌ను విజయవంతంగా పూర్తి చేసుకున్న సంగతి తెలిసిందే. ఆ సమయంలో చిత్ర నిర్మాణ సంస్థ రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్.. రజనీకాంత్ ఒక సీనియర్ మెడికల్ ఫ్యాకల్టీగా జూనియర్ డాక్టర్లకు పాఠాలు చెబుతున్న సన్నివేశాలతో కూడిన వీడియోను విడుదల చేసింది. ఈ లుక్‌కు అభిమానుల నుంచి అద్భుతమైన స్పందన లభించింది.ఈ చిత్రాన్ని లోకనాయకుడు కమల్ హాసన్ తన సొంత నిర్మాణ సంస్థ రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ పతాకంపై నిర్మిస్తున్నారు. కమల్ నిర్మాణంలో రజనీ నటిస్తుండటంతో ఈ ప్రాజెక్ట్‌పై తమిళంతో పాటు తెలుగు ప్రేక్షకుల్లోనూ భారీ అంచనాలు నెలకొన్నాయి. ‘ధర్మమే వెల్లుమ్’ (ధర్మమే గెలుస్తుంది) అనే ట్యాగ్‌లైన్‌తో కమల్ హాసన్ స్వయంగా ఈ సినిమా టైటిల్‌ను ప్రకటించారు.ఈ చిత్రంలో రజనీకాంత్ ఒక వైద్యుడి పాత్రలో నటిస్తూనే, సమాజంలోని నేరస్థులను శిక్షించే శక్తివంతమైన పాత్రలో కనిపించనున్నారని ప్రచారం జరుగుతోంది. గతంలో విడుదలైన టైటిల్ పోస్టర్‌లో ఆపరేషన్ థియేటర్‌లో స్కాల్‌పెల్ చేతిలో పట్టుకుని, ఒక రౌడీ మృతదేహంపై కాలు వేసి ఉన్న రజనీకాంత్ లుక్ సినిమాపై ఉత్కంఠను మరింత పెంచింది.ఈ చిత్రానికి యువ సంచలనం అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తుండగా, నికేత్ బొమ్మి సినిమాటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నారు. జాతీయ అవార్డు గ్రహీతలైన అన్బరివ్ ద్వయం స్టంట్స్ కొరియోగ్రఫీ చేస్తున్నారు. కమల్ హాసన్, ఆర్. మహేంద్రన్ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. వరుస షెడ్యూళ్లతో సినిమాను వేగంగా పూర్తి చేసేందుకు చిత్ర యూనిట్ ప్రణాళికలు రచిస్తోంది.



## ఆసియా ఛాంపియన్స్ హాకీ ట్రోఫీ..

# భారత్‌లో ఆడబోం: పాకిస్థాన్



ఇంటర్నెట్ డెస్క్: భారత్ వేదికగా అక్టోబర్ 27 నుంచి జరగనున్న మెన్స్ ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీ హాకీ టోర్నీ విషయంలో పాకిస్థాన్ కొత్త పేచీ పెట్టింది. మ్యాచ్‌లను భారత్‌లో ఆడబోమని, టోర్నీ నిర్వహణను మరో దేశానికి మార్చాలని.. లేదంటే తటస్థ వేదికలో నిర్వహించాలని ఆసియా హాకీ సమాఖ్య (ఏఎచ్ఎఫ్)ను పాకిస్థాన్ హాకీ సమాఖ్య కోరింది. పాకిస్థాన్ హాకీ ఫెడరేషన్ అధ్యక్షుడు మొహియుద్దీన్ అహ్మద్ వానీ ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు.భారత్-పాకిస్థాన్ మధ్య ప్రస్తుతం ఉన్న పరిస్థితులు, భద్రతా అంశాలను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు పాకిస్థాన్ హాకీ ఫెడరేషన్ తెలిపింది. అయితే ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీలో పాల్గొనే విషయంలో పాకిస్థాన్ వెనక్కి తగ్గడం లేదని ఫెడరేషన్ స్పష్టం చేసింది. భారత్ సహా అన్ని దేశాలతో ఆడేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపింది.

ముందు భారత్‌కు వస్తామని..

ఆసక్తికరంగా.. పాకిస్థాన్ తాజాగా ఈ అభ్యర్థన చేయడానికి రెండు రోజుల ముందే ఆ జట్టు భారత్‌లో జరిగే టోర్నీలో పాల్గొంటుందని ప్రకటించారు. పంజాబ్ సీఎం భగవంత్ మాన్ సెప్టెంబర్ 14న పాకిస్థాన్ టోర్నీలో ఆడుతుందని వెల్లడించారు. భారత్-పాకిస్థాన్ ద్వైపాక్షిక సిరీస్‌లకు అవకాశం లేకపోయినా.. బహుళజాతి టోర్నీల్లో ఇరు జట్లు తలపడేందుకు భారత విధానం అనుమతిస్తుందని ఆయన తెలిపారు. ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్, పాకిస్థాన్, చైనా, జపాన్, మలేసియా, దక్షిణ కొరియా జట్లు పాల్గొననున్నాయి. పాకిస్థాన్ వైదొలిగితే ప్రత్యామ్నాయంగా ఒమన్, బంగ్లాదేశ్‌లను రిజర్వ్ జట్లుగా ఉంచారు.

## SPORTS



# వెస్టిండీస్‌తో వన్డే, టీ20 సిరీస్‌లు: భారత జట్లను ప్రకటించిన బీసీసీఐ

డెస్క్

వెస్టిండీస్-భారత్ మధ్య జరగబోయే సిరీస్‌ల కోసం బీసీసీఐ వన్డే, టీ20 జట్లను తాజాగా ప్రకటించింది. సెప్టెంబర్ 27 నుంచి మూడు వన్డేలు, అక్టోబర్ 6 నుంచి ఐదు టీ20లు జరగనున్నాయి. గాయం కారణంగా జట్టుకు దూరమైన స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యకు చోటు దక్కలేదు. ఇరాని కప్‌లో బిజీగా ఉన్న రిషభ్ పంత్‌ను సెలెక్టర్లు ఎంపిక చేయలేదు.

**భారత వన్డే జట్టు:**

శుభ్‌మన్ గిల్(కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, రుతురాజ్ గైక్వాడ్, కేఎల్ రాహుల్(వైస్ కెప్టెన్), ధ్రువ్ జురెల్, నితీశ్ కుమార్ రెడ్డి, రవీంద్ర జడేజా, కుల్‌దీప్ యాదవ్, ప్రసిద్ధ్ కృష్ణ, బ్రార్, సిరాజ్, ఆకిబ్ నబి, యశస్వి జైస్వాల్, నమన్ ధీర్

**భారత టీ20 జట్టు:**

శ్రేయస్ అయ్యర్(కెప్టెన్), అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, ఇషాన్ కిషన్, సంజు శాంసన్, తిలక్ వర్మ, శివమ్ దూబె, కుల్‌దీప్ యాదవ్, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, రవి బిష్ణోయ్, నితీశ్ కుమార్ రెడ్డి, అర్ష్‌దీప్ సింగ్, ప్రిన్స్ యాదవ్, మయాంక్ యాదవ్

# అథ్లెటిక్స్ కోచ్‌పై జీవితకాల నిషేధం విధించిన నాడా

ఇంటర్నెట్ డెస్క్: భారత అథ్లెటిక్స్‌లో డోపింగ్ కలకలం రేపుతోంది. నిషేధిత పదార్థాలను అందించిన కేసులో అథ్లెటిక్స్ కోచ్ రాకేశ్ కుమార్‌పై నేషనల్ యాంటీ డోపింగ్ ఏజెన్సీ జీవితకాల నిషేధం విధించింది. మరోవైపు నిషేధిత డ్రగ్స్ అక్రమ రవాణాకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న పవర్‌లిఫ్టర్ గౌరవ్ వాత్స్‌ను కూడా తాత్కాలికంగా సస్పెండ్ చేసింది. రాకేశ్ కుమార్‌పై గతేడాది మార్చిలోనే సస్పెన్షన్ విధించగా.. అప్పటి నుంచే అతడి జీవితకాల నిషేధం అమల్లోకి వచ్చినట్లు నాడా తాజాగా పేర్కొంది.

నేషనల్ ఇంటర్ స్టేట్ పోటీల్లో కాంస్య పతకం సాధించిన స్ప్రింటర్ ప్రకృతి రూపా రావును కూడా నాడా తాత్కాలికంగా సస్పెండ్ చేసింది. ఆమె డోప్ టెస్టులో నిషేధిత స్టెరాయిడ్లు వాడినట్లు తేలడంతో ఆమెపై చర్యలు తీసుకున్నారు. ఖేలో ఇండియా గేమ్స్‌లో స్వర్ణ పతకం సాధించిన వెయిట్‌లిఫ్టర్ చెల్సీపై ఐదేళ్ల నిషేధం విధించారు. డోప్ పరీక్షలో విఫలమైనందుకు ఆమెపై ఈ శిక్ష పడింది. ఇక నిషేధిత ఆక్సాండ్రోలోన్ వాడినట్లు పరీక్షల్లో తేలడంతో ఓ మైనర్ వెయిట్‌లిఫ్టర్‌ను కూడా తాత్కాలికంగా సస్పెండ్ చేశారు.

ఏడుగురు అథ్లెట్లు సస్పెండ్

డోపింగ్ కేసుల్లో అథ్లెటిక్స్‌కు చెందిన ఏడుగురు పేర్లు తాజా తాత్కాలిక సస్పెన్షన్ జాబితాలో నమోదయ్యాయి. క్వార్టర్‌మైలర్ కౌశల్ కుమార్, స్టీపుల్‌చేజర్ జుర్ఝార్ సింగ్, లాంగ్ డిస్టెన్స్ రన్నర్ బల్జీత్ కౌర్ తదితరులపై కూడా నాడా చర్యలు తీసుకుంది. దీంతో భారత అథ్లెటిక్స్‌లో డోపింగ్ అంశం మరోసారి చర్చనీయాంశంగా మారింది.

